



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 95 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 15 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 95 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 15 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# కుట్రలు చేస్తే... మీ అందరినీ
# రాజకీయ సమాధి చేస్తా



- కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే అన్న బండి సంజయ్
- మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ అంటున్నాయని మండిపాటు
- ఆ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒకటేనని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆ మూడు పార్టీలకు ప్రేమికుల రోజు శుభాకాంక్షలు అని వ్యగ్యంగా అన్నారు. కరీంనగర్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ స్థానాలు వచ్చినప్పటికీ... మేయర్ పీఠం దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ చెబుతున్నాయని... ఏ విధంగా దక్కించుకుంటాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని చెప్పారు. కరీంనగర్ మేయర్ పీఠం తమదేనని బండి సంజయ్ అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తే... కరీంనగర్ నుంచే యుద్ధాన్ని ప్రారంభిస్తానని హెచ్చరించారు. వారందరినీ రాజకీయ సమాధి చేస్తానని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ కార్యకర్తల శక్తి, దమ్ము మీకు తెలియదు అని అన్నారు.

కరీంనగర్ కార్పొరేషన్లో బీజేపీకి కేవలం 13 సీట్లే వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక

ఇచ్చిందని సంజయ్ తెలిపారు. అందుకే, ఈ విజయాన్ని ఇంటెలిజెన్స్ కే అంకితమిస్తున్నామని అన్నారు. మేయర్ పదవి కోసం గుంటనక్కలన్నీ ఏకమయ్యాయని మండిపడ్డారు. బీజేపీ సింహమని, సింగిల్ గానే వస్తుందని చెప్పారు.

మరోవైపు, కరీంనగర్ కార్పొరేషన్లో మొత్తం 66 డివిజన్లు ఉండగా... బీజేపీ 30 డివిజన్లలో జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 స్థానాలకే పరిమితమయ్యాయి. ఈ నెల 16న కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం ఉంటుంది.

## ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది

### బీఆర్ఎస్ పార్టీకి కవిత హెచ్చరిక



- తాము రాజకీయ పార్టీగా మారబోతున్నట్లు తెలియగానే బీఆర్ఎస్ ట్రోలింగ్ చేసిందని ఆగ్రహం
- బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికైనా తప్పులను సరిదిద్దుకోవాలని కవిత సూచన
- వడ్డేపల్లిలో ఏఐఎఫ్‌బీ, తెలంగాణ జాగృతి కలిసి విజయం సాధించిందన్న కవిత

**హైదరాబాద్ పెన్ పవర్:**తమ సంస్థ రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించగానే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు తమను ట్రోలింగ్ చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కానీ తమను లక్ష్యంగా చేసుకున్న వారికి ఒకటే విషయం చెబుతున్నానని, ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని హెచ్చరించారు. ఇప్పుడే తొందరపడి

- మిగతా 2లో...

## బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం




- విజయం అనంతరం తొలి ప్రసంగం చేసిన తారిఖ్ రెహ్మన్
- బంగ్లాదేశ్ ప్రజలకే ఈ విజయం చెందుతుందన్న బీఎన్‌పీ అధినేత
- హక్కులకు అసలైన అర్థాన్ని తిరిగి సంపాదించుకుందామన్న తారిఖ్ రెహ్మన్

**పెన్ పవర్ డెస్క్:**బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధా న్యం ఇస్తామని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిఖ్ రెహ్మన్ పేర్కొన్నారు.

- మిగతా 2లో...

## నరవణే పుస్తకం ఎఫెక్ట్... కీలక నిర్ణయం దిశగా కేంద్రం



- పుస్తకాల విషయంలో కొత్త నిబంధనపై కేంద్రం చర్చ
- 20 ఏళ్ల కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధన తేవాలని భావిస్తున్న కేంద్రం
- రిటైర్ అయ్యాక 20 ఏళ్ళ వరకు సున్నిత అంశాలపై పుస్తకాలు రాయకూడదనే నిబంధన

**పెన్ పవర్ డెస్క్:**మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక

- మిగతా 2లో...



## నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను మేమే కైవసం చేసుకుంటాం

- కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామన్న మహేశ్ గౌడ్
- ఈ ఎన్నికలు కవితకు సంతోషాన్ని ఇచ్చి ఉంటాయని వ్యాఖ్య
- రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభావం ఉండదన్న పీసీసీ ప్రెసిడెంట్

**హైదరాబాద్ పెన్ పవర్:**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంతృప్తిని వ్యక్తం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను కూడా తామే కైవసం

- మిగతా 2లో...



## మేము అనుకున్నన్ని రాలేదు... కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ 30కి పైగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని తాము అంచనా వేశామని... కానీ తుది ఫలితాల్లో ఆ సంఖ్య కొంత మేర తగ్గిందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో

- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు
- 30కి పైగా మున్సిపాలిటీలు వస్తాయని అనుకున్నామన్న కేటీఆర్
- హంగ్ వచ్చిన ప్రాంతాల్లో పరిస్థితి తమకు అనుకూలంగా ఉందని వ్యాఖ్య

- మిగతా 2లో...

## ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం..

### అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం జరిగింది. ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా ఈ కార్ రేసుపై ఇప్పటికే ఏసీబీ విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇప్పటికే కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు కూడా గవర్నర్ అనుమతి ఇచ్చారు.

- మిగతా 2లో...

## మున్సిపల్ పోరులో 'హస్తం' జోరు

### ప్రజల నమ్మకానికి నిదర్శనమన్న రాహుల్, ఖర్గే!




**హైదరాబాద్ పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం పట్ల పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు ఇవాళ రాహుల్ ఎక్స్ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

- మిగతా 2లో...



## ఇమ్రాన్ ఖాన్ కంటిచూపు కోల్పోయే ప్రమాదం...

### సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితంపై అమికస్ క్యూరీ సంచలన నివేదిక
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో కంటిచూపు కోల్పోతున్నారని వెల్లడి
- కుడి కంటి చూపు 15 శాతానికి పడిపోయిందని నివేదికలో స్పష్టీకరణ
- వ్యక్తిగత వైద్యులతో చికిత్సకు అనుమతించాలని సుప్రీంకోర్టు ఆదేశం
- వైద్య కారణాలతో బెయిల్ కోసం ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్

**పెన్ పవర్ డెస్క్:**పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైల్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయన తన కంటిచూపును కోల్పోయే ప్రమాదంలో ఉన్నారని వెల్లడైంది. ఇమ్రాన్ జైలు పరిస్థితులపై

- మిగతా 2లో...

## లోకల్ ఓటు ఉంటేనే 'ఎక్స్ అఫీషియో' పవర్

### ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఈసీ షాక్!




**హైదరాబాద్ పెన్ పవర్:** మేయర్, మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నికల్లో ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటు హక్కుపై స్టేట్ ఎలక్షన్ కమిషన్ (ఎస్ఈసీ) క్లారిటీ ఇచ్చింది. రాజ్యసభ సభ్యులు, ఎమ్మె ల్సీలకు స్థానిక ఓటు హక్కు తప్పనిసరి అని పేర్కొంది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకపోతే ఎక్స్ అఫీషియో సభ్యులుగా అనర్హులని తెలిపింది. హైకోర్టు తీర్పు మేరకు ఈసీ కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. నిబంధనల ప్రకారం అర్హత లేని వారు వేసే ఓట్లు చెల్లవని స్పష్టం చేసింది. ఈమేరకు కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సర్క్యు లర్ జారీ చేసింది.

- మిగతా 2లో...

## కేంద్ర కేబినెట్ కీలక్ నిర్ణయాలు..

## గడె బెళ్లూరు,మహబూబ్ నగర్ 4 లైన్ల హైవేకు ఆమోదం

**హైదరాబాద్ పెన్ పవర్:**కేంద్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధాని కార్యాలయం పేరు మార్పు, నోయిడా మెట్రో లైన్ నిర్మాణం, గడె బెళ్లూరు– మహబూబ్ నగర్ 4 లైన్ల హైవే కు నిధుల విడుదల కు ఆమోదం తెలిపింది.

గడెబెళ్లూరు నుంచి మహబూబ్ నగర్ మధ్య 4 లైన్ల జాతీయ రహదారికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.రూ. 3వేల 715 కోట్లు నిధులను విడుదల చేసింది. నోయిడా మెట్రో విస్తరణ ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 11.6 కిలోమీటర్ల మెట్రో లైన్ నిర్మాణానికి రూ.2,254 కోట్ల రూపాయల కేటాయింపులు చేపడుతున్నట్లు పేర్కొంది. నాలుగేళ్లలోనే ఈ ప్రాజెక్టు

- మిగతా 2లో...



## ఎడిటర్ వ్యూ

# నేటి తరానికి ఆదర్శం ధర్మబిక్షం సేవాభావం

ఆయన స్వాతంత్ర్య సమర యోధులు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు. నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు. నిబద్దత కలిగిన రాజకీయ నాయకులు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ప్రజా మద్దతుతో ఎన్నికై, అత్యంత సామాన్య జీవితం గడిపిన అసామాన్య నాయకులు. ఆయనే బొమ్మగాని ధర్మబిక్షం. బొమ్మగాని ధర్మబిక్షం యువకుడిగా విద్యార్థి నాయకులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు. ఆర్య సమాజ్ బాధ్యులు. ప్రజా జీవితమే పరమావధిగా ఆజన్మ బ్రహ్మచారిగా గడిపిన ఆదర్శ నాయకులు. సామా జిక సేవకునిగా, గ్రామీణ పేదల హక్కుల కోసం పోరాటం, యువత, విద్యార్థులు అసంఘటిత కార్మికుల సంఘటితం, పేదలకోసం భూమి, ఇళ్ళు కొనుగోలు లాంటి కార్యక్రమా లలో అకుంఠిత కార్యదీక్ష, అంకిత భావంతో నిరంతరం అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన నల్లగొండ జిల్లాలోని మునుగోడు మండలం, ఊకొండి గ్రామంలో బొమ్మగాని ముత్తి లింగయ్య గౌడ్, పద్మ దంపతులకు 1922 ఫిబ్రవరి 15లో జన్మించారు. బొమ్మ గాని ధర్మబిక్షం తండ్రి చిన్నవయస్సులో సూర్యాపేటకు వచ్చి స్థిరపడ్డారు. ధర్మభిక్షం సూర్యాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే జాతీయ భావాలు అలవరుచు కున్నారు. నిజాం పట్టాభిషేక రజతోత్సవాల సందర్భంగా పాఠశాలలో ఉత్స వాలు జరపాలన్న ప్రధానోపాధ్యా యుడి ఆదేశాలను వ్యతిరేకించి తోటి విద్యార్థులతో కలిసి బహిష్క రించారు. సామాజిక రుగ్మతలపై పోరాడటం కోసం తన సహ విద్యార్థులకు శిక్షణనివ్వటానికి విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు.సోవియట్ సోషలిస్ట్ విప్లవం, భారత దేశంలో జరిగిన అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు నల్గొండ జిల్లాలో మొదటి కమ్యూనిస్ట్ సెల్‌ను స్థాపించడానికి ధర్మభిక్షంను ప్రేరేపించాయి. అలా 1942లో సీపీఐలో చేరి,కమ్యూనిస్టు పార్టీతో అనుబంధాన్ని ఏర్పరచుకుని, ధర్మభిక్షం పార్టీలో పనిచేస్తూనే పాత్రికేయులుగా తెలంగాణలోని నాటి ప్రముఖ పత్రికలైన మీజాన్, రయ్యత్, గోల్కొండల్లో పనిచేశారు. నిజాంపై సాయుధ పోరాటం మొదలైన తర్వాత తుపాకి చేత బట్టి యుద్ధరంగంలోకి దిగారు. సాయుధ పోరాటాన్ని విస్తరింప జేశారు. దేశ్‌ముఖ్ వ్యతిరేక పోరాటంలో భాగంగా పేరుమోసిన భూస్వామి విస్నూరు రామచంద్రా రెడ్డికి వ్యతిరేకంగా ధర్మభిక్షం విద్యా సంస్థల్లో నిరవధిక సమ్మెను నిర్వహించి,ఏడాదిన్నర పాటు అజ్ఞాత జీవితం గడిపారు. తర్వాత అరెస్టు కాబడి ఐదేళ్లకు పైగా జైలుశిక్షను అనుభవించారు. సూర్యా పేటలో, చంచల్ గూడ సెంట్రల్ జైలు, ఔరంగాబాద్, జాల్నా జైళ్లలో గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలిసారిగా హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సూర్యాపేట నియోజక వర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు 1957లో నకిరేకల్ నుండి, 1962లో నల్గొండ నుండి ప్రాతినిధ్యం వహించారు. 1991లో, 1996లోనూ ఆయన ఎంపీగా నల్గొండ లోకసభ నియోజక వర్గం నుండి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. 1996 లో 11వ లోక్‌సభ ఎన్నికలలో నల్లగొండ నుండి 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికి ఆయన 76 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన చివరి వరకు పోరాడారు. తెలంగాణ ప్రాంతంలో శ్రమ జీవులను సమైక్య పర్చడంలో, పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం పాత్ర మారవ లేనిది. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం ప్రధాన పాత్ర వహించి 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు తెచ్చు కున్నారు. ధర్మభిక్షం తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు.1951–73లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జిల్లా మండలి, నల్గొండ కార్యదర్శిగా, 1952–57, 1957–62, 1962–67 ఆంధ్రప్రదేశ్ శాసనసభ శాసన సభ్యులుగా, 1972 నుండి ఆంధ్రప్రదేశ్ సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1991లో 10వ లోక్ సభ సభ్యులుగా, 1991–96 సంప్రదింపుల కమిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యులుగా.1992–95 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1996 లో 11వ లోక్ సభ సభ్యులుగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), జాతీయ మండలి సభ్యులుగా పనిచేసిన విశేష అనుభవం గడించారు. నిజాం హయాంలో రైతాంగ ఉద్యమంలో పాల్గొని, భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్ర పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ లో 2019 నవంబర్ 8న రోజున బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ధర్మబిక్షం నీతి, నిజాయితీకి ఆదర్శనీ యుడని ఆయన జీవిత చరిత్రను పాఠ్యాం శంలో చేర్చాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆ సందర్భం గా అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. జీవితాంతం ప్రజా సేవకే అంకితమై, సోదరుని కుమారున్ని దత్తత తీసుకుని, అవివాహితులుగానే ఉన్నారు. 89 ఏళ్ళ వయసులో ఇంట్లో జారి పడటంతో ఆయన తుంటి ఎముకకు దెబ్బ తగలగా, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసు పత్రిలో ఫిబ్రవరి 11న శస్త్రచికిత్స జరిపించుకొని, తర్వాత ఊపిరి తిత్తుల సమస్యతో చికిత్స పొందుతూ 2011, మార్చి 26న మరణించారు. పోరాట యోధుని గా, అసామాన్య ప్రజా సేవకునిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు.

# ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది

- మొదటి పేజి తరువాయి
మాట జారవద్దని, తమపై కారుకూతలు కూయవద్దని బీఆర్ఎస్ వారిని హెచ్చరించారు.
ఇప్పటికైనా మీ తప్పులను సరిదిద్దుకోవాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వారు ఉద్యమకారులను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, గతంలో 90 శాతం మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్ ఈసారి 16 స్థానాలకే పరిమితమైందని కవిత గుర్తు చేశారు. ప్రజల మద్దతును ఎందుకు కోల్పోయామో బీఆర్ఎస్ ఆలోచించాలని సూచించారు.ఉత్తర తెలంగాణలో బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ పనిచేసిందని కవిత ఆరోపించారు. ఆ రెండు పార్టీల పొత్తుకు ఇది తొలి మెట్టు అన్నారు. కాంగ్రెస్ పార్టీతో మిలాఖత్ అయిన సీపీఐకి కొత్తగూడంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతివ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై సాంబశివరావు చేసిన ఆరోపణలను అంగీకరిస్తున్నారా అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. తెలంగాణలో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఆ లోటును తెలంగాణ జాగృతి భర్తీ చేస్తుందని కవిత పేర్కొన్నారు. బీజేపీ కరీంనగర్‌లో తప్ప ఎక్కడా గెలవలేదని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ రూ.30 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. తమకు 17 స్థానాలు రావడమే చాలా ఎక్కువ అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడటం విచిత్రమని కవిత అన్నారు.గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిబంధనలను ఉల్లంఘించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు.

**వడ్డేపల్లి మున్సిపాలిటీ విజయంపై కవిత**

జాగృతి రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించిన తర్వాత తమ పార్టీకి చెందిన నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారని అన్నారు. తక్కువ సమయంలోనే ప్రజలు తమను ఆదరించారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ కలిసి పోటీ చేసి అద్భుత విజయాన్ని
సాధించాయని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తాము 40 వార్డులు గెలుచుకున్నామని అన్నారు. అధికారికంగా 33 స్థానాల్లో తమ అభ్యర్థులు విజయం సాధించారని, మరో 7చోట్ల సాంకేతిక కారణాల వల్ల స్వతంత్రులుగా గెలిచారని వెల్లడించారు. ముఖ్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో
తమకు స్పష్టమైన మెజారిటీ వచ్చిందని కవిత వెల్లడించారు.తమ విజయంలో తెలంగాణ జాగృతి ప్రమేయం లేదని ఏఐఎఫ్‌బీ నాయకుడు వడ్డేపల్లి శ్రీనివాసులు నిన్న ప్రకటించారు. అయితే ఈరోజు కవిత ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అంబటి బోజిరెడ్డి, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించడం గమనార్హం. వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి, ఏఐఎఫ్‌బీ కలిసి కైవసం చేసుకున్నాయని కవిత స్పష్టం చేశారు.

# మేము అనుకున్నన్ని రాలేదు... కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే

- మొదటి పేజి తరువాయి
కాంగ్రెస్ పార్టీపై కూడా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని అన్నారు. హంగ్ ఫలితాలు వచ్చిన మున్సిపాలిటీల్లో పరిస్థితి తమకు అనుకూలంగా ఉందని కేటీఆర్ చెప్పారు. చైర్మన్ పీఠాలను దక్కించుకోవడంలో కీలకమైన ఎక్స్ అఫీషియో ఓట్ల విషయంలో ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో చర్చించామని తెలిపారు. తమ పార్టీకి ప్రజాప్రతినిధులు ఉన్న ప్రతి చోటా కచ్చితంగా పట్టు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ
గాలిలో మేడలు కట్టిందని, కానీ క్షేత్ర స్థాయిలో ప్రజలు వారికి ఆశించినన్ని మున్సిపాలిటీలను ఇవ్వలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో ఆయన బీజేపీపై సెటైర్లు వేశారు. నిజామాబాద్, కరీంనగర్ వంటి ఒకటి రెండు ప్రాంతాల్లో మినహా ఆ పార్టీ ప్రభావం ఎక్కడా కనిపించలేదని అన్నారు.

# ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం..

- మొదటి పేజి తరువాయి
ఈ కేసులో రాజకీయ, అధికారులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి రావడంతో ఏసీబీ ఛార్జ్‌షీట్‌కు దాఖలు చేసేందుకు సిద్ధమైంది.
రేసు'లో హెచ్ఎమ్‌డీఏ భాగస్వామి కాకపోయినా, దాని ఖాతా నుంచి రూ.54.88 కోట్లు చెల్లించారు. ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే కేటీఆర్ ఇందుకు ఒత్తిడి తెచ్చారని ఏసీబీ నివేదికలో వెల్లడించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిబంధనలను తుంగలో తొక్కి విదేశీ కంపెనీలకు ఫండ్స్ మంజూరు చేయడం మరో అభియోగం. నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో నిధులు బదిలీ చేయడంతో హెచ్ఎండీఏ ఆదాయ పన్ను శాఖకు రూ.8 కోట్లకు పైగా జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఫార్ములా –ఈ కార్ రేసుకు సంబంధించి మూడేళ్లలో 600 కోట్ల రూపాయలు చెల్లించేలా ఒప్పందాలు జరిగినట్టు దర్యాప్తు సంస్థలు తేల్చాయి.

# నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను మేమే కైవసం చేసుకుంటాం

- మొదటి పేజి తరువాయి
చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఈరోజు సమావేశమవుతానని... ఈ భేటీలో కార్పొరేషన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ ఎన్నికలు కల్వకుంట్ల కవితకు సంతోషాన్ని ఇచ్చి ఉండవచ్చని మహేశ్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకు పతనమవుతోందని... రాబోయే రోజుల్లో ఆ పార్టీ ప్రభావం ఉండదని చెప్పారు. మతాన్ని రెచ్చగొట్టినా మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఏమీ సాధించలేకపోయిందని
ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ ఎన్నికల ఫలితాలతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తన పట్టును మరింత పెంచుకున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం

- మొదటి పేజి తరువాయి
సార్వత్రిక ఎన్నికల్లో విజ యం సాధించిన అనంతరం ఆయన తొలి ప్రసంగం చేశారు. తమ విజయం బంగ్లాదేశ్ ప్రజలకే చెందుతుందని అన్నారు. ఇప్పుడు మనమంతా స్వేచ్ఛను పొందామని, హక్కులకు అసలైన అర్థాన్ని తిరిగి సంపాదించుకున్నామని ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన వారందరికీ ఈ విజయన్ని అంకితమిస్తున్నామని అన్నారు. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలే దేశ విదేశాంగ విధానాన్ని నిర్ణయిస్తాయని అన్నారు. కాగా, భారత్, చైనా వంటి దేశాలతో సంబంధాలలో సమతుల్యత పాటిస్తామని తారిఖ్ రెహ్మాన్ గతంలో అన్నారు. రెండు దేశాల నిర్ణయాలు, ప్రయోజనాలపై ఆధారపడి భారత్‌తో తమ సంబంధాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

# నరవణే పుస్తకం ఎఫెక్ట్... కీలక నిర్ణయం దిశగా కేంద్రం

- మొదటి పేజి తరువాయి
నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తోంది. మిలిటరీ అధికారులు, అత్యున్నత పదవుల్లోని వ్యక్తులకు సంబంధించిన పుస్తకాల విషయంలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకురావాలని భావిస్తోంది.ప్రస్తుతం పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల సిబ్బంది పుస్తకాలు రాయడానికి, ప్రచురించడానికి 20 సంవత్సరాల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' మార్గదర్శకాలను ప్రవేశపెట్టడాన్ని కేంద్రం పరిశీలిస్తోందని తెలుస్తోంది. ఆయా అధికారులు పదవుల నుంచి రిటైర్ అయిన తర్వాత ఇరవై సంవత్సరాల వరకు వారి పుస్తకాలు పబ్లిష్ కాకుండా తప్పనిసరిగా ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది.
ఇటీవల జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ విషయం చర్చించారని ఆంగ్ల మీడియాలో వార్తలు వచ్చాయి. సీనియర్ సైనిక అధికారులతో సహా ఉన్నత పదవులు నిర్వహించిన వారు సున్నితమైన అంశాలపై పుస్తకాలు రాయడానికి తప్పనిసరి కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధనను తీసుకురావాలని ఎక్కువ మంది మంత్రులు సమర్థించారని తెలుస్తోంది. అయితే ఇది కేబినెట్ అధికారిక అజెండాలో భాగం కాలేదని, సాధారణ చర్చగా సాగిందని పేర్కొన్నారు.

# కేంద్ర కేబినెట్ కీలక్ నిర్ణయాలు.. గడె బెళ్లూరు,మహబూబ్ నగర్ 4 లైన్ల హైవేకు ఆమోదం

- మొదటి పేజి తరువాయి
నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపింది.ఢిల్లీ –అంబాల మధ్య 2 కొత్తరైల్వే లైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు కేబినెట్ తెలిపింది.
స్టార్టప్ ఇండియా ఫండ్ కోసం పదివేల కోట్ల రూపాయల కేటాయింపుతో పాటు దేశంలో రెండు లక్షల స్టార్టప్ సంస్థలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. రాష్ట్రాలు, మున్సిపల్ సంస్థలకు కేంద్రం మరింతగా నిధులు సమకూర్చే అవకాశం ఉంది.

# ఇమ్రాన్ ఖాన్ కంటిచూపు కోల్పోయే ప్రమాదం...

- మొదటి పేజి తరువాయి
సుప్రీంకోర్టుకు సమర్పించిన అమికస్ క్యూరీ (కోర్టుకు సహాయకుడు) నివేదిక ఈ షాకింగ్ విషయాలను బయటపెట్టింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇమ్రాన్ ఆరోగ్యం క్షీణించిందని పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ పత్రిక 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' తన సంపాదకీయంలో తీవ్రంగా విమర్శించింది.కోర్టు నియమించిన అమికస్ క్యూరీ సల్మాన్ సఫ్దార్, ప్రధాన న్యాయమూర్తి యహ్యా అఫ్రిది నేతృత్వంలోని ధర్మాసనానికి తన నివేదికను సమర్పించారు. గతేడాది అక్టోబర్ 2025 వరకు 6/6గా ఉన్న ఇమ్రాన్ కుడి కంటిచూపు, సరైన వైద్యం అందకపోవడం వల్ల ఇప్పుడు 15 శాతం కంటే తక్కువకు పడిపోయిందని నివేదికలో స్పష్టం చేశారు. కంటి వైద్యుడిని సంప్రదించేందుకు అనుమతించాలని పలుమార్లు కోరినా జైలు సూపరింటెండెంట్ పట్టించుకోలేదని పేర్కొన్నారు.
ఈ నివేదికతో పాకిస్థాన్ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. దీనిపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు, ఇమ్రాన్‌కు వ్యక్తిగత వైద్యులతో చికిత్స అందించాలని, విదేశాల్లో ఉన్న తన కుమారులతో ఫోన్‌లో మాట్లాడేందుకు అనుమతించాలని ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 16వ తేదీలోగా తమ
ఆదేశాలను అమలు చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. రాజకీయ ఖైదీ పట్ల ప్రభుత్వ తీరును 'క్రిమినల్ నిర్లక్ష్యం'గా అభివర్ణించిన ట్రిబ్యూన్ పత్రిక, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.ఇదిలా ఉండగా, వైద్య కారణాల దృష్ట్యా తోషాఖానా–×× కేసులో తనకు విధించిన శిక్షను నిలిపివేసి, బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ ఇమ్రాన్ ఖాన్ శనివారం ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కుడి కంటిలో రక్తం గడ్డకట్టడం వల్ల చూపు తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

# దామోదరం సంజీవయ్యకు జగన్ నివాళి

దామోదరం సంజీవయ్య జయంతి

**దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ జగన్ కితాబు**

**పేదల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని ప్రశంస**



దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయనకు వైసీపీ అధినేత జగన్ నివాళులు అర్పించారు. ఎక్స్ వేదికగా జగన్ స్పందిస్తూ... అణగారిన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు అని కొనియాడారు. పేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కితాబునిచ్చారు. ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు.

# మున్సిపల్ పోరులో 'హస్తం' జోరు

- మొదటి పేజి తరువాయి
స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రశంసనీయమైన విజయాన్ని అందించిన అంకితభావం కలిగిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు నా కృతజ్ఞతలు. పీపుల్స్ తెలంగాణ నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా కాంగ్రెస్ పయనిస్తుందని స్పష్టం చేశారు.

**ప్రజల నమ్మకానికి నిదర్శనం: మల్లికార్జున ఖర్గే**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ప్రజల నమ్మకానికి నిదర్శనం అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. పార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృ ద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు నమ్మకం ఉంచారని, ఆ నమ్మకమే ఈ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించిందని ఖర్గే పేర్కొన్నారు.






# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

## ఇందూరు కోటపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే..
# లెక్క తేల్చేసిన ఎన్నికల సంఘం!

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలోనే మూడో అతి పెద్ద నగరమైన ఇందూరు హస్తగతం కానుంది. నిజామాబాద్ కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగిరే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఎక్స్ అఫీషియో సభ్యుల విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నియమావళి ప్రకారం కాంగ్రెస్, ఎంఐఎం కలిపి మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు చేజిక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎల్లుండి మధ్యాహ్నం మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

కరీంనగర్ బీజేపీకి పట్టం కట్టగా.. నిజామాబాద్ రెండు స్థానాల్లో వెనుకబడిన కారణంగా మేయర్ పీఠాన్ని దక్కించుకోలేక పోతోంది. మొత్తం 28 కార్పొ రేటర్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. నగర పరిధిలో ఓటు హక్కు ఉన్న రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు మాత్రమే ఎక్స్ అఫిషియో సభ్యులుగా అవకాశం ఉంటుంది. ఈ లెక్కన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తాకు మాత్రమే ఇక్కడ ఓటు హక్కు ఉంటుంది. వారిద్దరినీ కలుపుకొంటే బీజేపీకి 30 ఓట్లు వస్తాయి. ఈ ప్రాంతం నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా
కొనసాగుతున్న అంజిరెడ్డికి, టీచర్స్ ఎమ్మెల్సీగా ఉన్న మల్క కొమురయ్యకు నిజామాబాద్ నగరంలో ఓటు హక్కు లేదు. దీంతో వారు ఎక్స్ అఫీషియో సభ్యులగా ఓటు హక్కు వినియోగించుకొనే పరిస్థితి లేదు. ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ 17, మజ్లిస్ 14 సీట్లలో గెలుపొందింది. అంటే మొత్తం 31 సీట్లు, 60 సీట్లున్న ఈ కార్పొరేషన్లో 31 సీట్ల స్పష్టమైన మెజార్టీ సాధించే అవకాశం కనిపిస్తోంది. ఎలాంటి ఎక్స్ అఫీషియో సభ్యుల సపోర్టు లేకుండానే ఇందూరుపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడే అవకాశం ఉంది.

## కారుతో ఢీకొట్టి, గొంతు కోసి.. అడ్వకేట్ స్వప్న హత్య కేసులో
# వీడిన మిస్టరీ: సొంత అన్నే నిందితుడు!



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యాయవాది గోటికె స్వప్న హత్యకు భూవివాదమే కారణమని పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు, మృతురాలి సొంత అన్న గోటికె రాజుతో అతడికి సహకరించిన మరో ముగ్గురు సహచరులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ చేవెళ్ళ జోన్ డీసీపీ యోగేశ్ గౌతమ్ వివరాలు మీడియాకు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలోని కేతిరెడ్డిపల్లిలో ఈ నెల 4న మహిళా న్యాయవాదిని పథకం ప్రకారం హత్య చేశారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం నడుస్తుండగా భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో కారుతో ఢీకొట్టి తర్వాత రాళ్లు కర్రలతో దాడి చేశారు. దాడి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేసి ఇన్నోవా కారు, స్కూటీలో పారిపోయారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేసిన పోలీసులు నిందితుల మొబైల్ ఫోన్లు, హత్యకు ఉపయోగించిన కొడవలి స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రాజుతో పాటు హత్యతో సంబంధం ఉన్న ఎర్రోళ్ల సందీప్, వడ్డె వీరేశం, కావలి శివలింగంలను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.మహిళా యువ న్యాయవాది హత్య పై ఫిర్యాదు చేయడానికి వస్తే తీసుకోకుండా బైటికి వెళ్లాలని బెదిరించినట్లు ఆరోపిస్తూ న్యాయవాదుల ధర్నా చేశారు. కేసులో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు. మొయినాబాద్ ఎస్ ఐ నరసింహారావు ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు.




## కొత్తగూడెం మేయర్ పీఠంపై
# వీడిన ఉత్కంఠ..

### కాంగ్రెస్ సపోర్ట్‌తో కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా

**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం, పీసీసీ, సీపీఐ నేతల చర్చలు సఫలం కావడంతో కొత్తగూడెం మేయర్ పీఠంపై ఉత్కంఠకు తెరపడింది. కాంగ్రెస్– సీపీఐ పొత్తుతో మేయర్ పీఠం కైవసం చేసుకోవాలని ఇరు పార్టీలు ఒప్పందానికి వచ్చాయి. మేయర్ పదవి సీపీఐకి ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. దీంతో.. డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు ఖరారైంది. 4 స్థానాల్లో ఒంటరిగానే మెజారిటీ సాధించిన సంగతి తెలిసిందే. నల్గొండ, రామగుండం, మంచిర్యాల, మహబూబ్‌నగర్ కార్పొరేషన్లలో జెండా ఎగురవేసింది. నల్గొండలో మొత్తం 48 సీట్లకు 27 చోట్ల, రామగుండంలో 60 సీట్లకు 38, మంచిర్యాలలో 60 సీట్లకు 44 స్థానాల్లో గెలుపొందింది. మహబూబ్ నగర్‌లో కూడా ఆ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వచ్చింది.కాంగ్రెస్ పార్టీ సహకారంతో కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగురనున్నది. ఇక్కడ 60 సీట్లకు కాంగ్రెస్, సీపీఐకి చెరో 22 సీట్లు వచ్చాయి. ముందుగా బీఆర్ఎస్‌తో సీపీఐ పొత్తు పెట్టుకొని ఎన్నికలకు పోయింది. కానీ, బీఆర్ఎస్‌కు కేవలం 8 సీట్లు మాత్రమే వచ్చాయి.రెండు పార్టీలకు కలిపి మెజారిటీ రాకపోవడంతో సీఎం రేవంత్ స్వయంగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావుకు ఫోన్ చేసి మాట్లాడారు. తాము మద్దతిస్తామని చెప్పడంతో సీపీఐ ఊపిరి పీల్చుకున్నది. పోలింగ్‌కు ముందు మొదట ఎవరికివారుగా పనిచేసినా చివరికి కలవడంతో రెండు పార్టీల మధ్య సయోధ్య కుదిరినట్లయింది. ఈ పరిణామంతో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

## ‘గులాబీ’ బాటలో బెల్లంపల్లి కౌన్సిలర్లు
### కేటీఆర్‌ను కలిసి మంతనాలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పుర రాజకీయం ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఒకరు, ఆ పార్టీ రెబెల్ అభ్యర్థి, భాజపా తరపున గెలిచిన ఏకైక కౌన్సిలర్.. భారాస వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ మున్సిపల్ ఎన్నికల్లో 34 వార్డులకు గాను.. కాంగ్రెస్‌కు 14, భారాసకు 14, స్వతంత్రుల (కాంగ్రెస్ రెబెల్స్)కు 5, భాజపాకు ఒక వార్డు దక్కాయి. ఐదుగురు కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థుల్లో నిచ్చకోల వంశీ, మత్తమారి రాయమల్లు, పీక ఎల్లాబాయి, పోలు ఉమాదేవిలు కాంగ్రెస్ శిబిరానికి తరలివెళ్లగా..

- మిగతా 4లో...

## బండి సంజయ్ వారియర్ అర్జునుడి
# పాత్రకు ఫిట్ అవుతారు

**రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వమేమీ కాదన్న ఎంపీ**

**కార్పొరేటర్లను కాంగ్రెస్ బలవంతంగా ఎత్తుకెళితే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరిక**

**ముఖ్యమంత్రిని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారన్న ధర్మపురి అరవింద్**



**హైదరాబాద్ పెన్ పవర్:**బండి సంజయ్ ఒక వారియర్ అని, ఆయన అర్జునుడి పాత్రకు ఫిట్ అవుతారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వమేమీ కాదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలమైన స్థాయిలో ఏమీ లేరని వ్యాఖ్యానించారు. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారని, ఇప్పుడు కార్పొరేటర్లను ఎత్తుకెళితే మరింత ఛీకొడతారని అన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్ ఫలితాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకున్నామని అన్నారు. తన పార్లమెంట్ పరిధిలో కూడా బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లను గెలుచుకున్నామని ధర్మపురి అరవింద్ వెల్లడించారు. కాంగ్రెస్ లౌకిక వాద పార్టీ కాదని, ఓ బ్రోకర్ పార్టీ అని దుయ్యబట్టారు. ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. తమ పార్టీ అభ్యర్థులను పోలింగ్ బూత్‌ల నుంచి పంపించినందుకు నేనే వారిపై కేసు పెట్టాలని ఆయన అన్నారు. కానీ పోలీసులే తనపై కేసు పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పోలీసులు చెప్పారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఎత్తుకెళ్లడానికి కాంగ్రెస్ పార్టీకి పోలీసులు సహకరిస్తున్నారని విమర్శించారు. రాజకీయాలను భ్రష్టు పట్టించారనే కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు ఓడించారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే దారిలో నడుస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో హుందాతనం ముఖ్యమని అన్నారు. ఎవరికి మద్దతు ఇవ్వాలనేది కార్పొరేటర్లు నిర్ణయించుకుంటారని తెలిపారు. కానీ బలవంతంగా ఎత్తుకెళ్లడం సరికాదని అన్నారు. కరీంనగర్‌లోను బండి సంజయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటిందని ప్రశంసించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వేములవాడలో మహాశివరాత్రి
# వేడుకలు ప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున డిప్యూటీ ఈవో లోకనాథం, అధికారులు రాత్రి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వీరికి రాజన్న ఆలయ అధికారులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈవో లోకనాథం మాట్లాడుతూ.. గత 28 ఏళ్లుగా తితిదే తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాజన్న ఆలయ ఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



# రూ 20 కోట్లతో పరిశోధనా కేంద్రం ఏర్పాటు

**హైదరాబాద్ పెన్ పవర్:**
సమగ్ర ఇంజినీరింగ్ సేవలు అందించేందుకు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నట్లు స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ వెల్లడించింది. ఇందుకోసం జిన్నారం దగ్గర రూ.240 కోట్లతో హెవీ ఇంజినీరింగ్ ఉత్పత్తుల విభాగాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు సంస్థ ప్రమోటర్, మేనేజింగ్ డైరెక్టర్ కందుల నాగేశ్వర రావు తెలిపారు. సంస్థకు కొత్త కార్పొరేట్ పేరును (స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ నుంచి స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ) ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చమురు, గ్యాస్, న్యూక్లియర్ ప్లాంట్లలో ఉపయోగించే ఉత్పత్తుల తయారీ చేపట్టనున్నట్లు వివరించారు. తొలి దశలో రూ.120 కోట్లు పెట్టుబడి పెడుతున్నామని, 2027 జూన్లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. త్వరలోనే ఐటీ సంస్థలకూ విస్తరించబోతున్నట్లు తెలిపారు. కొత్త తరం సాంకేతికతల కోసం రూ.20 కోట్లతో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.విజయవాడ రైల్వే స్టేషన్లో కదులుతున్న రైలు ఎక్కుతూ.. ఒక ప్రయాణికుడు ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. అక్కడే ఉన్న ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఎం.నరసింహారావు వెంటనే స్పందించి, ఆ ప్రయాణికుడిని ప్లాట్ఫారమ్ పైకి లాగి ప్రాణాలు కాపాడారు. అనంతరం ఎమర్జెన్సీ బ్రేక్ వేసి రైలును నిలిపివేశారు. కానిస్టేబుల్ సమయస్ఫూర్తిని ప్రయాణికులు మరియు అధికారులు అభినందిస్తున్నారు.

# కొత్తగూడెంలో పంచాయితీ తేలేనా

**ఖమ్మం, ఫిబ్రవరి 14: పెన్ పవర్:** కొత్తగూడెం కార్పొరేషన్ పీఠాన్ని దక్కించుకునే క్రమంలో తెలంగాణ రాజకీయం ఆసక్తికర మలుపు తిరిగింది. అక్కడ కాంగ్రెస్ పార్టీకి మేయర్ పదవి దక్కకుండా చేసేందుకు, తమ పార్టీకి చెందిన ఎనిమిది మంది కార్పొరేటర్ల మద్దతును సీపీఐకి ఇస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. అయితే, ఈ ప్రకటన చేసే ముందు ఆయన కనీసం తమ పార్టీ కార్పొరేటర్లతో గానీ, ఖమ్మం జిల్లా కీలక నేతలతో గానీ సంప్రదించకుండానే నేరుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు ఫోన్ చేసి చెప్పారు.. తర్వాత ప్రెస్మీట్ లో ప్రకటించారు. కేటీఆర్ మద్దతు ప్రతిపాదనను సీపీఐ స్వీకరిస్తుందా అంటే అనుమానమే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే సీపీఐ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీతో ధృడమైన పొత్తులో ఉంది. కేవలం తెలంగాణలోనే కాకుండా జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుండి కాంగ్రెస్ మద్దతుతోనే విజయం సాధించారు. స్థానిక ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు కుదరక విడివిడిగా పోటీ చేసినంత మాత్రాన, మేయర్ పదవి కోసం కాంగ్రెస్తో బంధాన్ని తెంచుకుని బీఆర్ఎస్తో చేతులు కలిపే అవకాశాలు ఉండవు. కేటీఆర్ ఫోన్ కాల్పై స్పందించిన కూనంనేని.. తమ నిర్ణయం వ్యక్తిగతం కాదని, జాతీయ నాయకత్వ నిర్ణయం మేరకే నడుచుకుంటామని స్పష్టం చేశారు. దీని వెనుక ఉన్న అంతరార్థం ఏమిటంటే.. ఒక మేయర్ పదవి కోసం జాతీయ స్థాయిలో కాంగ్రెస్తో ఉన్న సంబంధాలను సీపీఐ పణంగా పెట్టదు. అధికారంలో ఉన్న కాంగ్రెస్తో కలిసి మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను పంచుకుని స్థానిక పాలనను సాఫీగా సాగించడానికే ఆ పార్టీ మొగ్గు చూపే అవకాశం ఉంది. గతంలో మునుగోడు ఉప ఎన్నికల సమయంలో సీపీఐ మద్దతు కోసం బీఆర్ఎస్ చాలా హామీలిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ పొత్తులు కొనసాగిద్దామని కేసీఆర్ చెప్పారు. అయితే మునుగోడు విజయం తర్వాత కనీసం ప్రగతి భవన్ గేట్లు కూడా తెరవకుండా కమ్యూనిస్ట్ నేతలను బీఆర్ఎస్ విస్మరించిందనే అసంతృప్తి వారిలో బలంగా ఉంది. ఆ చేదు అనుభవాల తర్వాతే సీపీఐ నేతలు కాంగ్రెస్ గూటికి చేరారు. నిజానికి కొత్తగూడెంలో సీపీఐకి మేయర్ పదవి కట్టబెట్టాలనే ప్రేమ కంటే, కాంగ్రెస్-సీపీఐ మధ్య చిచ్చు పెట్టి ఆ కూటమిని బలహీనపరచడమే కేటీఆర్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. సీపీఐ గనుక ఈ ఆఫర్కు మొగ్గు చూపితే, కాంగ్రెస్ నుండి వారిని శాశ్వతంగా దూరం చేయవచ్చని ఆయన భావిస్తున్నారు. కానీ, రాజకీయ పరిణతి కలిగిన కమ్యూనిస్ట్ పార్టీలు కేటీఆర్ వేసిన ఈ బంతి 'ని జాగ్రత్తగా గమనిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, కొత్తగూడెం కార్పొరేషన్లో కాంగ్రెస్ మరియు సీపీఐలు కలిసి అధికారాన్ని పంచుకునే అవకాశాలే మెండుగా ఉన్నాయని భావించవచ్చు.

# వనపర్తి మున్సిపల్ చైర్మన్ ఆకాశం కల్పించండి



**వనపర్తి. పెన్ పవర్:**
వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో 2 వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శ్రీమతి బి రమాదేవి కృష్ణ వరుసగా 3 సార్లు విజయం సాధించి హైట్రిక్ సాధించారు 1995 లో కాంగ్రెస్ పార్టీ 2 వార్డు లో గెలిచి 30 సంవత్సరాల తర్వాత నేడు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గా శ్రీమతి బి రమాదేవి కృష్ణ గారు విజయం సాధించి కాంగ్రెస్ పార్టీకి బహుమానంగా నిలిచారు గతంలో బి కృష్ణ కూడా హైటెక్ సాధించారు 2 000 సంవత్సరాలో మున్సిపల్ వైస్ చైర్మన్ గా 2007 లో మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ గా 2014 లో మున్సిపల్ వైస్ చైర్మన్ గా వరుసగా 3 సార్లు విజయం సాధించి హైట్రిక్ సాధించారు మున్సిపల్ ఎన్నికల్లో భార్యాభర్తలు హైట్రిక్ సాధించడం చరిత్ర నే వనపర్తి పట్టణం అభివృద్ధి విషయంలో అనేక అనుభవం ఉన్న ధైర్యంగా నిజాయితీగా మున్సిపల్ చైర్మన్ ఇలా ఉండాలి అనే పేరు ప్రజల్లో తీసుకొస్తాను అవకాశం ఇవ్వండి అని కాంగ్రెస్ పార్టీ ని కోరుతున్నాను ఎమ్మెల్యే మేఘ రెడ్డి ని తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి ని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి ని కోరుతున్నాను వనపర్తి ప్రజలు మమ్మల్ని కోరుకుంటున్నారు ఈ వనపర్తి ప్రజల కోసం విద్యార్థి దశ నుంచి అనేక ఉద్యమాలు ప్రజా సమస్యల కొరకు పోరాటాలు చేశాను అవకాశం ఇవ్వండి బి కృష్ణ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కాంగ్రెస్ నాయకులు వనపర్తి గత 30 సంవత్సరాలుగా వనపర్తి పట్టణంలో రెండో వార్డు పరిధిలో ప్రజలకు ఎన్నో సమస్యల మీద పరిష్కరిస్తూ వారికి అండగా ఉంటూ వారి అండతో 30 సంవత్సరాలుగా కౌన్సిలర్ అభ్యర్థిగా గెలుపొందుతూ ప్రజలకు సేవ చేస్తున్నామని ఈసారి ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ మున్సిపల్ చైర్మన్ గా పి రమా దేవికి ఆకాశం కల్పించాలని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రికి ముఖ్యమంత్రికి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి కి ఎంపీ మరియు చేస్తున్నట్లు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బి కృష్ణ పత్రిక విలేకరుల ద్వారా కా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# షుగర్ 230 ఉన్నప్పుడు అరటి పండు తినవచ్చా!

**కరీంనగర్: పెన్ పవర్:** డాక్టర్. డిసి .తిరుపతిరావు ఎండి. సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ మాట్లాడుతూ.. మధుమేహం ఉన్న వ్యక్తుల్లో రక్తంలో చక్కెర స్థాయి 230 ఎంజి /డిల్ గా ఉండటం అంటే అది సాధారణ స్థాయికి మించి ఉన్నదని అర్థం మరియు ఈ సమయంలో ఏ ఆహారం తీసుకోవాలో చాలా జాగ్రత్తగా నిర్ణయించాలి ఎందుకంటే తినే ప్రతి పదార్థం రక్తంలో గ్లూకోజ్ స్థాయిని ప్రభావితం చేస్తుంది కాబట్టి ఆలోచించి ఆహారం తీసుకోవడం అత్యంత అవసరం..
అరటి పండు సహజంగా తియ్యగా ఉంటుంది మరియు ఇందులో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి కాబట్టి ఇది తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయి పెరిగే అవకాశం ఉంటుంది అయితే అరటి పండులో ఫైబర్, పొటాషియం, విటమిన్ బి6 వంటి పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి అందువల్ల పూర్తిగా నిషేధించాల్సిన అవసరం లేకపోయినా పరిమితి చాలా ముఖ్యము.
షుగర్ స్థాయి 230 ఉన్న సమయంలో వెంటనే అరటి పండు తినడం మంచిది కాదు ఎందుకంటే ఇప్పటికే రక్తంలో గ్లూకోజ్ ఎక్కువగా ఉన్నందున అదనంగా కార్బోహైడ్రేట్లు తీసుకుంటే అది మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది కాబట్టి ముందుగా నీరు తాగి, తేలికపాటి నడక చేసి, వైద్యుల సూచన మేరకు మందులు లేదా ఇన్సులిన్ తీసుకోవడం ద్వారా షుగర్ నియంత్రణలోకి వచ్చాక మాత్రమే పండు గురించి ఆలోచించాలి.
అరటి పండును తినాలనుకుంటే పూర్తిగా పండిన పెద్ద అరటి కాకుండా చిన్న సైజు అరటి లేదా సగం అరటి మాత్రమే తీసుకోవడం మంచిది మరియు అది కూడా భోజనం తర్వాత కాకుండా భోజనంతో కలిసి లేదా ప్రోటీన్ ఉన్న ఆహారంతో కలిసి తీసుకుంటే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా సహాయపడుతుంది ఎందుకంటే ప్రోటీన్ మరియు ఫైబర్ గ్లూకోజ్ విడుదలను నెమ్మదిగా చేస్తాయి.
మధుమేహ రోగులు గ్లైసెమిక్ ఇండెక్స్ అనే భావనను తెలుసుకోవడం అవసరం ఎందుకంటే గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉన్న ఆహారాలు రక్తంలో చక్కెరను వేగంగా పెంచుతాయి మరియు అరటి పండు మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన పండుగా పరిగణించబడుతుంది కాబట్టి పరిమితి పాటిస్తే సాధారణంగా తీసుకోవచ్చు కానీ షుగర్ అధికంగా ఉన్న సమయంలో మాత్రం జాగ్రత్త అవసరం.రోజువారీగా షుగర్ 200 పైగా ఉంటే అది నియంత్రణలో లేనట్టే భావించాలి మరియు ఆహారం, వ్యాయామం, మందుల విషయంలో డాక్టర్ సలహా తీసుకోవాలి ఎందుకంటే నిరంతరం అధిక చక్కెర స్థాయిలు గుండె, మూత్రపిండాలు, కళ్ళు మరియు నరాలపై ప్రభావం చూపవచ్చు కాబట్టి దీర్ఘకాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం..సారాంశంగా చెప్పాలంటే షుగర్ 230 ఉన్నప్పుడు వెంటనే అరటి పండు తినడం మంచిది కాదు కానీ షుగర్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత పరిమిత మోతాదులో, సరైన సమయానికి తీసుకోవచ్చు మరియు ప్రతి వ్యక్తి శరీర ప్రతిస్పందన వేరుగా ఉండే కారణంగా మీ వ్యక్తిగత వైద్యుని సలహా తీసుకుని ఆహార నియమాలు పాటించడం ఉత్తమమైన మార్గం.. డాక్టర్. డిసి. తిరుపతిరావు ఎండి. సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ తెలిపారు.

# ఎం.ఎల్.ఏ క్యాంపు కార్యాలయంపై గులాబీ జెండా


**వనపర్తి. పెన్ పవర్:** ధనప్రవాహం, ప్రలోభాలను తట్టుకొని పట్టు నిలుపుకున్న నిరంజనుడు.హోరాహోరీగా పోరాడిన బి.ఆర్.ఎస్ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపిన నిరంజన్ రెడ్డి.
మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఈరోజు బి.ఆర్.ఎస్,సి.పి.ఎం.పార్టీ నుండి గెలిచిన కౌన్సిలర్స్ ను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగం,ధన ప్రవాహం,ప్రలోభాలకు పాల్పడి విజయం సాధించిందని నైతిక విజయం తమదేనని అన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీ హయాంలో కేవలం 5సీట్లు మాత్రమే కాంగ్రెస్ సాధించిందని నేడు ప్రతిపక్షంగా పోరాటం సాగిస్తూ 8సీట్లలో బి.ఆర్.ఎస్,మిత్రపక్షంగా సి.పి.ఎం పార్టీ 1సీటు మొత్తం 9స్థానాలలో విజయం సాధించడం సంతోషం అని అన్నారు. 4,5,12 సీట్లలో స్వల్ప మెజారిటీతో ఓడిపోయామని, స్వయంగా ఎం.ఎల్.ఏ క్యాంపు కార్యాలయం



వార్డులో గులాబీ జెండా రెపరెపలాడించామని ఓట్లపరంగా ప్రజలలో బి.ఆర్.ఎస్ పార్టీకి ఆదరణ పెరిగిందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో హోరాహోరీగా పోరాడిన అభ్యర్థులకు,శ్రమించిన బి.ఆర్.ఎస్ శ్రేణులకు నిరంజన్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# శభాష్...రేవంత్

**హైదరాబాద్ పెన్ పవర్:**
రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలకు గాను కాంగ్రెస్ పార్టీ 64 చోట్ల జయకేతనం ఎగురవేసింది. అలాగే 7 కార్పొరేషన్లలో మూడింటిని కైవసం చేసుకుంది. మంచాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లు హస్తం ఖాతాలో చేరాయి. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 13



మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లతో సరిపెట్టుకుంది. మరో 38 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించలేదు. దీంతో ఛైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్ ఎన్నికల కోసం స్వతంత్రులు, చిన్న పార్టీల మద్దతు కూడగట్టేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) 100కు పైగా స్థానిక సంస్థలను గెలుచుకోగా, ఈసారి ఆ పార్టీ పనితీరు గణనీయంగా తగ్గింది. ఇక బీజేపీ సొంతంగా ఒక్క మున్సిపాలిటీని గెలవనప్పటికీ, తమ ఎంపీ స్థానాలైన కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో అతిపెద్ద పార్టీగా అవతరించింది.మొత్తం 2,582 మున్సిపల్ వార్డులకు గాను కాంగ్రెస్ 1,347, బీఆర్ఎస్ 717, బీజేపీ 261 వార్డులను గెలుచుకున్నాయి. బుధవారం జరిగిన ఈ ఎన్నికల్లో 73 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా, శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తిచేశారు.

## 'గులాబీ' బాటలో బెల్లంపల్లి కౌన్సిలర్లు కేటీఆర్ను కలిసి మంతనాలు..

-3 పేజి తరువాయి
సుఖేసిని భరద్వాజ్ భారాస గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది. 26వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ ఇప్ప కుమారస్వామి, 30వ వార్డు కాంగ్రెస్ రెబల్ కౌన్సిలర్ సుఖేసిని భరద్వాజ్ తండ్రి శంకర్సింగ్లు శనివారం మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో భారాసలో చేరారు. వారితో పాటు 34వ వార్డు భాజపా కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి కూడా కేటీఆర్ వద్దకు వెళ్లారు. వీరంతా ఆయనతో చర్చలు జరిపారు. మరోవైపు.. కాంగ్రెస్ తరఫున గెలిచిన మహిళా కౌన్సిలర్ ఇప్ప అర్చన.. ఛైర్పర్సన్ పీఠం కోసం భారాసతో సంప్రదింపులు జరుపుతున్నారు.

## మహాశివరాత్రికి ముస్తాబైన ఏడుపాయలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే వనదుర్గా భవాని మాత జాతరకు మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల సర్వాంగ సుందరంగా ముస్తాబయింది.
మహా శివరాత్రి మహోత్సవంలో మొదటి రోజు 15 న ప్రధాన ఘట్టమైన జాతర, రెండో రోజు 16 న బండ్లు తిరుగుట, మూడో రోజు 17 న రథోత్సవం మూడు రోజుల పాటు ఇక్కడ జాతర అంగరంగ వైభవంగా జరుగనుందనీ , తెలుగు రాష్ట్రాలతోపాటు, పొరుగున ఉన్న కర్నాటక, మహారాష్ట్ర నుంచి దాదాపు 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేయడంతో ప్రభుత్వ యంత్రాంగం. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారని ఆలయ ఈవో వీరేశం తెలిపారు. జాతర రోజుల్లో రద్దీ విపరీతంగా ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకుని వీఐపీ దర్శనం, ప్రత్యేక దర్శనం, సర్వ దర్శనాలకు వేర్వేరు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. రాజగోపురం నుంచి ఆలయం వరకు వెళ్లే దారిలో ఎండ తగలకుండా ఉండేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు .జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు మెదక్ ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 900 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్పి ప్రసన్నకుమార్ తెలిపారు.

## ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం పలువురికి గాయాలు

**యాదాద్రి: పెన్ పవర్:** యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామ పరిధిలోని బృందావన్ ల్యాబ్ ఫార్మా కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. కంపెనీలోని రెండు భారీ రియాక్టర్లు ఒక్కసారిగా పేలిపోవడంతో యూనిట్ పూర్తిగా నేలమట్టమైంది. ప్రమాద సమయంలో ఆరుగురు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు లోపల ఉన్నారు. పేలుడు సంభవించడంతో వెంటనే బయటకు పరుగులు తీశారు. కార్మికులకు స్వల్ప గాయాలు కావడంతో వారిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం పోలీసులు వారిని ఇండ్లకు పంపించారు.రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు...

## పాలేరు రిజర్వాయర్ లోకి దూసుకుపోయిన కారు ఒకరు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్లోకి కారు దూసుకెళ్లడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు.సూర్యాపేట నుంచి ఖమ్మం వస్తున్న కారు అదుపుతప్పి పాలేరు జలాశయం లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారును బయటకు తీసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జరిగిన ప్రమాదం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారు



**సిద్దిపేట: పెన్ పవర్:** సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియా సమావేశం నిర్వహించారు.
తలసాని మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారు. రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టం. తెలంగాణ రాష్ట్రన్నీ అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారని అన్నారు.
గతంలో నీరు, విద్యుత్ లేక రాష్ట్రంలో రైతులు ఇబ్బంది పడ్డారు. పండించిన పంట కు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారు. నేను టీడీపీ లో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేది. అందరి పోరాటం వల్ల వచ్చిన రాష్ట్రాన్ని కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారు. జ. సిద్దిపేట ను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వం లో కుదేలు అయిందని అన్నారు.
కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటీతే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయి. కేసీఆర్ తెచ్చిన రైతుబంధు పథకంను ఐక్యరాజ్య సమితి అభినందించింది. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుంది. మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు, మద్యం ఏరులై పారింది. - కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్ల లాగా గెలిచింది. మా కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారు. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవు. ఆర్ టి సి లో మహిళా లకు ఫ్రీ పెట్టీ పురుషులకు డబుల్ రెట్లు పెంచారని విమర్శించారు..

# కార్పొరేషన్లలలో కారుకు పంక్చర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, పెన్ పవర్:** తెలంగాణ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్‌లా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏడు కార్పొరేషన్ల ఎన్నికల్లో గులాబీ పార్టీ కనీసం ఉనికిని కూడా చాటుకోలేక, అన్ని చోట్లా మూడో స్థానానికి పరిమితమైంది. పట్టణ ఓటర్లు ఈసారి బీఆర్ఎస్ అగ్రనేతల కంచుకోటలను సైతం బద్దలు కొడుతూ అధికార కాంగ్రెస్ , బీజేపీల వైపు స్పష్టంగా మొగ్గు చూపారు. ఈ ఫలితాలు పార్టీ నాయకత్వానికి శరాఘాతంగా మారాయి.మున్సిపల్ కార్పొరేషన్లలో అత్యధికంగా నల్గొండ లో కాంగ్రెస్ తన విజయకేతనం ఎగురవేసింది. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థులు కనీసం రెండో స్థానంలో కూడా నిలవలేకపోయారు. అటు రామగుండం కార్పొరేషన్‌లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం సాధించగా, బీఆర్ఎస్ సింగిల్ డిజిట్ స్థానాలకే పరిమితమైంది. ప్రజలు అభివృద్ధి వైపు మొగ్గు చూపుతూ అధికార పార్టీకి భారీ మెజారిటీని కట్టబెట్టారు.కరీంనగర్ కార్పొరేషన్ లో కూడా బీఆర్ఎస్‌కు పరాభవం తప్పలేదు. కరీంనగర్, నిజామాబాద్‌లలో బీజేపీ మేయర్ పీఠాల దిశగా దూసుకుపోతుండగా, కాంగ్రెస్ గట్టి పోటీని ఇచ్చింది. కానీ, ఒకప్పుడు ఈ రెండు కార్పొరేషన్లను శాసించిన బీఆర్ఎస్ మాత్రం కేవలం నామమాత్రపు సీట్లకే పరిమితమైంది. ఇక్కడ బీజేపీ-కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోరు సాగింది. కొత్తగూడెం కార్పొరేషన్ లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. ఇక్కడ కాంగ్రెస్, సీపీఐ పార్టీలు సమాన స్థానాల్లో నిలిచాయి. అయితే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీపీఐకి అన్‌కండిషనల్ ఆఫర్ ఇచ్చింది. అయితే రాష్ట్ర స్థాయిలో పొత్తు ఉన్నందున సీపీఐ మాత్రం కాంగ్రెస్‌తో కలిసి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. మహబూబ్‌నగర్, మంచిర్యాల కార్పొరేషన్లలో కూడా కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది.అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, పలు కార్పొరేషన్ డివిజన్లలో స్వతంత్ర అభ్యర్థుల ఓట్ల కంటే బీఆర్ఎస్ అభ్యర్థులకు తక్కువ ఓట్లు వచ్చాయి. ఇది పార్టీ క్షేత్రస్థాయిలో ఎంతగా బలహీనపడిందో తెలియజేస్తోంది. కేవలం సిరిసిల్ల, సిద్దిపేట వంటి కొన్ని మున్సిపాలిటీలకు మాత్రమే బీఆర్ఎస్ పరిమితం కాగా, కార్పొరేషన్ల స్థాయిలో మాత్రం ఘోరంగా విఫలమైంది. ప్రస్తుత ట్రెండ్స్ ప్రకారం మొత్తం ఏడు కార్పొరేషన్లలో నల్గొండ, మహబూబ్‌నగర్, మంచిర్యాల, రామగుండం కాంగ్రెస్ వశం కాగా.. నిజామాబాద్, కరీంనగర్‌లలో



బీజేపీ మేయర్లు కొలువుదీరే అవకాశం ఉంది. కొత్తగూడెంలో కాంగ్రెస్-సీపీఐ కూటమి అధికారంలోకి రానుంది. ఈ ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ప్రభ తగ్గుతోందనడానికి సంకేతమని భావిస్తున్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కాంగ్రెస్ పతనానికి ఎమ్మెల్యే సంజయే కారణం

**కరీంనగర్: పెన్ పవర్:** కురు సామ్రాజ్య పతనానికి శకుని ఏ విధంగా కుట్రపూరితంగా దోహదపడ్డాడో.. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ పతనానికి.. ఎమ్మెల్యే సంజయ్ కారకుడు అయ్యాడని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. జగిత్యాలలో 40 స్థానాలు గెలుస్తామనుకుంటే.. 20-22 స్థానాలకి పరిమితమైంది. ఇప్పటికైనా మాకు స్వేచ్ఛ ఇవ్వండని కాంగ్రెస్ పార్టీ అధిష్టానికి వేడుకుంటున్నానని అన్నారు.

## రేవంత్ సత్తా చూపించిన ఎలక్షన్స్

**వరంగల్, మార్చి 14, పెన్ పవర్:** మనం ఇంట్లో అన్నం తింటున్నప్పుడు.. స్వేచ్ఛగా వ్యవహరించగలుగుతాం. ఎక్కడో ఒకచోట కూర్చుని ఆహారాన్ని లాగించేస్తూ ఉంటాం. అలాకాకుండా హోటల్లో తింటే ఒక పద్ధతి ప్రకారం వ్యవహరిస్తూ ఉంటాం. ప్రాంతం మారినప్పుడు.. తినే ఆహారం మారినప్పుడు ఆటోమేటిక్ గా మన వ్యవహార శైలిలో మార్పు వచ్చేస్తూ ఉంటుంది.పై ఉపోద్ఘాతం రాజకీయాలకు కచ్చితంగా వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక ప్రాంతీయ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకుడు స్వేచ్ఛగా పనిచేసుకోగలుగుతాడు మంచి అనేది ఏదైనా జరిగితే తన ఖాతాలో వేసుకోగలుగుతాడు. నిర్ణయాలు తీసుకునే విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉంటాడు. తనే హై కమాండ్ కాబట్టి ఇంకొకరికి సమాధానం చెప్పకుండా.. అసలు సమాధానమే చెప్పాల్సిన అవసరం లేకుండా వ్యవహరిస్తూ ఉంటాడు.కానీ ఒక జాతీయ పార్టీలో పనిచేసే వ్యక్తికి ఇలా ఉండదు. అతడు ప్రతి ఒక్కరికి సమాధానం చెప్పాలి. తీసుకునే నిర్ణయాన్ని ముందుగానే వెల్లడించాలి. పార్టీకి ఇబ్బంది రాకుండా.. ప్రభుత్వానికి ఒత్తిడి ఎదురుకాకుండా చూసుకోవాలి. ప్రతికూలతలు ఎదురైనప్పుడు సమయమనం తో.. సానుకూలతలు వచ్చినప్పుడు ఆశావాహ దృక్పథంతో పనిచేయాల్సి ఉంటుంది.తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు సాధించింది. ఏకపక్షమైన విజయాలు కాకుండా.. గట్టి పోటీ ఎదుర్కొని మెజారిటీ స్థానాలను దక్కించుకుంది. ఇదే సమయంలో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో స్థానాలను దక్కించుకున్నాయి.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు కాబట్టి ఫలితాలు అంతగా ఏకపక్షంగా లేవు. అదే ఒకవేళ ప్రాంతీయ పార్టీకి గనుక రేవంత్ రెడ్డి నాయకత్వం వహిస్తే ఫలితాలు మొత్తం ఏకపక్షంగా ఉండేది. క్షేత్రస్థాయిలో అనేక ప్రతికూలతలను అధిగమించి 2023లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చాడు రేవంత్ రెడ్డి. ఎన్నికల సభల్లో కూడా అన్ని తానై నడిచాడు. ఇప్పుడు ఫలితాల విషయం కూడా రేవంత్ రెడ్డి అనేక ప్రతికూలతలను అధిగమించాడు. తనను తాను మరోసారి నిరూపించుకున్నాడు. ఒకవేళ రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ లేదా కేటీఆర్ గనక ఉండి ఉంటే ఫలితాలు ఏకపక్షంగా ఉండేవి. పైగా ఎన్నికల విషయంలో గులాబీ పార్టీ అడ్డగోలుగా వ్యవహరించేది. సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో పై సీన్ రిపీట్ అయింది. కాకపోతే ఈసారి కాంగ్రెస్ పార్టీ స్వేచ్ఛాయుత విధానంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల అధికార పక్షానికి గౌరవం.. ప్రతిపక్షానికి తోడ్పాటు ప్రజల నుంచి లభించాయి. ఇదిగో ఇక్కడే రేవంత్ రెడ్డి గెలిచాడని.. అసలు సిసలైన నాయకుడిగా ఆవిర్భవించాడని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపించడానికి ప్రధాన కారణం రేవంత్ రెడ్డి దూకుడు. రేవంత్ రెడ్డి దాదాపుగా అన్ని జిల్లాలోని ప్రధాన కేంద్రాలలో బహిరంగ సభలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో గెలవాల్సిన అనివార్యతను వెల్లడించారు. తద్వారా తెలంగాణ ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీ వైపు దృష్టి సారించే విధంగా చేశారు.రేవంత్ రెడ్డి పాచిక వల్ల కాంగ్రెస్ పార్టీ భారీగా స్థానాలను సాధించినప్పటికీ.. ఒక మున్సిపాలిటీ విషయంలో మాత్రం రేవంత్ రెడ్డి స్థాయి సరిపోలేదు. ఆ మున్సిపాలిటీ పేరు సిరిసిల్ల. భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ ఎలాగైనా కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని రేవంత్ రెడ్డి ప్రయత్నించారు. చివరి వరకు అన్ని రకాలుగా వ్యూహాలు అమలు చేశారు. ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించారు.సిరిసిల్ల ఓటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీకి కాకుండా.. గులాబీ పార్టీకి జై కొట్టారు. ఇక్కడ 39 వార్డులకు 27 వార్డులను బిఆర్ఎస్ పార్టీ సొంతం చేసుకుంది. ఆరువార్డులలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఐదు వార్డులలో బిజెపి గెలుపును సాధించింది. ఒక వార్డులో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. తద్వారా రేవంత్ రెడ్డి పాచికలు కేటీఆర్ ముందు పారలేదు. వాస్తవానికి ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలవడానికి అనేక రకాలుగా ప్రయత్నం చేసింది. ఎన్నికలకు ముందే ఇక్కడ భారీగా అభివృద్ధి పనులు చేసింది. కాంగ్రెస్ పార్టీలోకి వలసలను కూడా ఆహ్వానించింది. అయినప్పటికీ ఎన్నికల ఫలితాలలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది.

## తెలంగాణలో మొదలైన అసలైన రాజకీయం

**హైదరాబాద్, మార్చి 14, పెన్ పవర్:** రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు వింత పరిస్థితిని తెచ్చిపెట్టాయి. మెజారిటీ చోట్ల కాంగ్రెస్ జెండా ఎగిరినప్పటికీ, సుమారు 12 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో 'హంగ్' ఏర్పడింది. ఇప్పుడు ఈ మున్సిపాలిటీల్లో పీఠాన్ని దక్కించుకోవాలంటే స్వతంత్ర అభ్యర్థుల మద్దతు అనివార్యంగా మారింది.సాధారణంగా గెలిచిన స్వతంత్రులను తమవైపు తిప్పుకోవడానికి పార్టీలు భారీ ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. కానీ, ఈసారి సీన్ రివర్స్ అయ్యింది. “మద్దతు కావాలంటే మాకే చైర్మన్ పదవి ఇవ్వాలి” అంటూ స్వతంత్రులు డిమాండ్ చేస్తున్నారు. తమ పార్టీ గుర్తుపై గెలిచిన సీనియర్లను కాదని, బయటి వ్యక్తికి చైర్మన్ పదవి ఎలా ఇవ్వాలో తెలియక కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

**క్యాంపు రాజకీయాలు:**

అభ్యర్థులు చేజారిపోకుండా ఉండేందుకు పార్టీలు ఇప్పటికే 'క్యాంపు' రాజకీయాలకు తెరలేపాయి. గెలిచిన వారిని రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు.అలియాబాద్ (మేడ్చల్ జిల్లా): ఇక్కడ 20 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 7 స్థానాలు సాధించాయి. ఒక్క సీటు గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి గాదె వెంకటేష్ ఇప్పుడు నిర్ణయాత్మక శక్తిగా మారారు. చైర్మన్ పదవి ఇచ్చే పార్టీకే నా మద్దతు అని ఆయన తేల్చి చెప్పారు.జనగామ: ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ బలబలాలు సమానంగా ఉండటంతో, స్వతంత్ర అభ్యర్థి పాండు కోసం రెండు పార్టీల నేతలు బాహాబాహీకి దిగారు. తనను చైర్మన్ చేస్తామంటేనే వస్తానని ఆయన షరతు విధించడం విశేషం.ఒకవేళ భారీ ఆఫర్లు ఇచ్చి స్వతంత్రులకు చైర్మన్ పదవి కట్టబెట్టినా, వారు తర్వాత వేరే పార్టీలోకి జంప్ అయితే పరిస్థితి ఏంటన్నది పార్టీల ఆందోళన. ప్రస్తుతం ఈ 'హంగ్' మున్సిపాలిటీల్లో గెలిచిన అభ్యర్థులకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో, రాజకీయ సమీకరణాలు గంటగంటకూ మారుతున్నాయి. మరో వైపు కేవలం గద్వాల మాత్రమే కాకుండా వర్ధన్నపేట, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లోనూ ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పోలీసులతో బెదిరించి బలవంతంగా తమ పార్టీలో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఈ నెల 17 లేదా 18వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో భరోసా సొమ్ములు

**హైదరాబాద్: పెన్ పవర్:** తెలంగాణలో ఫిబ్రవరి 17 లేదా 18 నుంచి రైతు భరోసా సాయం జమకు సిద్ధం. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలపై రైతుల ఖాతాల్లో నిధులు. కొత్త దరఖాస్తులపై ఇంకా స్పష్టత లేదు..హైదరాబాద్ రైతాంగం ఆశగా ఎదురు చూస్తున్న రైతు భరోసా సాయం సొమ్ములు ఫిబ్రవరి 17వ తేదీ లేదా 18వ నుంచి బ్యాంకు ఖాతాల్లో వేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. రాష్ట్ర ఆర్థిక శాఖ రైతు భరోసా పథకానికి అవసరమైన నిధులను ఇప్పటికే సమకూర్చుకున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి ఆదేశాలు రాగానే బ్యాంకు ఖాతాల్లో సాయం సొమ్ములు జమ చేయున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం, ప్రజల నుంచి సానుకూలత ఉండడంతో మార్చి నెలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో ఉంది..ఈ నెలాఖరు కు పరిషత్ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

గత వానాకాలంలో 2025-26 ఖరీఫ్ సీజన్, 69,39,548 మంది లబ్ధిదారుల ఖాతాలలో రైతు భరోసా సాయం వేశారు. ఒక ఎకరా కు రూ.6 వేల చొప్పున మొత్తం రూ.8,744.13 కోట్లు బదిలీ చేశారు. తొలి రోజు ఒక ఎకరా నుంచి ప్రారంభించి మొత్తం తొమ్మిది రోజుల పాటు ఈ మొత్తాన్ని వారి వారి ఖాతాల్లో జమ చేశారు. వీరందరికీ ఈసారి కూడా బదిలీ చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేశారు. బోగస్ లబ్ధిదారులను ఏరివేసేందుకు హైదరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాటిలైట్ సర్వే నిర్వహించారు. ఎక్కడ సాగు భూమి ఉంది, బోగస్ లబ్ధిదారులు ఎవరు అనే వివరాలతో ఇటీవలే వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ఈ సర్వేతో ఏమాత్రం సంబంధం లేకుండా వానాకాలంలో రైతు భరోసా అమలు చేసిన వారందిరికీ, ఈసారి కూడా అమలు చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. వానాకాలంలో 1.46 కోట్ల ఎకరాల భూములకు రైతు భరోసా చెల్లించారు. యాసంగిలో కూడా 1.46 కోట్ల ఎకరాలకు వర్తింప చేయనున్నారు. అయితే ఇందుకు



అవసరం అయ్యే నిధులు సమకూర్చుకునేందుకు ఈ నెల 10వ తేదీన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.9వేల కోట్ల రుణం తీసుకున్నది. మున్సిపల్ ఎన్నికల కోడ్ ఈ నెల 16వ తేదీతో ముగియనున్నందున 17 లేదా 18వ తేదీ నుంచి రైతుల ఫోన్ నెంబర్లకు టింగ్ టింగ్ మంటూ మెస్సేజీలు రానున్నాయి. జనవరి నెల సంక్రాంతి పండుగ ముందే ఈ మొత్తాన్ని జమ చేయాల్సి ఉండగా నిధుల లభ్యత లేకపోవడంతో ఈ నెలకు వాయిదా పడింది..

వానాకాలం తరువాత పలు జిల్లాల్లో వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు జరిగాయి. కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారికి నమోదు కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. పలువురు రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం అనుమతిస్తే తప్ప కొత్తవారి దరఖాస్తులు స్వీకరించే పరిస్థితి లేదని అధికారులు చెప్పి పంపిస్తున్నారు. ఎప్పటి నుంచి కొత్త దరఖాస్తులు స్వీకరిస్తారనేది రైతులు చర్చించుకుంటున్నారు. వానాకాలం నుంచి ఇప్పటి వరకు ఏ తేదీని కటాఫ్ గా తీసుకుని నమోదు చేస్తారనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# కోమటిరెడ్డి ధైర్యం ఏంటీ...

**నల్గొండ, ఫిబ్రవరి 14, పెన్ పవర్:** తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలనే సాధించింది. ఈ విజయంతో సంబరాల ఊపులో ఉన్న టైంలోనే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని లేకుంటే డైరెక్ట్‌గా సీఎం కుర్చీనే టార్గెట్ లాక్కుంటానని హెచ్చరించారు. ఇప్పుడే కాదు ఆయన గతంలో కూడా ఇలాంటి కామెంట్స్ చాలా చేశారు. తనను పార్టీలోకి తిరిగి తీసుకున్నప్పుడు మంత్రి పదవి ఆఫర్ చేశారని ఇప్పుడు అది కావాలంటూ చాలా కాలం నుంచి పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అయినా ఆయన్ని ఎవరూ పిలిచి మాట్లాడటం లేదు. ఆయన కామెంట్స్ ఆగటం లేదు. ఇప్పుడు మరోసారి కామెంట్స్‌తో వార్తలకెక్కారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడు. అయితే ప్రతిపక్షంలో ఉన్న టైంలో ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. తర్వాత అక్కడి నుంచి 2023 ఎన్నికల టైంలో మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి పదవి హామీతోనే పార్టీలోకి తీసుకొచ్చినట్టు ఆయన చెప్పుకుంటున్నారు. ఆయన సోదరుడైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. అందుకే ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం రాజగోపాల్ రెడ్డికి మంత్రిపదవి ఇవ్వడం సాధ్యం కాదు. అయినా నాకు మంత్రి పదవి కావాల్సిందేనంటూ మొండికేస్తున్నారు. మంత్రి పదవి ఎలాగైనా సాధించుకోవాలని సమయం వచ్చినప్పుడల్లా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వస్తున్నారు రాజగోపాల్ రెడ్డి. రేవంత్ రెడ్డి టార్గెట్‌గా బాణాలు సంధిస్తూనే ఉన్నారు. ఆయన మాటలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఒకట్రెండు సార్లు పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలిచి మాట్లాడింది. కానీ వాటిని పట్టించుకోవడం లేదు. అందుకే రోజు రోజుకు ఆయన విమర్శల డోసు పెరుగుతూనే ఉంది. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి మరోసారి మంత్రి పదవి అంశాన్ని ప్రస్తావించారు. పార్టీలోకి తీసుకొని వచ్చినప్పుడు తనకు ఇచ్చిన మాట ప్రకారం మంత్రిపదవి ఇవ్వాలని రాజగోపాల్ డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే డైరెక్ట్‌గా సీఎం అవుతానంటూ హెచ్చరించారు. ఇకపై పదవి కావాలని అడుక్కోవడం ఉండదని నేరుగా సమయం వచ్చినప్పుడు సీఎం సీట్లో కూర్చోవడమే ఉంటుందని హెచ్చరించారు. కచ్చితంగా తనకు మంచి పదవి వస్తుందని కూడా నమ్మకం వ్యక్తం చేశారు. ఇలా మున్సిపల్ ఎన్నికల ఫలితాల రోజున ఇలాంటి అసంతృప్తి స్వరం వినిపించడంపై కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం కూడా సీరియస్‌గా ఉంటోంది. పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటాను అంటూ గతంలో రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై కూడా ఇలానే రాజగోపాల్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. ఇది కాంగ్రెస్ రూల్స్‌కు విరుద్ధమని పార్టీని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చే ప్రయత్నాలు ఉన్నాయని ఎక్స్ వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. గత ఆగస్టులో జరిగిన మంత్రివర్గ విస్తరణ టైంలో కూడా విమర్శలు చేశారు. ఆస్తులు అమ్మి పార్టీని గెలిపిస్తే తనను మోసం చేశారని మండిపడ్డారు. తనతోపాటు వచ్చిన వారికి మంత్రిపదవులు ఇచ్చారని తనను మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటేనే రాజగోపాల్ రెడ్డికి పడటం లేదు. ఆయన వేర్వేరు పార్టీల నుంచి వచ్చిన వ్యక్తిని నేరుగా సీఎం సీటులో కూర్చోబెట్టడాన్ని తప్పుపడుతున్నారు. అందుకే సమయం వచ్చినప్పుడల్లా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటుంది రేవంతే అనే భావనలో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. అధిష్ఠానం వద్ద ఏదో ఒకటి చెప్పి ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారనే ఆలోచనలో ఉన్నారు. అందుకే సందర్భం ఏదైనా సరే రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే నీ కుర్చీ లాక్కుంటా అంటూ రేవంత్ రెడ్డికే పరోక్షంగా సవాల్ చేస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యవహార శైలి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తలనొప్పిగా మారుతోంది. ఓవైపు రాజగోపాల్ రెడ్డి, మరోవైపు జీవన్ రెడ్డి, ఇంకో వైపు జగ్గారెడ్డి లాంటి వాళ్లతో సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఇలాంటి విమర్శలు ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారతాయని రాష్ట్ర నాయకత్వం ఎన్ని రకాలుగా చెబుతున్నా వీళ్లు మాత్రం తమ పంథం వీడటం లేదు. సోదరుడు వెంకట్‌రెడ్డి కేబినెట్‌లో ఉండగానే రాజగోపాల్ రెడ్డికి పదవి ఎలా లభిస్తుందని పార్టీలోని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. స్కూల్ పిల్లాడి మాదిరిగా మారం చేస్తున్నారని అంటున్నారు.

# అధికార పార్టీకి గౌరవం.. ప్రతిపక్షాలకు సముచితం

**హైదరాబాద్, మార్చి 14, పెన్ పవర్:** సరిగ్గా తెలంగాణ రాష్ట్రంలో ఒక ఐదు సంవత్సరాల క్రితం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో పెత్తనం మొత్తం కేటీఆర్ ది కాబట్టి.. అడ్డగోలుగా నిబంధనలు మొత్తం మార్చేశాడు. తన పార్టీ మాత్రమే గెలిచే విధంగా విధానాలు రూపొందించాడు. సీన్ కట్ చేస్తే సింహ భాగం మున్సిపాలిటీలలో గులాబీ పార్టీ గెలిచింది. ప్రతిపక్ష కాంగ్రెస్ గెలిచిన చోట కూడా బీఆర్ఎస్ ఆర్థిక బలంతో తొక్కి పారేసింది. క్యాంపు రాజకీయాలు స్టార్ట్ చేసింది.. కొంతమంది అభ్యర్థులను ఏకంగా అపహరించింది. ఇదే ప్రజాస్వామ్యం అంటూ కొత్త సూత్రీకరణకు దిగింది.ఇప్పుడు రేవంత్ పరిపాలన లోకి వద్దాం. ఇదేదో రేవంత్ గురించి భజన చేసే కార్యక్రమం కాదు. ఆయన పరిపాలనకు చిడతలు వాయించే వ్యవహారం అంతకంటే కాదు. బాధ్యత గల మీడియా సంస్థగా మా దృష్టికి వచ్చిన అంశాలను మా వీక్షకులకు అందించడం కోసమే ఈ కథనం పబ్లిష్ చేస్తున్నాం.తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చాలా తేడా ఉంటుంది. తెలంగాణలో సామాజికంగా.. రాజకీయంగా.. ఇతర వ్యవహారాలలో ప్రజలలో చైతన్యం విపరీతంగా ఉంటుంది. నచ్చిన వాళ్లను తెలంగాణ ప్రజలు నెత్తి మీద పెట్టుకుంటారు. అదే నచ్చని వాళ్ళని అయితే నేలకేసి కొడతారు. ఇందులో ఈ పార్టీ.. ఆ పార్టీ అని తేడా లేదు. అన్నిటికీ ఒకే విధమైన ట్రీట్మెంట్ ఇస్తారు తెలంగాణ ప్రజలు.సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం ఏకపక్షంగా మున్సిపల్ ఫలితాలను సాధించిన గులాబీ పార్టీ.. ఈసారి జరిగిన ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలను సాధించింది. కానీ ఇక్కడే కాంగ్రెస్ పార్టీ గులాబీ పార్టీకి అసలు సిసలైన ప్రజాస్వామ్య విలువలను బోధించింది. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికార దర్పాన్ని పెద్దగా వినియోగించలేదు. గులాబీ పార్టీ మాదిరిగా ఏకపక్షంగా వ్యవహరించలేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి స్వయంగా మీకు మంచి చేసే వాడిని ఎన్నుకోవాలని సూచించారు. మీకు కష్టాలు వస్తే ఆదుకునే వ్యక్తికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఆ సూత్రాన్నే తెలంగాణ ప్రజలు ఆచరించారు.అందువల్లే అధికార పార్టీకి గొప్పగా చెప్పుకునే స్థానాలు వచ్చాయి. ప్రతిపక్షాలకు గౌరవప్రదమైన స్థానాలు లభించాయి. ఎవరిని కూడా తక్కువ చూపు చూడలేదు తెలంగాణ ఓటర్లు. బిజెపికి బలం ఇచ్చారు. గులాబీ పార్టీకి పునర్జన్మ ఇచ్చారు. అధికార కాంగ్రెస్ పార్టీకి అండదండగా నిలిచారు. ఆమధ్య మహా రాష్ట్ర లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ విజయం సాధించింది. దాదాపు క్లీన్ స్వీప్ చేసేసింది. ఈ విజయాన్ని అక్కడి అధికార పార్టీ గొప్పగా చెప్పుకుంది.ఇక కేరళ రాష్ట్రంలో కూడా జరిగిన స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి షాక్ తగిలింది. చాలావరకు స్థానాలలో అక్కడి ప్రతిపక్షం విజయం సాధించింది. కొన్ని ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు సత్తా చూపించారు.ఈ రెండు ఉదాహరణలు చాలు స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో చెప్పడానికి. ప్రజలు అయితేనేమో అధికార పక్షానికి లేకుంటేనేమో ప్రతిపక్షానికి ఓట్లు వేస్తున్నారు. తమ ఆగ్రహాన్ని ఏకపక్షమైన తీర్పుగా బ్యాలెట్ బాక్స్ లో వేస్తున్నారు.కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ప్రజలు ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కోరుకుంటున్నారు. దీనికి ప్రభుత్వం కూడా తోడు కావడంతో పరిస్థితి చాలా వరకు ఆశాజనకంగా కనిపిస్తోంది.

# బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్

**హైదరాబాద్ పెన్ పవర్:** సంత్ సేవాలాల్ మహారాజ్‌ను లంబాడీలు దేవుడిగా భావించి కొలుస్తారు. ఆయన జయంతిని పండుగలా జరుపు కొంటారు. గిరిజ నులకు చైతన్యం కలిగించి, వారికి దశ – దిశను చూపి, హైందవ ధర్మం గొప్పదనం, విశిష్టతలను తెలియ జేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని పేర్కొంటారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపం చానికి చాటేలా అహింసా సిద్ధాం తానికి పునాదులు వేసి, సంత్ సేవాలాల్ ఇతర కులాల వారికి కూడా ఆదర్శ మూర్తిగా నిలిచారు.1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా రాంజీనాయక్ తండాలో సేవాలాల్ మహారాజ్ జన్మించారు. జగదాంబ మాతనే తన మార్గ దర్శకురాలిగా, గురువుగా స్వీకరిం చి ఆమె ఆదేశానుసారం బంజారాల సేవలో నిమగ్న మయ్యారు. సేవా లాల్ ప్రజల మూఢ విశ్వాసమైన జంతుబలికి తీవ్ర వ్యతిరేకి. బంజా రాలు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు వివిధ రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగిస్తుండే వారు. రాజుల కాలం నుం చి బ్రిటిష్ కాలం వరకు బంజారాలు ఆయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగించే వారు. ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లిం పాలకుల మత ప్రచారంతో బంజా రా సమాజం అనేక ఇబ్బందులకు గురయ్యింది. అలాంటి పరిస్థితుల లో బంజారాలను మంచి మార్గంలో నడిపించడానికి సేవాలాల్ అవత రించారని చెపుతారు.సాతీ భవానీ (సప్త మాతృకల)' పూజా విధానా లు ఆచరించే బంజారాల జాతికి ఆయనే దార్శనికుడు. ఆయన బోధనల ద్వారా బంజారా జాతి నడచుకుంది. లిపిలేని బంజారాల భాషను ఒక పద్ధతిగా మార్చాడు.సేవాలాల్ శివ పూజారి. ఆయన తండ్రి, తాతలు తెగ పెద్దలు. తొమ్మిది రోజుల పాటు పెళ్లికాని యువతులు తీజ్ ఉత్సవాల్లో పాల్గొని తమకు వివాహం కావాలని పూజలు చేయడం తీజ్ ఉత్సవ సాంప్రదాయం. సంత్ సేవాలాల్ మహారాజ్ ప్రజల కోసం చేసిన ఉద్యమాలలో ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులను అరికట్టడం వంటివి ఉన్నాయి. సన్మార్గంలో తన జాతిని నడిపించి భారత దేశంలోని దాదాపు 10 కోట్లకు పైగా బంజారా లకు ఆరాధ్య దైవంగా ఆయన నిలిచారు. సేవాలాల్ మహరాజ్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారు. వీరిలో 'పెరిఫర్' ఒకటి. ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులు అరికట్టడం, క్షేత్ర ధర్మాన్ని రక్షించడం మొదలైనవి ముఖ్యమైనవి. అహింస మహా పాపమని, మద్యం, ధూమ పానం శాపమని హితవు పలికాడు. ఆ రోజుల్లో నే బంజారాల పరువు ప్రతిష్టల గురించి ఊహించి అహింస సిద్ధాంతానికి పునాది వేశాడు. సంత్ సేవాలాల్ మహరాజ్ మహి మలు అద్భుతమైనవిగా చెప్పు కుంటారు. మహిమల గురించి అనేక కథనాలు ఉన్నాయి. వాటిలో పురుషున్ని స్త్రీగా మార్చడం, ఒక ముంత బియ్యంతో 10,000 మందికి భోజనాలు పెట్టడం, చనిపోయిన వ్యక్తిని మూడు దినాల తరువాత బ్రతికించడం, విషం కలిపిన తీపి వంటకాలను నిర్వీర్యం చేయడం. ఉదృతంగా పారే ప్రవాహాన్ని ఆపి తమ తండా ప్రజలను, ఆవులను దాటించడం లాంటి మహిమలను ప్రదర్శించారని చెపుతారు. బంజారాలు ఎవరికీ హాని తలపెట్టేవారు కాదని, సహాయ గుణం విరివిగా కలవారని, ధైర్య సాహసాలకు ప్రతీకలనీ చరిత్ర ద్వారా స్పష్టం అవుతున్నది.

బంజా రాలు రాజపుత్రుల వలె ధృఢ కాయు లని, చరిత్ర కారుడు కల్నల్ టాడ్ పేర్కొన్నాడు. మధ్య యుగంలో మహమ్మద్ ఘోరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ సైన్యంలో బంజారాలు వీరోచితంగా పోరాడి నట్లు చరిత్ర చెపుతున్నది. దక్కన్ పీఠభూమిలో లంబాడీలు కాకతీయుల కంటే ముందే ఉన్నా రని, సంచార జాతివారైనా వీరు రజాకార్లతో పోరాడారని, నవాబు లు వారి ధైర్యసాహసాలకు మెచ్చి భూములను ఇనాములుగా ఇచ్చా రని గ్రంథస్థం అయి ఉంది. సభ్య సమాజానికి బహు దూరంగా, అడవి తల్లి ఒడిలో ఉంటూ, అటవీ వనరులపై ఆధార పడుతూ, ప్రత్యేక జీవన విధానం కలిగి ఉన్న, అంతగా అభివృద్ధి చెందని తెగల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు ప్రణాళికా బద్ధ కార్యక్ర మాలు అమలు చేస్తున్నా, ఇంకా చేయాల్సిన అవసరం అనివార్యం గా ఉంది. తరతరాలుగా జాతి వివక్షకు గురవుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధిలో వెనుకబడి ఉన్న లంబాడాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

# ప్రజారోగ్యంపై ఎందుకింత నిర్లక్ష్యం?

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో చుట్టుముడుతున్న ఆరోగ్య సంక్షోభం కేంద్ర పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. ఎందుకంటే, ఏ ప్రభుత్వానికైనా ప్రజల ఆరోగ్యమే మౌలిక బాధ్యత. కానీ, ఆ బాధ్యతనుంచి రోజురోజుకూ తప్పించుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే, ఆరోగ్యం పేరుతో ప్రజల నుంచి భారీగా పన్నులు వసూలు చేస్తూనే, అదే స్థాయిలో ఆ రంగానికి నిధులు కేటాయిం చడంలో వెనుకంజ వేసింది. ముఖ్యంగా "హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్సు" పేరుతో వసూలు చేస్తున్న మొత్తం, ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి తగిన విధంగా వినియోగించబడటం లేదన్న విమర్శలకు తాజా గణాంకాలే నిదర్శనం. ప్రస్తుతం ఆదాయపన్ను, కార్పొరేట్ పన్నులపై నాలుగు శాతం హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్సును కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తోంది. 2023– 24లో ఈ సెస్సు ద్వారా సుమారు ఒక లక్షా పద్దెనిమిది వేల కోట్ల రూపాయలు వసూలయ్యాయి.2024–25లో ఇది లక్షా ఇరవై ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. 2026 బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ ఆదాయం లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలను దాటే అవకాశం ఉంది. అంటే ప్రజలు ప్రతి సంవత్సరం లక్ష కోట్లకు పైగా మొత్తాన్ని ప్రత్యేకంగా "ఆరోగ్యం" పేరుతో చెల్లిస్తున్నారు.అయితే ఇదే బడ్జెట్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు కేటాయించిన మొత్తం సుమారు తొంభై రెండు వేల కోట్ల రూపాయలకే పరిమితమైంది. ఆరోగ్యసెస్సు ద్వారా వసూలు చేస్తున్న మొత్తంతో పోలిస్తే ముప్పై నుంచి నలభై వేల కోట్ల రూపాయలు తక్కువగా ఆరోగ్య రంగానికి నేరుగా కేటాయిస్తున్నారు. ఇది కేవలం లెక్కల తేడా కాదు, ఆరోగ్యం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఎంత వెనుకబడి ఉందో చెప్పే స్పష్టమైన సూచిక. కేంద్రం, రాష్ట్రాలు కలిపి ప్రభుత్వ ఆరోగ్య వ్యయం దేశ జీడీపీలో ఇంకా రెండు శాతంలోపే ఉంది. జాతీయ ఆరోగ్య విధానం–2017 ప్రకారం 2025 నాటికి ఈ వ్యయాన్ని జీడీపీలో రెండున్నర శాతానికి పెంచాలని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, తాజా బడ్జెట్ తర్వాత కూడా ఆ లక్ష్యం నెరవేరలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఐదు శాతం లక్ష్యంతో పోలిస్తే భారత్ చాలా వెనుకబడి ఉంది. ప్రభుత్వ ఆరోగ్య వ్యయం తక్కువగా ఉండటంతో దాని ప్రభావం నేరుగా ప్రజలపై పడుతోంది. ప్రస్తుతం దేశంలో మొత్తం ఆరోగ్య ఖర్చుల్లో వ్యక్తిగత జేబు ఖర్చు సుమారు నలభై ఏడు శాతం వరకు ఉంది. అధికారిక ఆరోగ్య ఖాతాల ప్రకారం ప్రతి సంవత్సరం ఆరు నుంచి ఏడు కోట్ల మంది వైద్య ఖర్చుల కారణంగా పేదరికంలోకి జారిపోతున్నారు.

ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో కీలకమైన భాగమైన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్ల పరిస్థితి కూడా ఆందోళన కలిగించేదే. కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నప్పటికీ, వాటికి తగిన నిధులు, అధ్యాపకులు, పరికరాలు సమకూరడం లేదు. అనేక కాలేజీల్లో బోధనా సిబ్బంది కొరత, ల్యాబ్‌లు, లైబ్రరీలు, హాస్టళ్ల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. టీచింగ్ హాస్పిటళ్లలో పడకలు, ఐసీయూ సదుపాయాలు, ఆధునిక పరికరాల కొరత వల్ల రోగుల సంరక్షణతో పాటు వైద్య విద్య నాణ్యత కూడా దెబ్బతింటోంది. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులపై రోగుల భారం రోజురోజుకీ పెరుగుతోంది. కానీ, ఆ భారం మోయడానికి అవసరమైన బడ్జెట్, మానవ వనరులు అందుబాటులో లేవు. ఫలితంగా విద్యార్థులు సరైన క్లినికల్ అనుభవం పొందలేకపోతున్నారు, అధ్యాపకులు బోధనకంటే సేవల భారంతో అలసిపోతున్నారు. ఇది భవిష్యత్తు వైద్యుల తయారీపైనే ప్రభావం చూపుతోంది. ఇంత జరుగుతున్నా, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్సు ద్వారా వచ్చిన నిధులు చట్టపరంగా ప్రత్యేక ఆరోగ్యనిధిగా కేటాయించబడటం లేదు. ఈ మొత్తం కేంద్ర సమగ్రనిధిలో కలిసిపోతుంది. అంటే ఆరోగ్య పేరుతో వసూలు చేసిన డబ్బులో ఎంత భాగం నిజంగా ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు,

ప్రజారోగ్య కార్యక్రమాలకు ఖర్చయిందో ప్రజలకు స్పష్టమైన సమాచారం లేదు. ఈ పారదర్శకత లోపమే అసలు సమస్య. దేశంలో నాన్–కమ్యూనికబుల్ వ్యాధులు మొత్తం మరణాల్లో అరవై శాతం కంటే ఎక్కువకు కారణమవుతున్నాయి. మానసిక ఆరోగ్య సమస్యలు, వృద్ధుల ఆరోగ్య అవసరాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజారోగ్య వ్యవస్థను, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను బలోపేతం చేయడం తప్పనిసరి. కానీ, తాజా బడ్జెట్‌లో ఆ దిశగా అవసరమైన పెట్టుబడి కనిపించడం లేదు. ప్రజల నుంచి ఆరోగ్యం పేరుతో ఏడాదికి లక్షల కోట్ల రూపాయలు వసూలు చేస్తూనే, అదే ఆరోగ్య రంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం పాలనా వైఫల్యమే తప్ప వేరేకాదు. హెల్త్ సెస్సు పెరుగుతున్నప్పుడు ఆరోగ్య వ్యయమూ అదే స్థాయిలో పెరగాలి. కానీ, ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఆరోగ్యం వెనుకబడినట్టే కనిపిస్తోంది. ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వం మోయాల్సిన చోట, అది నెమ్మదిగా ప్రజల జేబుల పైకి మళ్లుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. హెల్త్ సెస్సును ప్రత్యేక ఆరోగ్య నిధిగా మార్చి, ప్రతి రూపాయి ఎలా ఖర్చవుతుందో ప్రజలకు చెప్పే పారదర్శక వ్యవస్థ కావాలి. అది లేకపోతే, ఈ సెస్సు ప్రజల ఆరోగ్యానికి కాదు, బడ్జెట్ లెక్కలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. ప్రజల ప్రాణాల మీద వసూలు చేసే పన్నుకు ఇది తగిన న్యాయం కాదు.

# కారుకు ఆశించిన ఫలితాలు రాలేదేందుకు

**ఓవర్ కాన్ఫిడెన్స్**
**అధికార పార్టీని తక్కువ అంచనా వేయడం**
**పార్టీ ఎమ్మెల్యేలున్న దగ్గర కుడా నిరాశే**

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ పార్టీకీ ఆశించిన ఫలితాలు రాలేదు.అయితే వార్డులు సాధించి తన పట్టును నిలుపుకుంది. నిజానికి మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతుందని అంతా భావించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, పార్లమెంటు ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత గులాబీ పార్టీ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోను ఓడిపోయింది.ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పర్వాలేదనిపించింది.మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరిగిన ఎన్నికలు కావడంతో బీఆర్ఎస్ అధిష్టానం మెజార్టీ స్థానాలను గెలుచుకోవాలని భావించింది. అయితే మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ నేతలు,క్యాడర్ ను నిరాశకు గురి చేశాయనే చర్చ జరుగుతోంది.

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ రావడం కంటే ముందే బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించింది. కేటీఆర్, హరీష్ రావు ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. మున్సిపాలిటీలతో పాటు కార్పోరేషన్లకు మాజీ మంత్రులు, కార్పోరేషన్ మాజీ చైర్మన్లకు,సీనియర్ నేతలకు భాధ్యతలు ఇచ్చారు.దీంతో గులాబీ పార్టీ 30 నుంచి 35 మున్సిపాలిటీలు వస్తాయని ఆశించింది. తీరా ఎన్నికల ఫలితాల్లో 16 మున్సిపాలిటీలకు మాత్రమే పరిమితం అయింది.ఇక ఎవరికి మెజారిటీ రాకుండా హంగ్ ఫలితాలు వచ్చిన చోట మూడు లేదా నాలుగు బిఆర్ఎస్ పార్టీకి వస్తే ఫిగర్




20 రీచ్ అయ్యే ఛాన్స్ ఉంది. ఇక గెలుస్తుందని అనుకున్న చోట హంగ్ ఫలితాలు వచ్చాయి. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో గెలిచిన వారిని కాపాడుకోవడం కోసం క్యాంపు రాజకీయాలు బిఆర్ఎస్ షురూ చేసింది.

ఇక రాష్ట్రంలో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి.ఒక్కటి బిఆర్ఎస్ ఖాతాలో పడలేదు. రెండు చోట్ల బీజేపీ గెలుపొందింది.నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.కొత్తగూడెం కార్పోరేషన్ లో హంగ్ ఫలితాలు వచ్చాయి. మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు వీరిద్దరూ ప్రచారం చేసిన మున్సిపాలిటీల్లో కొంత సానుకూల ఫలితాలు వచ్చాయి. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో నిరాశ తప్పలేదు. మరోవైపు ఫలితాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా బిఆర్ఎస్ కు మంచి ఫలితాలు వచ్చాయి. గజ్వేల్, పటాన్ చెరు,దుబ్బాక నియోజకవర్గాల్లో గులాబీ పార్టీ హవా కొనసాగింది. ఇక సిరిసిల్లలో కేటీఆర్ తన పట్టును మరోసారి నిలుపుకున్నారు.

ఇక నిజామాబాద్ జిల్లాల్లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఓడిపోయింది. కరీంనగర్ లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఓటమి తప్పలేదు. సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి పట్టణ ఓటర్లు షాక్ ఇచ్చారు. హుజురాబాద్ లో పాడి కౌశిక్ రెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే అయినా మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ పార్టీ ఓడింది. కోరుట్లలోను సేమ్ సీన్. సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శ్రమించినప్పటికీ ఫలితం దక్కలేదు.

ఏమైయినా ఫలితాలు మాత్రం షాకింగ్ కు గురి చేశాయి. దీంతో పాటు ఓవర్ కాన్ఫిడెన్స్ గులాబీ పార్టీని దెబ్బతీసిందనే చర్చ బిఆర్ఎస్ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీని తక్కువ అంచనా వేయడంతోనే ఫలితాలు రివర్స్ అయినట్లుగా తెలుస్తోంది.

## కారెక్కిన ఇద్దరు ఇండిపెండెంట్లు



**పటాన్ చెరు: పెన్ పవర్:** గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో ఇద్దరు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని 5 మున్సిపాలిటీలలో ఇప్పటికే గడ్డపోతారం, గుమ్మడిదల బీఆర్ఎస్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. జిన్నారం, ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడింది.

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీలలోని 10వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఎల్లకొండ రాహుల్ రెడ్డి, ఇంద్రేశం మున్సిపాలిటీలలోని 2వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ సార లావణ్య బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## ఇది టీడీపీ కాంగ్రెసా? రాహుల్ గాంధీ కాంగ్రెసా
# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** మేము కష్టపడితే రేవంత్ రెడ్డి సీఎం అయి, ఇప్పుడు అహంకారంతో మాట్లాడుతున్నాడని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసారు. మేమందరం కలిసి కష్టపడితే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు.. ఆయన అదృష్టం అది. ఇది టీడీపీ కాంగ్రెసా? రాహుల్ గాంధీ కాంగ్రెసా అని ప్రశ్నించారు.


140 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్రలో రేవంత్ రెడ్డి అహంకారంతో నేనే పదేళ్లు ముఖ్యమంత్రిని అని మాట్లాడుతున్నాడు. రేవంత్ రెడ్డి ఏ పార్టీ నుండి వచ్చేసారి ముఖ్యమంత్రి అవుతాడు? రేవంత్ రెడ్డి ఏ పార్టీతో టచ్ లో ఉండి, ఎవరి మద్దతుతో ఇంకోసారి ముఖ్యమంత్రి అవుతాడని నిలదీసారు.

రేవంత్ రెడ్డి నేనే పదేళ్లు ముఖ్యమంత్రిని అని అనడం రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని, మమ్మల్ని అవమానించడమే. రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడుతుంటే కాంగ్రెస్ మంత్రులు, టీపీసీసీ ప్రెసిడెంట్, అధిష్టానం ఎందుకు ఏం అనడం లేదని అన్నారు.

తెలంగాణలో ఉన్నది రేవంత్ కాంగ్రెసా ? రాహుల్ గాంధీ కాంగ్రెసా ?

రేవంత్ రెడ్డి మాటలు విన్నప్పుడల్లా వినాశకాలే విపరీత బుద్ధి అనే సామెత గుర్తుకు వస్తుంది. తెలంగాణలో ఇప్పటికీ కూడా చంద్రబాబు నాయుడు మనుషుల, ఆంధ్రా పెత్తందారుల పెత్తనమే నడుస్తుందని అయన ఆరోపించారు.

## మసాజ్ ముసుగులో వ్యభిచారం



**హైదరాబాద్ పెన్ పవర్:** మసాజ్ సెంటర్ ముసుగులో సాగుతున్న వ్యభిచార ముఠా గుట్టును కేపి.హెచ్ బి పోలీసులు రట్టు చేశారు. స్థానిక అసాన వెల్ నెస్ స్పా సెంటర్పై అకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 మంది యువతులను రక్షించడంతో పాటు, నిర్వాహకులు, విటులు కలిపి మొత్తం 30 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసాన వెల్ నెస్ స్పాలో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగుతున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. మగవారికి ఆడవారితో క్రాస్ మసాజ్ చేస్తామంటూ యువతులను రప్పించి, వారి ద్వారా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మసాజ్ సెంటర్ లోపల ప్రత్యేక గదులను ఏర్పాటు చేసి ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు దాడుల్లో వెల్లడైంది.

# డీసీఎం ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం

డీసీఎం ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం

**హైదరాబాద్ పెన్ పవర్:** నల్గొండ జిల్లా చందనపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మునుగోడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ షేక్ తయ్యూబ్ (30) మృతిచెందాడు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో విధులు ముగించుకుని స్వగ్రామం నకిరేకల్‌కు బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టడంతో తయ్యూబ్ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందిన వెంటనే నల్లగొండ రూరల్ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# బీఆర్ఎస్ తో సిపిఐ దోస్తీ
## కొత్తగూడెం మేయర్ పదవి కోసం ఇరు పార్టీలు సిద్ధం

**కొత్తగూడెం: పెన్ పవర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిపాదన మేరకు కొత్తగూడెం మేయర్ పదవి కైవసం చేసుకుంటామని సిపిఐ నేత, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.
కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, ఇతరులు 6, బీజేపీ 1, సీపీఎం 1 సీట్లు రావడంతో హంగ్ ఏర్పడగా, సీపీఐ ఒప్పుకుంటే తమ మద్దతుతో మేయర్ పదవి ఇస్తామని కేటీఆర్ ప్రకటించారు. కేటీఆర్ ఫోన్ చేసి మాట్లాడారని, ఆయన ప్రతిపాదన మేరకు బీఆర్ఎస్ పార్టీతో కలిసి మేయర్ పదవి దక్కించుకుంటామని సీపీఐ నాయకుడు కూనంనేని సాంబశివరావు ప్రకటించారు.

# నా మద్దతు బీఆర్ఎస్ కే.. వికారాబాద్ లో స్వతంత్ర అభ్యర్థి పోలీసుల అత్యుత్సాహం

**వికారాబాద్: పెన్ పవర్:** వికారాబాద్ జిల్లాలో పోలీసులు అత్యుత్సాహం బయటపడింది. బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపిన స్వతంత్ర అభ్యర్థిని తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేసారు. తన ఇష్టంతోనే బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నానని అభ్యర్థి, చెప్పడంతో పోలీసులు నిరాశతో వెనుదిరిగారు. వికారాబాద్ జిల్లాలో తాను బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తానని ఒకటవ వార్డులో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి అక్కమ్మ మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఇంటికి చేరుకుంది. అయితే అక్కమ్మ కొడుకు బాలు తన తల్లిని బీఆర్ఎస్ నాయకులు కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేసాడు. బాలు ఫిర్యాదు మేరకు కొప్పుల మహేష్ రెడ్డి ఇంటికి చేరుకుని, అక్కమ్మను తీసుకెళ్లేందుకు పోలీసుల విఫల ప్రయత్నం చేసారు. తాను తన ఇష్టంతోనే బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నానని అక్కమ్మ స్టేట్మెంట్ ఇవ్వడంతో పోలీసులు వెనుతిరిగారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో మరోసారి అక్కమ్మను తీసుకెళ్లేందుకు వచ్చిన పోలీసులను బీఆర్ఎస్ కార్యకర్తలు తిప్పి పంపారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతి పాల్గోన్న ఎమ్మెల్యే తలసాని



**హైదరాబాద్: పెన్ పవర్:** బంజారా ల ఆరాధ్య దైవం శ్రీ సేవాలాల్ మహరాజ్ అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా రా= నగర్ లోని బాపూనగర్ కమిటీ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద పూలు ఉంచి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ బోధించిన సత్యం, ధర్మం, అహింసా మార్గంలను అనుసరించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళులు అన్నారు. బంజారాల ఐక్యత కోసం ఎంతో కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని గుర్తు చేశారు.

# ఘనంగా కేబీఆర్ పార్క్‌లో ఇండియన్ డాగ్ అడాప్షన్ కార్యక్రమం



**హైదరాబాద్ పెన్ పవర్:** జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ లో డాగ్ అడాప్షన్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క హజరయ్యారు. కొండా సురేఖ చేతుల మీదుగా స్వదేశి కుక్కపిల్లను మంత్రి సీతక్క అడాప్ట్ చేసుకుని ఆదర్శనంగా నిలిచారు. ఎంపీ రేణుక చౌదరి మంత్రి సీతక్క చేతుల మీదుగా కుక్క పిల్లను ఆడాప్ట్ చేసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నగర నడిబొడ్డున జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. స్ట్రే డాగ్స్‌ను దత్తత తీసుకోవడం ద్వారా వాటికి జీవించే హక్కును కల్పించడమే కాకుండా సమాజంలో మానవత్వాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అహింసా సిద్ధాంతాన్నే అనుసరించిందని ఆమె స్పష్టం చేశారు. అహింసా మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తుచేశారు. ప్రతి ప్రాణికీ జీవించే హక్కు ఉందని, విశ్వాసానికి మారుపేరు కుక్క అని ఆమె అన్నారు. ఇంట్లో ఒక డాగ్ ఉంటే భద్రతా భావం కలుగుతుందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదని తెలిపారు.తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో కొందరు సర్పంచ్‌లు కుక్కలను చంపిన ఘటనలను ప్రస్తావిస్తూ, ఆ సంఘటనలను ప్రభుత్వం ఖండించిందని, సంబంధిత వారిపై చర్యలు కూడా తీసుకున్నామని మంత్రి సీతక్క తెలిపారు. అలాంటి తప్పులను ప్రభుత్వానికి అంటగట్టడం భావ్యం కాదని, పార్లమెంట్‌లో లేదా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు. ఎవ్వరూ కూడా కుక్కలను చంపకూడదని, నియంత్రణ చర్యలు పాటిస్తూ మానవత్వంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఒక కుక్క ఉండేదని, పది మందితో సమానంగా ఒక కుక్క కాపలా కాస్తుందని ఆమె గుర్తుచేశారు. మన దేశంలో ఎన్నో స్వదేశీ డాగ్ బ్రీడ్స్ ఉన్నాయని, అందరూ ఇండియన్ డాగ్స్‌ను అడాప్ట్ చేసుకోవాలని కోరారు.మనుషుల మధ్య అప్పుడప్పుడూ మానవత్వం లోపిస్తోందని, రక్త సంబంధాలు కూడా మరచి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే పరిస్థితులు వస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇంటి కుక్క మాత్రం ఎప్పుడూ తన యజమానిని హాని చేయదని, విశ్వాసంతో కాపాడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ రేణుకా చౌదరి, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, మాజీ కార్పొరేటర్ విజయా రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ వర్సెస్ రాజగోపాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు మునుగోడు ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపుతున్నాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.మంత్రి పదవి కోసం రెండేళ్లుగా సర్వ శక్తులు ఒడ్డుతున్న వార్తల్లోకెక్కడం కొత్తేమి కాదు. సమయం దొరికినప్పుడల్లా మంత్రి పదవి ఇవ్వాలంటూ సీఎం ను,అధిష్టానాన్ని టార్గెట్ చేసే ఆ ఎమ్మెల్యే ఇప్పుడు నేరుగా సీఎం కుర్చీ పై కన్నేశారు.ఓ మెట్టు పైకెక్కి 'పులివెందులలో రాజశేఖర్ రెడ్డి ఎట్లనో మునుగోడులో రాజగోపాల్ రెడ్డి అట్లాడ!! అంటూ తన నియోజకవర్గంలో స్పీచ్ లుమొదలు పెట్టారు.ఇది కేవలం ఉపమానం కాదు. మంత్రి పదవి ఇవ్వడం మాట ఇచ్చారు, మాట నిలబెట్టాలి, కపోతే నా టార్గెట్ మారదు. డైరెక్ట్ సీఎం చైర్ వైపే అంటూ అల్టిమేటం జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఎవరిని ఉద్దేశించి చేశారు!.నేరుగా సీఎం రేవంత్ రెడ్డి కుర్చీ కే ఎసరు పెట్టారా అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఓపెన్గానే నడుస్తోంది.ఒకవైపు రేవంత్ రెడ్డి అధికార సమతుల్యతలు కేబినెట్ బ్యాలెన్స్, సామాజిక సమీకరణలు, మరోవైపు రాజగోపాల్ రెడ్డి వ్యక్తిగత బలం, నియోజకవర్గంపై సంపూర్ణ పట్టు ఇతర అంశాల సంకేతాలు రాజగోపాల్ రెడ్డి మాటల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.మొత్తానికి, మునుగోడు నుంచి వచ్చిన ఈ గర్జన కాంగ్రెస్లో నిశ్శబ్దాన్ని చెదరగొట్టింది.ఇది లేక రేవంత్ జం రాజగోపాల్ రెడ్డి పవర్ పాలిటిక్స్ తో కొత్త అధ్యాయం మొదలవుతుందా?రాబోయే రోజుల్లో ఈ 'చేతి పట్టు'తుఫాన్ గా మారుతుందా?..మంత్రి పదవి తో ఆగుతుందా వేచి చూడాలి.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అలుపెరుగని పోరాట యోధుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** నరెడ్ల శ్రీనివాస్ అంటే తెలియక పోవచ్చు కాని, లోక్ సత్తా శ్రీనివాస్ అనగానే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. చాలా మంది ఆయనను లోక్ సత్తా శ్రీనివాస్ అనే పిలిచేవారు. సామాజిక న్యాయం, ఉద్యమాలకు ఆయన కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచారు. ఉత్తర తెలంగాణలో గత ఆనాలుగు దశాబ్దాలుగా కొనసాగిన సామాజిక ఉద్యమాలతో ఆయన భాగస్వామ్యం లేని ఉద్యమమే లేదంటే అతిశయోక్తి కాదు. లోక్ సత్తా ఉద్యమ సంస్థతో గత పాతికేళ్లుగా ఆయనకు విడదీయరాని సంబంధం ఉంది. లోక్ సత్తా అంటే శ్రీనివాస్. శ్రీనివాస్ అంటే లోక్‌సత్తా అని పేరెన్నికగన్నారు. అవినీతి, అన్యాయాలు అక్రమాలపై నిరంతరమైన పోరాటాలు చేశారు. ఎన్నో విజయాలు సాధించారు. కరీంనగర్‌లో ఉన్న అన్ని ఉద్యమ వేదికలు ఆయనవే. గత సామాజిక ఉద్యమాలతో ఆయనకు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. ఆయన ప్రతి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. వాస్తవానికి ఉద్యమాలను నిర్మించారంటే సమంజసంగా ఉంటుంది. ఉద్యమాల నిర్వహణలో అలుపెరగక, ఏనాడూ రాజీపడక, మొక్కవోని ధైర్యంతో, చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో, అకుంఠిత కార్యదీక్షతో, అంకితభావంతో, అన్నింటినీ మించి చిత్తశుద్ధితో, ఉద్యమాలలో మమేకమైన పోరాటయోధుడు. 1955లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామంలో నిరుపేద కుటుంబంలో నరెడ్ల శ్రీనివాస్ జన్మించిన శ్రీనివాస్... యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూ, బ్యాంకు మేనేజర్ గా ప్రమోషన్ మీద కొంత కాలంగా రాష్ట్రం విడిచి వెళ్ళిన సందర్భంలోనూ, ఏనాడూ ఉద్యమ కార్యాచరణను ఆయన వదిలిపెట్టలేదు. వినియోగదారుల మండలి తరపున వందలాది కేసులు వేసి హక్కులను పరిరక్షిం చేందుకు కృషి చేశారు. అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించడంలో కృషి చేసిన వారిని సన్మానించి ప్రోత్స హించేవారు. పాలకుల తప్పులను, ప్రభుత్వ పాలసీల్లోని లోపాలను ఎత్తిచూపడంలో, ప్రజా సమస్యలతో పాటు, సామాన్య బాధితుల న్యాయం కోసం పోరాడ డంలో ఆయన వ్యక్తిత్వం అనన్య సామాన్యం. ఉమ్మడి రాష్ట్ర వినియోగ దారుల మండలి అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో అందరికీ అందు బాటులో ఉండేలా కిరాయి ఇల్లు వేదికగా, కరీంనగర్ వినియోగ దారుల మండలి నిర్వాహక బాధ్యునిగా, వేలాది కేసులను ఆయన పరిష్కరించారు. అన్యా యానికి గురైన వారు తమకు న్యాయం తప్పక జరుగుతుందని నమ్మకంతో, లోక్ సత్తా ఆఫీసును వెతుక్కుంటూ వచ్చేవారు. వారి సమస్య పరిష్కారం అయ్యే దాకా సలహాలు సూచనలు అందించ డమే కాక, వెంట ఉండి సహకరించే వారు. హుజురాబాదులో జన్మించిన 69ఏళ్ళ శ్రీనివాస్.. విద్యార్థి జీవితంలోనే ప్రగతిశీల భావాలు కలిగి, ఆనాటి పోరాట, విప్లవ యోధుల సాహచర్యంతో ఎదిగారు. 1970వ దశక ప్రారంభంలో మిత్రులతో కలిసి హుజురాబాద్‌లో సాహితీ సంస్థ స్థాపనకు చొరవ చూపి, మహాకవి శ్రీశ్రీని ఆహ్వానించి, హుజురాబాద్ లో సమావేశాలు నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారు. కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేసి, కరీంనగర్ యూనియన్ బ్యాంక్ లో ఉద్యోగంలో చేరారు. ప్రగతి శీల, భావజాల పరిధిని విస్తృత పరుచుకుని, తన లాంటి భావాలున్న వారితో జత కట్టారు. ఒకనాడు జర్నలిస్టులకు వేదికగా, ఎందరో జర్నలిస్టులను తయారు చేసి, జర్నలిస్టుల తయారీ కర్మాగా రంగా విలసిల్లిన, విజయ కుమార్ సంపాదకత్వంలో వెలువరించిన 'జీవగడ్డ పత్రికలో వారం వారం 'పెన్నుపోటు' పేర కాలమిస్టు గా పని చేశారు. ఆకాలంలో జీవగడ్డలో పని చేసిన అల్లంనారాయణ, ఘంటా
చక్రపాణి, ఆనాడు జిల్లాలో విధులు నిర్వర్తించిన సీనియర్ జర్నలిస్టు మిత్రులు దేవులపల్లి అమర్, దామెర్ల సాయిబాబా, ఎస్. కే.జకీర్ తదితరులతో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు. కరీంనగర్ వినియోగదారుల మండలి స్థాపించి వినియోగ దారుల పరిరక్షణ చట్టం కింద, రశీదో, బిల్లో, ఏ చిన్న ఆధారం తోనైనా సరే, ఫోరం కోర్టుల్లో వేలాది కేసులు వేస్తూ మోస పోయిన వినియోగ దారులకు లక్షలాది రూపాయల నష్ట పరిహారాలు వచ్చేలా కృషి చేశారు. అలాగే సమాచార హక్కు చట్టాన్ని మరొక ఆయుధంగా చేసుకుని సామాన్యు లకు అండగా నిలిచారు. ఈ చట్టం కింద భూ కబ్జాలు, గ్రానైట్ రాళ్ళ సంభకోణాల లాంటివి బహిర్గత పరిచి, ప్రభుత్వానికి కోట్ల రూపాయల లబ్దిని చేకూర్చారు. లోక్ సత్తా బాధ్యునిగా, జయప్రకాష్ నారాయణను కరీంనగర్ పలు మార్లు రప్పించి, చిత్తశుద్ధితో పని చేశారు. సమాజంలోని అవినీతి అక్రమాలపై అలుపెరుగని, అవిశ్రాం త పోరాటం చేసి, ఆశయ సాధనకు కృషి చేసిన పోరాట యోధుడు, నరెడ్ల చివరికి కరోనా మహమ్మారి తోనూ పోరాటం చేసి, ఓటమి పాలై, పోరాట యోధుని గానే 2021 ఫిబ్రవరి 15న తనువు చాలించారు. ఆయన పోరాటం ఎందరికో స్ఫూర్తి దాయకం అయిందనేది వాస్తవం.

# నూతన ఆవిష్కరణల రూపకర్త

**హైదరాబాద్ పెన్ పవర్:** గెలీలియో గెలీల ఇటలీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త, గణితజ్ఞుడు, భౌగోళిక శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త. టెలిస్కోపు (దూరదర్శిని) ను వాడుకలోకి తెచ్చాడు.గెలీలియో గెలీలి (జననం 1564 ఫిబ్రవరి 15..మరణం 1642 జనవరి 8) ఇటలీలోని పీసా నగరంలో జన్మించాడు. చిన్న వయసులో తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. తరువాత పీసా విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థిగా చేరాడు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరాడు. గెలీలియో కాలం అనగా 16 వ శతాబ్దం వరకు క్రీ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే ప్రాచుర్యంలో ఉండేవి. సృష్టిలోని సత్యాలనన్నిటినీ స్వచ్ఛమైన ఆలోచనల ద్వారా మాత్రమే వివరించ వచ్చును. ప్రయోగాల ప్రమేయం ఏ మాత్రం అవసరం లేదన్నది అరిస్టాటిల్ సిద్ధాంతాల్లోని పెద్ద లోపం. అరిస్టాటిల్ సిద్ధాంతంతో ఏకీభవించని గెలీలియో పీసా గోపురం 180 అడుగుల ఎత్తు పైనుంచి 100 పౌండ్లు, 1 పౌండు బరువు గల రెండు ఇనప గుండ్లను ఒకేసారి క్రిందికి వదలి, అవి రెండూ ఒకే కాలంలో భూమిని చేరుకుంటాయని ప్రయోగం ద్వారా నిరూపించాడు. గురుత్వ త్వరణం గూర్చి ఆ కాలం నాటికే అర్థం చేసుకో గలిగాడు. 20 సంవత్సరాల వయసులో అయన ఒక రోజు ప్రార్థన కోసం చర్చికి వెళ్ళాడు. చీకటి పడుతున్న వేళలో చర్చి సేవకుడు దీపాలు వెలి గించగా ఎన్నో దీపాలు చర్చి పైభాగం నుండి వ్రేలాడుతూ ఉన్నాయి. ఆ దీపాలు ఉయ్యాల మాదిరి అటు, యిటూ ఊగటం గమనించాడు. వాటి డోలనా సమయాలు ఒకటేనని లెక్క వేశాడు. గెలీలియో కాలంనాటికి కచ్చితంగా కాల నిర్ణయం చేసే గడియారాలు లేనప్పటికి ఆయన డోలన కాలాలను గణించటం విశేషం. వైద్య విద్యార్థి కాబట్టి, నాడి కొట్టుకోవటం, గుండె కొట్టుకోవటం గురించి పరిచయం ఉంది కాబట్టి కాల నిర్ణయాన్ని తేలికగా చేయగలిగాడని అనుకోవచ్చు. ఈ పరిశీలన ఆధారంగా గెలీలియో "పల్స్ మీటరు" రూపొందించాడు. పాండువా విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర ప్రధానాచార్యునిగా చేరాడు. అక్కడే గెలీలియో యాంత్రిక శాస్త్రం రచించాడు. ఇది సామాన్యులకు కప్పీలు, తులాదండాలు, వాలుతలాల ద్వారా బరువులు సులభంగా ఎత్తడానికి ఉపకరించింది. ఆ సమయంలోనే వాయు థర్మామీటర్ ను, పల్లపు ప్రాంతం నుంచి ఎత్తుకు నీటిని చేరవేసి వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాన్ని, గణితంలో వర్గాలు, వర్గమూలాలు కనుగొనే కంపాస్ పరికరాన్ని కనుగొన్నారు. ఆ సమయంలోనే లోలకాలు, వాయు తలాలపై కూడా కీలకమైన ప్రయోగాలు చేశాడు.గెలీలియో మొట్టమొదటి నాణ్యత గల టెలిస్కోప్ నిర్మాత. ఆయన టెలిస్కోప్ గురించి విని సింగ్ ఆరోరియా మహారాజు వెనిస్ కు రమ్మని కబురు చేశాడు. ఆయన టెలిస్కోప్ చూసి ఎంతోమంది ఆశ్చర్య పడ్డారు. వెనిస్ చర్చి పైభాగానికి వెళ్ళి ఎంతో దూరంలో ఉన్న నౌకలను పది రెట్లు దగ్గరగా ఎంతో మంది గెలీలియో టెలిస్కోప్ ద్వారా చూడ గలిగారు. ఆయనను ప్రశంసించారు. ఈ టెలిస్కోప్ గెలీలియో పరిశోధనలో ముఖ్యమైనది. ఎన్నో విశ్వ రహస్యాలను గెలీలియో ఛేదించ గలిగాడు. బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను గెలీలియో చూడగలిగాడు. గెలీలియో అప్పుడే కనుగొన్న టెలిస్కోపు ద్వారా శుక్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధృవీకరించాడు. పాలపుంతలో కోట్లాది నక్షత్రాలు ఉన్నాయని ఊహించి చెప్పగలిగాడు. ఈ టెలిస్కోప్ ను ఉపయోగించి సేకరించిన సమాచారాన్ని బట్టి కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతంను బలపరిచాడు. క్రీ.శ 1616 లో గెలీలియో, సూర్యుడే కేంద్రమని సూర్యుని చుట్టే భూమి తిరుగుతుందని నిర్ద్వందంగా ప్రకటించాడు.అప్పటికే మత గ్రంథాలలో ప్రముఖ స్థానాన్ని పొందిన భూకేంద్రక సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నందుకు కోపర్నికస్ సిద్ధాంతాన్ని నిషేధించి, కొందరు మతాధికారులు గెలీలియో ప్రయోగాలు మత వ్యతిరేకమైనవని తీర్మానించారు. తన ప్రయోగాలను ఎన్నటికీ బహిర్గతం
చేయనని ప్రమాణం తీసుకున్నారు. ఈ ప్రకటనకు ఆగ్రహం చెందిన చర్చి మతాధికారులు గెలీలియో ఎటువంటి ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. దీంతో క్రీ.శ.1630 వరకు గెలీలియో నోరు విప్పలేక పోయాడు. అయినా ఆయన తన వాదాలను విడిచి పెట్టలేదు. వాటిని పుస్తక రూపంలో వెలువరించాడు. నిర్భయంగా తాను వాస్తవమని నమ్మిన శాస్త్రీయ విషయాలను వెల్లడించాడు. అయితే ఈ గ్రంథాన్ని ప్రజలు కోపర్నికస్ సిద్ధాంతాన్ని సమర్థించేదిగా భావిస్తున్నారని తెలుసుకున్న మతాధికారులు దీని ప్రచురణను నిలిపివేయడమే కాకుండా గెలీలియోకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. క్రీ.శ. 1637 లో పాపం గెలీలియో గుడ్డి వాడయ్యాడు. అంతటి మహానుభావుడు శిక్షను అనుభవిస్తూనే 1642, జనవరి 8 తేదీన తన 78వ ఏట మరణించారు. శాస్త్రీయ వాస్తవాలను తెలియజేసి ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మూర్ఖత్వం బలిగొంది.

# ఫ్యాన్ లో జోష్ నింపిన తెలంగాణ రిజల్ట్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తోంది. గులాబీ పార్టీ గట్టి పోటీ ఇచ్చినట్టు కనిపించినా తుది ఫలితాల్లో మాత్రం వెనుకబడింది. ఆ పార్టీ కేవలం నాలుగు మున్సిపాలిటీల్లో మాత్రమే సత్తా చాటింది. మిగతా చోట్ల కాంగ్రెస్ హవా నడుస్తోంది. ఒకటి రెండు చోట్ల బిజెపి ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన కలవరం మొదలైంది. ఒకటి అధికార పార్టీకి అనుకూలమైన ఫలితాలు. రెండు మిత్రుడైన కెసిఆర్ పార్టీ ఓడిపోవడం ఇప్పుడు జగన్మోహన్ రెడ్డిలో ఆందోళనకు కారణం అవుతుంది. ఏపీతో పోల్చుకుంటే తెలంగాణలో గులాబీ పార్టీకి ప్రతిపక్ష హోదా వచ్చింది. గౌరవప్రదమైన అసెంబ్లీ సీట్లు కూడా దక్కాయి. కానీ ఏపీలో మాత్రం 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను కేవలం 11చోట్ల మాత్రమే వైసిపి గెలుపొందింది. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. ప్రభుత్వం పట్ల సంతృప్తి శాతం కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో ఏపీలో మున్సిపల్ ఎన్నికలు జరిగితే తమ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన జగన్ మోహన్ రెడ్డి లో ఉంది.తెలంగాణలో గులాబీ పార్టీ నాయకులు బలంగా ఉన్నారు. కెసిఆర్ కు అటు కుమారుడు కేటీఆర్, ఇటు మేనల్లుడు హరీష్ రావు తో పాటు సీనియర్ నేతలంతా గట్టిగానే మద్దతుదారులుగా నిలుస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో గులాబీ పార్టీ నెగ్గుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతింది. కానీ పంచాయతీ ఎన్నికల్లో మాత్రం కొంతవరకు ప్రభావం చూపగలిగింది. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష విజయాన్ని అడ్డుకోగలిగింది. కానీ ఆ పరిస్థితి ఏపీలో ఉంటుందా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడగలగా? కనీసం ఉనికి చాటుకోగలద? అనే అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే ఏపీలో కూటమి బలంగా ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో మున్సిపల్ ఎన్నికలను ఫేస్ చేయడం అంత ఈజీ కాదు.ఏ ఎన్నికలు జరిగినా ఇప్పుడు అధికార పార్టీగా టిడిపి కూటమి ఉంటుంది. అందులోనూ మూడు పార్టీల మధ్య గ్యాప్ చూడాలనుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ రోజురోజుకు వారి మధ్య మంచి బంధం ఏర్పడుతోంది. రాజకీయంగా ఇచ్చిపుచ్చుకునే ధోరణి కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో వైసీపీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రాని పరిస్థితి. 2021 మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాలుగా దూకుడు ప్రదర్శించింది. చాలాచోట్ల ఏకగ్రీవాలను సైతం చేసుకుంది. ప్రస్తుతం బిజెపి సైతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వం అండ కూడా కూటమికి ఉంటుంది. పొరుగునే ఉన్న తెలంగాణలో అధికార పార్టీ హవా స్పష్టంగా కనిపించింది. అది ఏపీలో సైతం రిపీట్ అవుతుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సైతం ఇది తెలుసు. అందుకే ఆ పార్టీ నిర్ణయం ఇప్పుడు కీలకంగా మారనుంది. మున్సిపల్ ఎన్నికలను ఆ పార్టీ ఫేస్ చేస్తుందా? లేదా? అనేది ఒక అనుమానం?

# మళ్లీ ముద్రగడతో రాజకీయం

**కాకినాడ, ఫిబ్రవరి 14, పెన్ పవర్:**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కాపు నేతల్లో ఒక కొత్త వివాదం ప్రారంభం అయ్యింది. ముద్రగడ పద్మనాభం కు జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యత ఇవ్వడంపై ఇప్పుడు ఆ సామాజిక వర్గం నేతలు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముద్రగడ రాజకీయ నిర్ణయాలు బాగుండవని.. ఆయనను నమ్ముకొని రాజకీయాలు చేయడం అంత మంచిది కాదని వైసీపీ కాపు నేతలు చెబుతున్నారు. ఇటీవల అంబటి రాంబాబు ఎపిసోడ్లో ముద్రగడ పద్మనాభం లేఖ రాయడం పై కాపు నేతలు ఆగ్రహంగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ కాపు నేతలకు అన్యాయం చేసిందంటూ చెబుతూ ఆయన రాసిన లేఖ కలకలం సృష్టిస్తోంది. అయితే అది కూటమి ప్రభుత్వం కంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే సెగలు రేపినట్లు వార్తలు వచ్చాయి. అనవసరంగా ముద్రగడ పద్మనాభం ను హైలెట్ చేయడం పగదని సొంత పార్టీ నేతలే జగన్మోహన్ రెడ్డి వైఖరిపై ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.గడిచిన ఎన్నికలకు ముందు ముద్రగడ పద్మనాభం తన కుమారుడితో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందుగా ఆయన జనసేనకు వెళ్తారని ప్రచారం నడిచింది. అయితే ఆయనతో మేలు కంటే కీడు అధికమని పవన్ కళ్యాణ్ కు చంద్రబాబు సూచించినట్లు వార్తలు వచ్చాయి. అందుకే పవన్ కళ్యాణ్ సైతం వెనక్కి తగ్గారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ముద్రగడ పద్మనాభం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పవన్ కళ్యాణ్ ను ఓడించడంతోపాటు జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తానని శపథం చేశారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని కూడా సవాల్ చేశారు. అలా ఓడించకపోతే తన పేరును ముద్రగడ పద్మనాభ రెడ్డి గా మార్చుకుంటానని ప్రకటన చేశారు. అయితే ఆయన మాటలను గోదావరి జిల్లాల్లో కాపు సామాజిక వర్గం అస్సలు పట్టించుకోలేదు. అయితే పవన్ కళ్యాణ్ విషయంలో ముద్రగడ రెచ్చగొట్టిన వ్యాఖ్యలే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కాపులను దూరం చేశాయని ఆ సామాజిక వర్గ నేతలు భావించారు. ఆ ఎన్నికల్లో దారుణ ఓటమి ఎదురైంది. కానీ ఇప్పుడు కూడా జగన్మోహన్ రెడ్డి ముద్రగడ పద్మనాభంను ముందు పెట్టి రాజకీయం చేయడం ఏమిటి అనే ప్రశ్న వినిపిస్తోంది.వాస్తవానికి ముద్రగడ పద్మనాభం 1989 లోనే చివరిసారిగా ఎమ్మెల్యేగా అయ్యారు. 1995లో ప్రత్తిపాడునియోజకవర్గంలో ఆయన ఓడిపోవడంతో తిరిగి ఆ నియోజకవర్గ వైపు చూడనని తేల్చి చెప్పారు. 2009లో పిఠాపురం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో ఇండిపెండెంట్గా పోటీ చేసి ఓటమి చవి చూసారు. తరచూ అభిప్రాయాలు మార్చుకోవడం, అన్ని పార్టీల నాయకత్వాలతో విభేదాలు ఏర్పడడం వంటివి ముద్రగడ పద్మనాభం కు మైనస్ గా మారాయి. ఆయన ద్వారా కాపులను ఆకర్షించాలన్న ప్రయత్నం సరి కాదన్నది వైసీపీ నేతల వాదన. తాజాగా



అంబటి రాంబాబు ఎపిసోడ్లో ప్రభుత్వానికి ముద్రగడ పద్మనాభం లేఖ రాశారు. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయన హై కమాండ్ ఆదేశాలు లేనిదే లేఖ రాయరు. అటువంటిది వంగవీటి మోహన్ రంగా, ముద్రగడ పద్మనాభం, అంబటి రాంబాబు తదితరులను టిడిపి వేధించిందని లేఖ రాశారు ఘాటుగా. అయితే దీని ద్వారా లాభం కంటే నష్టమే అధికమని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కాపులు మరింత దూరం జరుగుతారు అన్నది వారి భయం.

**తగ్గేదెలా అంటున్న అంబటి**

మాజీ మంత్రి అంబటి రాంబాబు పశ్చాత్తాప పడ్డారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అయితే అంబటి రాంబాబును అభినందించాల్సింది పోయి అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ఏదో ఆవేశంతో అన్న మాటలను ఆయన వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పారని.. అటువంటి వ్యక్తిని దండించడానికి మీకు చేతులు ఎలా వచ్చాయి అంటూ మాట్లాడారు. అంబటి జైలుకు వెళ్లిన తర్వాత ఆయన కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ కూడా.. రాజకీయ అనుభవం ఉన్న నేను ఎవరో రచ్చగొడితే.. హుందాగా ప్రవర్తించాల్సిన నేను ఆవేశంతో నోరు జారాను. ముఖ్యమంత్రిని ఉద్దేశించి అలా మాట్లాడడం తప్పు అని అన్నారని చెప్పుకొచ్చారు.. దీంతో అంబటి రాంబాబు లో బ్రహ్మాండమైన మార్పు వచ్చిందని.. ఆయన పశ్చాత్తాప పడుతున్నారని అంతా భావించారు. కానీ నిన్న మళ్ళీ రిమాండ్ కు తరలించే క్రమంలో అంబటి రాంబాబు హావభావాలు చూస్తే ఒక నిర్ణయానికి రావచ్చు. ఆయన పశ్చాత్తాప పడే రకం కాదని కూడా తేలిపోయింది.అంబటి రాంబాబు అయినా.. ఇంకొకరు అయినా వైసీపీలో ఒక స్క్రిప్ట్ ప్రకారమే మాట్లాడతారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాలను అనుసరించి కామెంట్స్ చేస్తారు. అక్కడ ప్రాయశ్చిత్తం, పశ్చాత్తాపం వ్యక్తం చేసే వారికి చోటు ఉండదు. అలా ఆశించలేము కూడా. అటువంటిది అంబటి రాంబాబు పశ్చాత్తాప పడ్డారు అంటే ఏమనుకోవాలి. నిన్ననే గుంటూరు సివిల్ జడ్జ్ కోర్టుకి వ్యానులో తీసుకు వచ్చినప్పుడు అక్కడ తనకోసం ఎదురుచూస్తున్న అనుచరులు, మీడియా ప్రతినిధులను చూసి గడ్డం కింద నుంచి చెయ్యి తిప్పుతూ.. పుష్ప సినిమాలో అల్లు అర్జున్ మాదిరిగా తగ్గేదేలే అని సైగ చేశారు. అది చూసి ఆయన అనుచరులు కూడా ఉత్సాహంగా రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. పార్టీ డిఎన్ఏ లోనే అది నిండిపోయింది. అటువంటప్పుడు అంబటి రాంబాబు పశ్చాత్తాప పడతారని.. పడ్డారని అనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదు అని అర్థమైంది. అరెస్టుకు ముందే అంబటి రాంబాబు చాలా రకాల వ్యాఖ్యలు చేశారు. సీఎం చంద్రబాబు పై కామెంట్స్ చేసే క్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నన్ను అరెస్టు చేసుకుంటారా చేసుకోండి. ఇక్కడే ఉన్నా. అరెస్టు చేస్తే బెయిల్ కూడా అడగను. ఎంత కాలమైనా జైల్లో ఉంటానని కూడా చెప్పేశారు. కానీ ఇప్పుడు ఆయన అనుకున్న మాదిరిగానే జైలు మీద జైలుకు తిరుగుతూనే ఉన్నారు. బెయిల్ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆయన ముఖంలో పశ్చాత్తాపం కాదు కదా.. విపరీతమైన కోపం కనిపిస్తోంది.

# క్వింటాల్ మిరప రూ.87,786..

**అనంతపురం, ఫిబ్రవరి 14, పెన్ పవర్:**
అనంతపురం జిల్లాలో ఓ మిరప రైతు పంట పండింది. వజ్రవన్నూరుకు చెందిన తిప్పేస్వామి అనే మిరప రైతు డబ్బీ డ్రై మిరపను పండించారు. ఈ మిరప పంటను కర్ణాటకలోని బ్యాడిగి మార్కెట్ తరలించగా.. మార్కెట్లో గురువారం రికార్డు స్థాయి ధర పలికింది. క్వింటాల్ మిర్చి ఏకంగా రూ.87,786 పలికింది. దీంతో రైతును మార్కెట్ అధికారులు, వ్యాపారులు, తోటి రైతులు సన్మానించారు. పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించారు.జిల్లాకు చెందిన ఓ మిరప రైతు పంట పండింది. రాయదుర్గం మండలంలోని వజ్రవన్నూరుకు చెందిన తిప్పేస్వామి అనే రైతు పండించిన మిరపకు రికార్డు ధర లభించింది. తిప్పేస్వామి పండించిన డబ్బీ డ్రై మిరప.. రికార్డు స్థాయిలో క్వింటాల్ ధర రూ.87,786 పలికింది. కర్ణాటకలోని హావేరి జిల్లాలో ఉన్న బ్యాడిగి వ్యవసాయ మార్కెట్లో తిప్పేస్వామి పండించిన డబ్బీ డ్రై మిరపకాయలు .. ఈ రికార్డు ధర పలికాయి. దీంతో తోటి రైతులు, మార్కెట్ అధికారులు, వ్యాపారులు తిప్పేస్వామికి సన్మానం చేశారు. నాణ్యమైన మిరప పండించారంటూ పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించారు. వజ్రవన్నూరు రైతులు సుమారు 2 టన్నుల మిరపను బ్యాడిగి మార్కెట్‌కు తరలించారు. మంచి ధర పలకటంతో మిరప రైతులు సంబరాలు చేసుకున్నారు.మరోవైపు గత రెండేళ్లుగా మిరప రేట్లు చతికిలపడ్డాయి. ఇటీవల మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో మిరప రైతులు సంతోషంలో ఉన్నారు. మిరపలో రకాన్ని అనుసరించి రెండేళ్లతో పోలిస్తే ఈ సారి నాణ్యత ప్రకారం ఒక్కో రకం మిరప రూ.7000 నుంచి రూ.8000 వరకూ పెరిగింది. దీంతో రైతులు ఆశగా ఉన్నారు. మిర్చి ధరలు నేలచూపులు చూడటంతో రెండు ఏళ్లుగా రైతులు నష్టపోయారు. దీంతో ఈసారి మిరప సాగుకు చాలా మంది రైతులు ఆసక్తి చూపించలేదు. దీంతో ఉత్పత్తి తగ్గింది. దీనికి తోడు మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలతో పాటు పొరుగు



దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలోనూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. దీంతో మిరప పంట దిగుబడి మరింత తగ్గింది. దీంతో ఈసారి మిరపకు డిమాండ్ పెరుగుతుందని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి.

**డబ్బీ డ్రై మిరపకాయలకు ఎందుకింత డిమాండ్..**

మరోవైపు డబ్బీ డ్రై మిరపకాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వీటిని కర్ణాటకలోని బ్యాతగిరి ప్రాంతంలో ఎక్కువగా పండిస్తారు. నాణ్యమైన, మంచి రంగును కలిగి ఉంటాయి. తక్కువ కారం, ఎక్కువ సువాసన ఉండటంతో డబ్బీ డ్రై మిరపకాయలకు డిమాండ్ ఎక్కువ. డబ్బీ డ్రై మిరపకాయల పొడిని సాంబార్, పచ్చళ్ల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. వీటిలో కూడా ఏ, ఏప్లస్ గ్రేడ్ అనే రెండు రకాలు ఉంటాయి. సాంబార్, మసాలా పొడులు, చట్నీలలో ఎక్కువగా ఈ మిరపకాయల పొడిని ఉపయోగిస్తుంటారు. సాధారణ మిరపకాయలతో పోలిస్తే ముదురు ఎరుపు రంగంలో కాస్త లావుగా ఉండటంతో పాటుగా డబ్బా ఆకారంలో ఉండటంతో వీటికి ఆ పేరు వచ్చింది.

# కడప, బెంగళూరు కొత్త రైల్వే లైన్

**కడప, ఫిబ్రవరి 14, పెన్ పవర్: :** ఏపీలో కొత్త రైల్వే లైన్‌కు సంబంధించి కేంద్రానికి రిక్వెస్ట్ వెళ్లింది. కడప నుంచి బెంగళూరుకు కొత్త రైలు మార్గంపై రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ రైల్వే లైన్ రాయలసీమ అభివృద్ధికి కీలకమైనదని పురందేశ్వరి వివరించారు. ఈ రైల్వే లైన్‌పై సమీక్ష చేసి పనుల్ని వేగవంతం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుపై పలు కీలక అంశాలను ప్రస్తావించారు.ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైల్వే ప్రాజెక్టులపై ఎంపీల నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు వెళుతున్నాయి. తాజాగా మరో కొత్త రైల్వే ప్రాజెక్టుపై రైల్వేమంత్రికి రిక్వెస్ట్ అందజేశారు రాజమహేంద్ర వరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి. రాయలసీమకు కీలకమైన కడప-బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టు అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఈ రైలు మార్గం రాయలసీమ ప్రాంత అభివృద్ధికి అత్యంత కీలకమైనదని పురందేశ్వరి అన్నారు. ఈ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి పునఃసమీక్షించి, పనులను వేగవంతం చెయ్యాలని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఏపీ రవాణాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ కూడా పురందేశ్వరి వెంట ఉన్నారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు 2008లో మంజూరు చేశారని.. మొత్తం 266 నుంచి 268 కి.మీ చేపట్టాల్సి ఉండగా.. కేవలం కడప-పెండ్లిమర్రి మధ్య 21 కిలోమీటర్లు మాత్రమే పనులు పూర్తి చేశారన్నారు. ఈ రైల్వే లైన్ ద్వారా కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కుకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు.రాయలసీమ అభివృద్ధికి అత్యంత కీలకమైన కడపబెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టును పరిశీలించి, త్వరితగతిన అమలు చేయాలని గౌరవ రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ గారిని కోరడం జరిగింది. 2008లో ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టు ఇప్పటివరకు పరిమిత పురోగతితోనే కొనసాగుతోంది. జిల్లాలైన కడప, అన్నమయ్య ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఈ రైల్వే లైన్ ఎంతో కీలకం. కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్‌కు ఊతం, బెంగళూరుతో నేరుగా రైల్వే అనుసంధానం, పరిశ్రమలు వృద్ధి, విద్యార్థులు, రోగులు, ఉద్యోగార్థులకు సౌలభ్యం, పర్యాటకాభివృద్ధి & ఉపాధి అవకాశాలు. ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వంతో వ్యయ భాగస్వామ్య విధానాన్ని మళ్ళీ పరశీలించి, సమన్వయం చేసి, తగిన సమయంలో పూర్తి చేయాలని కోరడం జరిగింది‘ అని పురందేశ్వరి పోస్ట్ చేశారు.ఈ కడప- బెంగళూరు మార్గాన్ని పులివెందుల మీదుగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

# అన్నామలై... ఏపీ నుంచి రాజ్యసభకు...

**విజయవాడ, ఫిబ్రవరి14, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలపైనే ఉంది. జూన్ నెలలో ఖాళీ కానున్న నాలుగు స్థానాల కోసం మే నెలలో నోటిఫికేషన్ రానుంది. అధికార కూటమిలో అప్పుడే సమీకరణాలు వేడెక్కాయి. ముఖ్యంగా కూటమిలోని మూడు పార్టీలు ఈ స్థానాలను ఎలా పంచుకుంటాయి? అభ్యర్థులు ఎవరు? అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.వచ్చే జూన్ 21తో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు సభ్యుల పదవీకాలం ముగియనుంది. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న బలాబలాల దృష్ట్యా, ఈ నాలుగు స్థానాలూ అధికార కూటమికే దక్కడం ఖాయం. ప్రచారం జరుగుతున్న దాని ప్రకారం టీడీపీ 2 స్థానాలు, బీజేపీ ఒకటి, జనసేన ఒక స్థానాన్ని పంచుకునే అవకాశం ఉంది.జనసేన పార్టీకి కేటాయించే ఒక స్థానం కోసం పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుంచి పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉండటం, ఆర్థికంగా అండగా నిలవడమే ఆయనకు సానుకూల అంశాలని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో ఇతర నేతలు కూడా ఉన్నప్పటికీ, సామాజిక, వ్యక్తిగత సమీకరణాల దృష్ట్యా పవన్ ఆయనవైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.తెలుగుదేశం పార్టీకి దక్కే రెండు స్థానాల్లో ఒకదానికి సానా సతీష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోసారి ఆయనకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబు యోచిస్తున్నట్లు టాక్. ఇక రెండో స్థానం కోసం టీడీపీలో భారీ పోటీ నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్లు, ఇటీవలే పార్టీలో చేరిన కీలక నేతలు ఈ సీటును ఆశిస్తున్నారు. అధిష్టానం మాత్రం సామాజిక సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థిని ఎంపిక చేసే ఆలోచనలో ఉంది.అయితే బీజేపీ నుంచి ఎవరు ఎంపికవుతారనేది ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. ఎవరి అంచనాలకు అందని విధంగా, అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ ఓ కొత్త పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనే కె.అన్నామలై. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడైన అన్నామలైని ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు పంపే వ్యూహంలో కేంద్ర బీజేపీ పెద్దలు ఉన్నట్లు సమాచారం. దీని వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేడి కొనసాగుతోంది. అక్కడ పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించినందుకు అన్నామలై కొంత అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయనను జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశపెట్టడం ద్వారా ఆ అసంతృప్తిని చల్లార్చవచ్చని హైకమాండ్ భావిస్తోంది. మాజీ ఐపీఎస్ అధికారిగా, ముక్కుసూటిగా మాట్లాడే నేతగా అన్నామలైకు దక్షిణాది యువతలో మంచి క్రేజ్ ఉంది. ఆయన రాజ్యసభలో ఉంటే దక్షిణాది సమస్యలపై గళం విప్పే అవకాశం ఉంటుంది. టీడీపీ యువనేత నారా లోకేశ్ కు, అన్నామలైకు మధ్య మంచి స్నేహం ఉంది. గతంలో అన్నామలై ఎన్నికల ప్రచారానికి కూడా లోకేశ్ వెళ్లారు. ఈ నేపథ్యంలో అన్నామలై అభ్యర్థిత్వానికి టీడీపీ నుంచి కూడా ఎటువంటి అభ్యంతరం ఉండే అవకాశం లేదు.మరోవైపు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు విజయసాయి రెడ్డి. అయితే ఇటీవల మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని ప్రకటించిన విజయసాయి రెడ్డి పేరు కూడా తెరపైకి వచ్చింది. ఆయన రాజ్యసభకు నామినేట్ అవుతారని కొందరు భావిస్తున్నప్పటికీ, అది బీజేపీ కోటాలో జరుగుతుందా లేదా అన్నది సస్పెన్స్. ఆయన ఇటీవల హిందూ ధర్మం, జాతీయ అంశాలపై చేస్తున్న వ్యాఖ్యలు బీజేపీకి అనుకూలంగా ఉండటం గమనార్హం.ఏది ఏమైనా, జూన్ రాజ్యసభ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త మలుపులు తిప్పబోతున్నాయి. అన్నామలై వంటి జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న నేత ఏపీ నుంచి వెళ్తారా? లేదా స్థానిక సమీకరణాలకే పార్టీలు మొగ్గు చూపుతాయా? అన్నది మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

# మూడేళ్ల ముందు నుంచే వర్క్ షురూ...

**విజయవాడ, ఫిబ్రవరి 14, పెన్ పవర్:** ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు సమీపిస్తోంది. 2024 జూన్ లో వచ్చిన ఫలితాల్లో కూటమి ఏకపక్ష విజయం సాధించింది. 164 స్థానాల్లో గెలుపొందింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలంతా ఓడిపోయారు. అయితే మరోసారి అదే పట్టును కొనసాగించాలని చూస్తోంది కూటమి. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు ఓడిపోయిన నియోజకవర్గాలపై ఇప్పుడు దృష్టి పెట్టింది. మరోసారి అక్కడ కూటమి గెలిచేలా గట్టి ప్రణాళికలు వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో చాన్స్ ఇవ్వకూడదని భావిస్తోంది. అందుకే వైసీపీ కీలక నేతల నియోజకవర్గాల విషయంలో గట్టి పట్టుదలతోనే ఉంది. తాజాగా జరిగిన కలెక్టర్ల రివ్యూలో ఆ జిల్లా మంత్రులకు సైతం సీఎం చంద్రబాబు నిర్దేశించినట్లు తెలుస్తోంది. అభివృద్ధిని చేయడం ద్వారా వైసీపీ కీలక నేతలకు చాన్స్ లేకుండా చూడాలన్నది చంద్రబాబు ఆలోచనగా సమాచారం.వైసీపీ కీలక నేతలుగా చాలామంది ఉన్నారు. అటువంటివారు మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. మరోసారి వారు గెలవకుండా ఉండాలని చూస్తున్నారు చంద్రబాబు. అందులో భాగంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్నాథ్, పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్, అంబటి రాంబాబు, జోగి రమేష్, ఆర్కే రోజా వంటి వారు మరోసారి అసెంబ్లీకి రాకుండా చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్టు కనిపిస్తున్నారు. వారి విషయంలో జిల్లా మంత్రులతో పాటు ఎమ్మెల్యేలకు కీలక టాస్కులు ఇచ్చారు. అభివృద్ధి పరంగా చేపట్టాల్సిన అంశాల గురించి ఆయా జిల్లా కలెక్టర్లతో చర్చించారు సీఎం చంద్రబాబు.2024 అసెంబ్లీ ఎన్నికల్లో నాటి జగన్ క్యాబినెట్లో ఉన్న వారంతా ఓడిపోయారు. ఒక్క పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమే గెలిచారు. అయితే ఈసారి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కూడా ఓడించాలని చూస్తున్నారు చంద్రబాబు. ఎంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 40 శాతం ఓటు బ్యాంకు గురించి ఆలోచన చేస్తోంది తప్ప.. ప్రధాన నియోజకవర్గాల్లో పట్టు తప్పుతోందని గ్రహించడం లేదు. అయితే ఈసారి జగన్ మోహన్ రెడ్డి సైతం సీనియర్లను బరిలో దించే అవకాశం ఉంది. అయితే అటువంటి నియోజకవర్గాలను ఎంపిక చేసుకున్న చంద్రబాబు ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేస్తున్నారు. అధికార యంత్రాంగం పరంగా కూడా అక్కడ ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టాలని భావిస్తున్నారు. తద్వారా ఆ నియోజకవర్గాలను తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తున్నారు. తాజాగా కలెక్టర్ల సదస్సులో దీనిపైనే కీలక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో వారు మరోసారి గెలవకూడదు అన్నది చంద్రబాబు ప్రణాళికగా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# జోష్ నింపుతున్న ఆత్మీయ కలయిక...

**విజయవాడ, ఫిబ్రవరి 14, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో యువనేత, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సరికొత్త రాజకీయ ఒరవడికి శ్రీకారం చుట్టారు. కేవలం పాలన, రాజకీయాలకే పరిమితం కాకుండా, ప్రజాప్రతినిధులతో కుటుంబ సభ్యుల తరహా బంధాన్ని పటిష్టం చేసుకునే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. “ఆత్మీయ కలయిక ఇల్లే వేదిక” పేరుతో లోకేష్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.సాధారణంగా రాజకీయ భేటీలు అంటే వ్యూహాలు, ప్రతివ్యూహాలు, విమర్శలు, ప్రతివిమర్శలతో కూడి ఉంటాయి. కానీ, లోకేష్ నిర్వహిస్తున్న ఈ సమావేశాలు అందుకు పూర్తి భిన్నం. ఉండవల్లిలోని తన నివాసంలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులను వారి కుటుంబ సభ్యులతో సహా ఆహ్వానించి, ఒక ఆత్మీయ విందును ఏర్పాటు చేయడం ద్వారా లోకేష్ అందరినీ ఆశ్చర్యపరిచారు.ఈ నూతన సంప్రదాయానికి తొలి వేదికగా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం నిలిచింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో, ఎమ్మెల్యేలు తమ కుటుంబాలతో సహా లోకేష్ నివాసానికి తరలివచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్ రాజా, బోడే ప్రసాద్, చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పార్లమెంటు సమావేశాల వల్ల ఎంపీ బాలశౌరి, విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా వెనిగండ్ల రాము ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు.ఈ కలయికలో లోకేష్ చూపిన ఆతిథ్యం ప్రత్యేకంగా నిలిచింది. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని చేనేత కార్మికుల నైపుణ్యానికి గుర్తింపుగా, వచ్చిన ఆడపడుచులందరికీ మంగళగిరి పట్టుచీరలను బహూకరించి తన ఆత్మీయతను చాటుకున్నారు. ఇది కేవలం బహుమతి మాత్రమే కాదు, తన నియోజకవర్గ నేతన్నల పట్ల ఆయనకున్న గౌరవానికి, అతిథుల పట్ల ఉన్న మర్యాదకు నిదర్శనం.ఈ సమావేశంలో కేవలం మాటలు, ముచ్చట్లే కాదు.. బాధ్యత కూడా కనిపించింది. గతంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వాటి తాజా స్థితిగతులపై ఒక సమగ్ర నివేదికను లోకేష్ వారికి అందజేశారు. సమస్యలు చెప్పడమే కాదు, వాటి పరిష్కారం ఎక్కడి వరకు వచ్చిందో అధికారికంగా నివేదిక ఇవ్వడం లోకేష్ పనితీరులోని పరిణతిని చూపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుఈ తరహా సమావేశాల వల్ల పార్టీ నాయకులను కేవలం రాజకీయ యంత్రాలుగా కాకుండా, ఒక కుటుంబంగా భావించడం వల్ల వారిలో పార్టీ పట్ల విధేయత, ఉత్సాహం పెరుగుతాయి. చంద్రబాబు క్రమశిక్షణకు మారుపేరైతే, లోకేష్ ఆ క్రమశిక్షణకు ‘ఆత్మీయత’ను జోడించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారు. ఎమ్మెల్యేల నుంచి నేరుగా నియోజకవర్గ సమస్యలను తెలుసుకోవడం, వాటిపై ఫీడ్ బ్యాక్ ఇవ్వడం ద్వారా పాలనలో వేగం పెరుగుతుంది. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులతో మమేకం కావడం ద్వారా, నాయకులకు ఇంటి నుంచే పూర్తి మద్దతు లభించేలా చేయడం లోకేష్ దార్శనికతకు అద్దం పడుతోందిలోకేష్ చేపట్టిన ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమం టీడీపీలో కొత్త జోష్ నింపుతోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపు రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు నియోజకవర్గాల నేతలతో ఇటువంటి భేటీలు జరగనున్నాయి. ఇది కేవలం ఒక డిన్నర్ మీటింగ్ మాత్రమే కాదు, భవిష్యత్తు నాయకత్వ పటిమను, పార్టీ పట్ల లోకేష్‌కు ఉన్న చిత్తశుద్ధిని చాటిచెప్పే ఒక రాజకీయ సంస్కరణగా చెప్పవచ్చు.ఇక మండలిలో అయితే. పాలనను గాడిలో పెడుతూ అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోంది కూటమి. అయితే అంతకుముందు ఉన్న ప్రభుత్వం పెండింగ్లో పెట్టిన చాలా వాటిని పూర్తిచేస్తూ.. కొత్త వాటికి చెల్లింపులు చేస్తోంది. తాజాగా విద్యార్థులకు సంబంధించిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 1200 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ శాసనమండలిలో కీలక ప్రకటన చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## వెనిజులాలో ఆమ్నెస్టీ బిల్లు చిచ్చు

**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులా రాజధాని కారాకాస్ నిరసనలతో హోరెత్తింది. అక్కడి తాత్కాలిక ప్రభుత్వం తీసుకొచ్చిన ఆమ్నెస్టీ బిల్లు ఇందుకు కారణమైంది. దీంతో ఈ బిల్లును వ్యతిరేకిస్తున్న వారు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. రాజకీయ ఖైదీలకు క్షమాభిక్ష (ఆమ్నెస్టీ) ఇవ్వాలని ఉద్దేశించిన బిల్లును జాతీయ అసెంబ్లీ పరిశీలిస్తున్న వేళ ఈ నిరసనలు జరిగాయి. ఇటు ప్రభుత్వం కూడా ఈ నిరసనలకు కౌంటర్‌గా ఆందోళనలు నిర్వహింపజేసింది. దీంతో ప్రభుత్వ అనుకూల, వ్యతిరేక వర్గాలు చేసిన నిరసనలతో కారాకాస్ దద్ధరిల్లింది. గతనెలలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా అరెస్ట్ చేసిన తర్వాత దేశాన్ని డెల్సీ రోడ్రిగ్స్ తాత్కాలిక అధ్యక్షురాలిగా నడిపిస్తున్న విషయం విదితమే. అయితే ఆమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇది తొలి భారీ నిరసన కావడం గమనార్హం. ఆమె పదవిలోకి వచ్చిన తర్వాత వందలాది మంది రాజకీయ ఖైదీలను విడుదల చేసినట్టు ప్రభుత్వం వర్గాల నుంచి సమాచారం అందుతోంది. అయితే ఆ సంఖ్య ప్రభుత్వం చెప్తున్నదాని కంటే తక్కువగా ఉంటుందని మానవ హక్కుల సంస్థలు చెప్తున్నాయి. ఇంకా 600 మందికి పైగా ఖైదీలు జైలులో ఉన్నారని 'ఫోరో పెనాల్' సంస్థ చెప్తున్నది.

## ఇరాన్ వైపు మరో యూఎస్ యుద్ధనౌక

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో దుశ్చర్యకు బరితెగించారు. ఇరాన్ మధ్య చర్చలు వేళ ట్రంప్ ప్రభుత్వం తమ సైనిక శక్తిని ప్రదర్శిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక అయిన యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్‌ను కరేబియన్ సముద్రం నుంచి మధ్యప్రాచ్యం వైపు తరలిస్తోంది. ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని మరింత పెంచేందుకే ఈ చర్య తీసుకున్నట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.ఇరాన్‌తో అణు కార్యక్రమంపై చర్చలు విఫలమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే హెచ్చరించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం, కరేబియన్‌లో ఉన్న జెరాల్డ్ ఫోర్డ్ స్ట్రైక్ గ్రూప్? అట్లాంటిక్ మహాసముద్రం, మధ్యధరా సముద్రం మీదుగా పర్షియన్ గల్ఫ్ వైపు పయనిస్తోంది. ఈ నౌకతో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి అత్యాధునిక డిస్ట్రాయర్లు కూడా ఈ బృందంలో ఉన్నాయి. ఈ విమానవాహక నౌక మే నెల ఆరంభం వరకు మధ్యప్రాచ్యంలోనే ఉండే అవకాశం ఉందని, దీంతో దీని మోహరింపు కాలం 10 నెలలకు పొడిగించవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఒమన్ వేదికగా ఇరు దేశాల మధ్య పరోక్షంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలు కొలిక్కి రాకపోతే దాడులకు దిగేందుకైనా సిద్ధమేనని అమెరికా సంకేతాలిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో ఇప్పటికే యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక సమూహం మోహరించి ఉంది. ఇప్పుడు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరనుండటంతో ఆ ప్రాంతంలో అమెరికాకు చెందిన రెండు శక్తివంతమైన విమాన వాహక నౌకలు అందుబాటులో ఉంటాయి.

## నెతన్యాహూతో నిర్ణయాత్మక ఒప్పందం కుదరలేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ విషయంలో ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో సుమారు మూడు గంటల పాటు చర్చించానని, అయితే నిర్ణయాత్మక ఒప్పందమేదీ కుదరలేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. అయినప్పటికీ ఒప్పందానికి వచ్చేలా ఇరాన్‌తో సంప్రదింపులు కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ఇరువురు నేతలు వాషింగ్టన్‌లో ముఖాముఖి చర్చలు జరిపారు. గత ఏడాది ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత నెతన్యాహూతో భేటీ కావడం ఇది ఏడోసారి. సమావేశం తర్వాత ప్రధాన నిర్ణయాలు వెలువడతాయని అందరూ ఆశించినప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదని ట్రంప్ అన్నారు. 'ఒప్పందం పూర్తయినా కాకపోయినా ఇరాన్‌తో చర్చలు కొనసాగించాలని నేను నొక్కి చెప్పాను. అంతకుమించి ఈ సమావేశంలో సాధించిందేమీ లేదు' అని తెలిపారు. తన వైఖరిని నెతన్యాహూ సమర్థించిందీ లేనిదీ ఆయన వెల్లడించలేదు. 'పోయినసారి ఒప్పందానికి ఇరాన్ విముఖత ప్రదర్శించింది. ఫలితంగా అర్ధరాత్రి సమయంలో దాడిని చవిచూసింది. ఇప్పుడు వారు సహేతుకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నా. గాజాలోనూ, మధ్యప్రాచ్యంలోనూ సాధించిన పురోగతిపై ఇద్దరం చర్చించాం. ఆ ప్రాంతంలో ఇప్పుడు శాంతి నెలకొంది' అని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌తో వివరించారు. కాగా అణు కార్యక్రమానికి మించి ఇరాన్‌తో విస్తృత స్థాయిలో చర్చలు జరపాలని ట్రంప్‌పై నెతన్యాహూ ఒత్తిడి తెస్తారని అందరూ భావించారు. అయితే ట్రంప్ తన డిమాండ్లను అంగీకరించిందీ లేనిదీ నెతన్యాహూ చెప్పలేదు.

## ఐఎస్ఎస్‌కు పయనమైన నలుగురు వ్యోమగాములు

**హైదరాబాద్ పెన్ పవర్:** వైద్యపరమైన అత్యవసర కారణాల వల్ల నలుగురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి అర్ధాంతరంగా భూమికి తిరిగొచ్చిన నేపథ్యంలో వారి స్థానాన్ని భర్తీ చేయడానికి తాజాగా మరో బృందం నింగిలోకి పయనమైంది. స్పేస్ఎక్స్‌కు చెందిన రాకెట్ ద్వారా వారు రోదసిలోకి బయల్దేరారు. వీరిలో అమెరికాకు చెందిన జెస్సికా మెయిర్, జాక్ హాథవే, ఫ్రాన్స్ వ్యోమగామి సోఫీ ఆడెనాట్, రష్యాకు చెందిన ఆండ్రెయ్ ఫెద్యయేవ్‌లు ఉన్నారు. వీరు శనివారం ఐఎస్ఎస్ చేరుకుంటారు. 8–9 నెలల పాటు అక్కడే విధులు నిర్వర్తిస్తారు. వ్యోమగాములు కక్ష్యలోకి చేరగానే.. "ఈ రోజు శుక్రవారం.. 13వ తేదీ. చాలా మంచి రోజు" అని స్పేస్ఎక్స్‌కు చెందిన లాంచ్ కంట్రోల్ సందేశం పంపింది. దీనికి కమాండర్ జెస్సికా స్పందిస్తూ.. "ఇది అద్భుత ప్రయాణం" అని బదులిచ్చారు. ఐఎస్ఎస్‌లో ఇప్పటికే ముగ్గురు వ్యోమగాములు ఉన్నారు. గత నెలలో ఒక వ్యోమగామికి అనారోగ్య సమస్య తలెత్తిన సంగతి తెలిసిందే. దీంతో ఆ ఆస్ట్రోనాట్‌తోపాటు మరో ముగ్గురు సహచరులను అత్యవసరంగా భూమికి రప్పించారు. అనారోగ్యంపాలైన వ్యోమగామి ఎవరన్నది అమెరికా అంతరిక్ష సంస్థ–నాసా వెల్లడించలేదు. పుడమికి చేరాక నలుగురు ఆస్ట్రోనాట్‌లను నేరుగా ఆసుపత్రికి తరలించారు. 65 ఏళ్ల నాసా మానవసహిత అంతరిక్ష యాత్రల చరిత్రలో వైద్య కారణాలతో మిషన్‌ను కుదించాల్సి రావడం అదే మొదటిసారి. తాజా యాత్ర నేపథ్యంలో వ్యోమగాములకు సంబంధించిన వైద్య ప్రక్రియలను సంస్థ సమీక్షించింది. ఇప్పటికే అమల్లో ఉన్న విధానాలతో సంతృప్తి చెందింది.

## గాజా శాంతి బోర్డుపై ఇండోనేసియాలో వ్యతిరేకత

**హైదరాబాద్ పెన్ పవర్:** గాజా కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన శాంతి సంస్థాపన బోర్డులో చేరిన ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబువో సుబియాంతో, అక్కడ నియోగించే అంతర్జాతీయ భద్రతా దళం (ఐఎస్ఎఫ్) కోసం 8 వేల మంది సైనికులకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఐక్యరాజ్యసమితి శాంతి రక్షణ సేన ఉండగా కొత్తగా ట్రంప్ ఐఎస్ఎఫ్‌ను ఏర్పాటు చేయడమేమిటి, అందులో తమ దేశం చేరడమేమిటని ఇండోనేసియా ప్రతిపక్షాలు, మేధావులు, ప్రజా ప్రముఖులు ప్రశ్నిస్తున్నారు. ఐరాస శాంతి రక్షణ సేనకు పెద్ద సంఖ్యలో సైనికులను అందించే 10 దేశాలలో ఇండోనేసియా కూడా ఒకటి. ఐరాస ఆధ్వర్యంలో ఇండోనేసియా ఇంతకుముందు లెబనాన్, గాజాలలో భద్రతా విధులు నిర్వర్తించి, మానవతా సహాయం అందించింది కూడా. తాజాగా ట్రంప్ ఐఎస్ఎఫ్ ఛత్రంలో పనిచేసే ఇండోనేసియా సైనికులు చివరకు ఇజ్రాయెల్ దళాలకు మద్దతు ఇచ్చేవారిగా మిగిలిపోతారా అని ప్రశ్నలు తలెత్తాయి. ముస్లిం దేశమైన ఇండోనేసియాకు ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేకపోయినా తుర్కియే, ఇరాన్‌ల మాదిరిగా శత్రు వైఖరీ లేదు. ఐరాస పరిధికి వెలుపల పనిచేసే ఐఎస్ఎఫ్‌కు, అందులోని ఇండోనేసియా సేనలకు అయ్యే ఖర్చును ఎవరు భరిస్తారనేది తేలలేదు. ఐరాస తరఫున బాధ్యతలు నిర్వహించే శాంతి రక్షక సేనకు సమితే డబ్బు చెల్లిస్తుంది. కాగా ట్రంప్ గాజా కోసం ఏర్పాటుచేసే శాంతి సంస్థాపన బోర్డులో శాశ్వత సభ్యత్వం పొందాలంటే 100 కోట్ల డాలర్ల రుసుము చెల్లించాలి. దీనికి ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంతో ఒప్పుకున్నారు.

# బంగ్లాదేశ్ ఎన్నికల్లో బీఎన్పీ ఘనవిజయం

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ నేషలిస్ట్ పార్టీ (బీఎన్పీ) ఘన విజయాన్ని సాధించింది. బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 299 స్థానాలకు గానూ ఆ పార్టీ 212 చోట్ల విజయం సాధించింది. దీంతో దాదాపు 20 ఏండ్ల తర్వాత బీఎన్పీ బంగ్లాదేశ్‌లో మళ్లీ అధికారం చేపట్టబోతోంది. చివరగా 2006లో ఆ పార్టీ బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాన్ని నడిపింది. తాజాగా బీఎన్పీ అఖండ విజయంతో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిక్ రెహమాన్ ఆ దేశ ప్రధానమంత్రి కాబోతున్నారు. ఆయన నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు బీఎన్పీ వర్గాలు తెలిపాయి. దీంతో హసీనా పాలన అనంతరం బంగ్లాదేశ్‌లో కొన్నేండ్ల తర్వాత కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నది. అయితే, భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి, అవామీ లీగ్ అధ్యక్షురాలు ఈ విషయమై తమ వైఖరిలో ఎలాంటి మార్పూ ఉండబోదని తేల్చిచెప్పింది. విచారణకు ఆమెను భారత్ అప్పగించాలని స్పష్టం చేసింది. చట్టం ప్రకారం ఆమె శిక్ష ఎదుర్కోవాల్సిందే అని పేర్కొంది. షేక్ హసీనాను అప్పగించాలని విదేశాంగ మంత్రి ఇప్పటికే కోరినట్టు బీఎన్పీ సీనియర్ నాయకుడు సలాహుద్దీన్ అహ్మద్ అన్నారు. దీనికి తాము మద్దతు ఇచ్చినట్టు చెప్పారు. "చట్టం ప్రకారం ఆమెను అప్పగించాలని మేము పదే పదే చెబుతున్నాం.. ఇరు దేశాల విదేశాంగ శాఖల మధ్య దీనిపై సమావేశం జరిగింది.. విచారణను ఎదుర్కోవడానికి షేక్ హసీనాను దయచేసి బంగ్లాదేశ్‌కు పంపాలని భారత్ ప్రభుత్వాన్ని కోరాం" అని ఆయన అన్నారు. ఈ క్రమంలో భారత్ సహా అన్ని పొరుగు దేశాలతో బంగ్లాదేశ్ సాధారణ సంబంధాలు కొనసాగాలని కోరుకుంటుంది, కానీ సమాన నిబంధనలతో మాత్రమే ఉంటుందని అహ్మద్ నొక్కిచెప్పారు. "భారత్‌తో సహా అన్ని దేశాలతో పరస్పర గౌరవం,



సమానత్వం ఆధారంగా స్నేహపూర్వక సంబంధం మనకు అవసరం" అని ఆయన అన్నారు. బంగ్లాదేశ్‌లో ఆగస్టు 2024 నాటి విద్యార్థుల ఉద్యమంతో షేక్ హసీనా పదవీచ్యుతురాలైన విషయం తెలిసిందే. దీంతో తన ప్రాణాలను కాపాడుకోవడానికి ఆమె బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు పారిపోయి వచ్చింది. అప్పటి నుంచి ఆమె న్యూఢిల్లీలోని ఓ రహస్య ప్రాంతంలో ఆశ్రయం పొందుతున్నట్టు సమాచారం. ఆమెపై బంగ్లాదేశ్‌లోని యూనస్ నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పలు కేసులు పెట్టగా.. బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఓ కేసులో మరణ శిక్ష విధించింది. దీంతో ఆమెను అప్పగించాలని భారత్‌ను బంగ్లాదేశ్ డిమాండ్ చేస్తోంది. తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో హసీనా విషయంలో భారత్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయం ఇరు దేశాల్లో ఆసక్తికరంగా మారింది.

# మధ్యప్రదేశ్‌లో దారుణం... ఇన్‌స్టాగ్రామ్ ప్రేమ హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్యప్రదేశ్‌లో దారుణం జరిగింది. రాజధాని భోపాల్‌లో ఇన్‌స్టాగ్రామ్ ప్రేమ హత్యకు దారి తీసింది. మహారాష్ట్రకు చెందిన సియా(33)ను ఆమె ప్రేమికుడు సమీర్, తన కుటుంబ సభ్యులతో కలిసి గొంతు కోసి చంపాడు. అయితే సమీర్‌కు గతంలోనే వివాహం జరగగా.. సియాతో సహజీవనం చేస్తున్నాడు. ఈ విషయం ఇంట్లో తెలిసి గొడవలు మొదలయ్యాయి. దీంతో సోమవారం ఆమెను హతమార్చి, మృతదేహాన్ని ఇనుప పెట్టెలో పెట్టి సెప్టిక్ ట్యాంక్లో పడేశారు. పోలీసులు 24 గంటల్లోనే నిందితులను గుర్తించి కేసును ఛేదించారు.గురువారం ఆ ట్యాంక్ సమీపంలో ఆడుకుంటున్న పిల్లలకు దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయినప్పటికీ, ఆమె చేతిపై ఉన్న 'దీపం' పచ్చబొట్టు మరియు "26 మే 1992" అనే పుట్టిన తేదీ ఆధారంగా పోలీసులు ఆమెను గుర్తించారు.ప్రస్తుతం నిందితుడు సమీర్ పరారీలో ఉండగా, హత్యకు సహకరించిన అతని తల్లి, సోదరుడు, సోదరిని పోలీసులు అరెస్టు చేశారు.మహారాష్ట్రలోని గోండియా జిల్లాకు చెందిన సియాకు, భోపాల్‌కు చెందిన సమీర్‌తో ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారడంతో, మూడు నెలల క్రితం ఆమె తన ఇంటిని వదిలి భోపాల్‌కు వచ్చేసింది. అయితే సమీర్‌కు అప్పటికే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలిసినా సియా అతనితోనే సహజీవనం చేయడం ప్రారంభించింది. సమీర్ ఇంట్లోనే సియా ఉండటంతో అతని భార్యతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని లేదా రూ.5 లక్షలు ఇచ్చి సెటిల్ చేయాలని సియా డిమాండ్ చేయడం మొదలుపెట్టింది. పెళ్లి చేసుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని బెదిరించడంతో సమీర్ ఆమెపై కక్ష పెంచుకున్నాడు.గత సోమవారం సాయంత్రం జరిగిన తీవ్ర వాగ్వాదంలో సమీర్ ఆమె గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం ఈ విషయాన్ని తన తల్లి, సోదరుడు, సోదరికి చెప్పాడు. వారందరూ కలిసి మృతదేహాన్ని ఒక ఇనుప పెట్టెలో కుక్కారు. అర్ధరాత్రి సమయంలో ఆ పెట్టెను ఇంటి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో పడేశారు.

## డీకే శివకుమార్ సీఎం కావాలని ఆయన మద్దతుదారుల ఆకాంక్ష




**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఎప్పుడూ నమ్మకంతోనే జీవిస్తున్నానని కష్టపడి పనిచేస్తే ఫలితం తప్పకుండా వస్తుందని అన్నారు.శ్రమ ఎక్కడ ఉంటుందో అక్కడ ప్రతిఫలం ఉంటుంది. భక్తి ఎక్కడ ఉంటుందో అక్కడ భగవంతుడు ఉంటాడు అని ఆయన శుక్రవారం వ్యాఖ్యానించారు.ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఆ తర్వాత టిప్టూరులో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ విధంగా స్పందించారు. ఢిల్లీ పర్యటన తర్వాత మీలో విశ్వాసం పెరిగిందా అని ప్రశ్నించగా, పై వ్యాఖ్యలనే పునరుద్ఘాటించారు. అధికార మార్పిడిపై చర్చించేందుకు ఫిబ్రవరి 17న మిమ్మల్ని, సీఎం సిద్ధరామయ్యను హైకమాండ్ ఢిల్లీకి పిలిచిందనే వార్తలపై స్పందిస్తూ ఆ విషయం నాకు తెలియదు.

కాలమే సమాధానం చెబుతుంది అని అన్నారు. ఇదే అంశంపై హోంమంత్రి పరమేశ్వర అధిష్ఠానాన్ని వివరణ కోరతానన్న దానిపై ఆయనకు మంచి జరగాలి" అని బదులిచ్చారు.కొందరు ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనకు వెళ్తున్నారనే దానిపై నివేదిక కోరారా అని అడగ్గా, తాను ఎలాంటి నివేదిక కోరలేదని, ఆ సమాచారం తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదని స్పష్టం చేశారు.నేను పార్టీకి క్రమశిక్షణ గల సైనికుడిని. పార్టీ ఏది చెబితే దానికి కట్టుబడి ఉంటాను. మిగతా ఏ విషయాల్లోనూ జోక్యం చేసుకోను. ఎమ్మెల్యేలు ఏమైనా సమస్యలు లేవనెత్తితే వాటిని హైకమాండ్ నాయకులు, ముఖ్యమంత్రి చూసుకుంటార అని వివరించారు.ఇదిలా ఉండగా, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలనేది తమ ఆకాంక్ష అని, రాష్ట్ర ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఇదే కోరుకుంటున్నారని ఆయన మద్దతుదారు, ఎమ్మెల్సీ చెన్నరాజ్ హట్టిహోళి పేర్కొనడం గమనార్హం.

## లంబోర్గిని కారు ప్రమాదంలో వ్యాపారి కొడుకే అసలు నిందితుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సంచలనం సృష్టించిన లంబోర్గిని కారు ప్రమాద కేసులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పాదచారుల ప్రాణాలతో చెలగాటమాడుతూ అతివేగంతో కారు నడిపిన ఘటనలో నిందితుడు, ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్ర కుమారుడు శివమ్ మిశ్రాను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు.అయితే ఈ అరెస్టు జరిగిన కొద్ది గంటల్లోనే నిందితుడికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఉదయమే అరెస్ట్ అయిన అతడు మధ్యాహ్నానికి విడుదల కాగా.. దేశ వ్యాప్తంగా ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. సుమారు నాలుగు రోజుల క్రితం కాన్పూర్ వీధుల్లో అతివేగంగా దూసుకొచ్చిన లంబోర్గిని కారు పాదచారులను ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే బౌన్సర్లు వేరే కారులో వచ్చి నిందితుడు అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. అయితే స్థానికుల సమచారాంతో రంగంలోకి దిగిన పోలీసులు.. నిందితుడు శివమ్ మిశ్రానే అని తెలుసుకున్నారు. నాలుగు రోజులుగా అతడి కోసం తీవ్రంగా గాలించగా.. గురువారం అతడు పట్టుబడ్డాడు. ఈక్రమంలోనే అతడిని 14 రోజుల రిమాండ్‌కు అప్పగించాలని పోలీసులు కోర్టును కోరారు. అయితే న్యాయస్థానం రిమాండ్ అభ్యర్థనను తోసిపుచ్చి.. కేవలం రూ. 20 వేల పూచీకత్తుపై అతడికి బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు నిందితుడి కుటుంబం భారీ స్కెచ్ వేసింది. ప్రమాదం జరిగిన సమయంలో శివమ్ కారు నడపలేదని, అసలు డ్రైవర్ తానేనంటూ మోహన్ అనే వ్యక్తిని కోర్టులో లొంగిపోయేలా ప్లాన్ చేశారు. అయితే పోలీసులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. ఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలు, ప్రత్యక్ష సాక్షులు తీసిన వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ సమయంలో స్టీరింగ్ పట్టింది శివమ్ మిశ్రానే అని ప్రాథమికంగా నిర్ధారించడంతో డమ్మీ డ్రైవర్ ప్లాన్ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. మరోవైపు ఈ కేసు దర్యాప్తులో మొదటి నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్థానిక ఇన్‌స్పెక్టర్‌పై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా నిందితుడికి సహకరించేలా వ్యవహరించారన్న ఆరోపణలతో సదరు ఇన్‌స్పెక్టర్‌పై వేటు వేయబోతున్నట్లు సమాచారం. బడా వ్యాపారవేత్తల ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితుడిని గుర్తించినప్పటికీ.. కోర్టులో రిమాండ్ దక్కకపోవడం పోలీసు వర్గాలను విస్మయానికి గురిచేసింది.



# కవాసకీ నింజాపై రూ. 2.50 లక్షల భారీ తగ్గింపు!



ఫిబ్రవరి 2026 నెలకు గానూ కవాసకీ ఇండియా తమ నింజా 650, నింజా 500, నింజా 300 వంటి ఎంపిక చేసిన మోడల్స్‌పై రూ. 2.50 లక్షల వరకు నగదు తగ్గింపుతో పాటు ఉచిత యాక్సెసరీలను అందిస్తోంది. ఇ20 ఇంధన నిబంధనలకు అనుగుణంగా లేని పాత స్టాక్‌ను క్లియర్ చేయడానికి ఈ ఆఫర్లు ఫిబ్రవరి 28 వరకు అందుబాటులో ఉన్నాయి. ఈ తగ్గింపులు ప్రీమియం బైక్స్‌ను యువతకు మరింత చేరువ చేసేందుకు ఉద్దేశించబడ్డాయి. ఆసక్తి ఉన్నవారు వెంటనే డీలర్‌ను సంప్రదించాలి.కవాసకీ అందిస్తున్న ఈ భారీ తగ్గింపులు అన్ని బైక్స్‌కు వర్తించవు. కేవలం ఎంపిక చేసిన మోడల్స్ అయిన నింజా 650, నింజా 500 మరియు నింజా 300 వంటి పాపులర్ బైక్స్‌పై మాత్రమే ఈ ఆఫర్లు ఉన్నాయి. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ డిస్కౌంట్లు ప్రధానంగా పాత స్టాక్‌ను క్లియర్ చేయడానికి ఉద్దేశించినవి. ప్రస్తుతం మార్కెట్లోకి వస్తున్న ఇ20 ఇంధన నిబంధనలకు అనుగుణంగా లేని పాత మోడల్స్‌పై కంపెనీ ఈ భారీ తగ్గింపులను ఇస్తోంది. కాబట్టి కొత్త టెక్నాలజీ కంటే పర్ఫార్మెన్స్ మరియు బ్రాండ్ వాల్యూను ఇష్టపడే వారికి ఇది మంచి డీల్ అని చెప్పవచ్చు.

## టీసీఎస్‌ను వెనక్కి నెట్టిన ఐసీఐసీఐ బ్యాంక్




దేశీయ ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్‌కు వరుస దెబ్బలు తగులుతున్నాయి. మార్కెట్ విలువ పరంగా దేశంలో అత్యంత విలువైన సంస్థల జాబితాలో టీసీఎస్‌ను ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ అధిగమించిన ఒకరోజులోనే మరో స్థానం కోల్పోయింది.గురువారం ప్రైవేట్ రంగ అతిపెద్ద ఐసీఐసీఐ బ్యాంక్ టీసీఎస్‌ను దాటి ఐదో స్థానం దక్కించుకుంది. దీంతో టీసీఎస్ ఆరో స్థానానికి పడిపోయింది. బ్లూమ్‌బర్గ్ డేటా ప్రకారం, 2009, జూన్ తర్వాత మొదటిసారిగా ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాప్‌లో టీసీఎస్‌ను అధిగమించింది. సాయంత్రం స్టాక్ మార్కెట్లు ముగిసే సమయానికి ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ. 10.21 లక్షల కోట్లు ఉండగా, టీసీఎస్ విలువ రూ. 9.96 లక్షల కోట్లకు చేరింది. గురువారం ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ ధర దాదాపు 22 శాతం పెరిగి రూ. 1,432కి చేరింది. ఇదే సమయంలో టీసీఎస్ షేర్ సుమారు 6 శాతం క్షీణించి రూ. 2,741.90 వద్ద ముగిసింది. ఇది 2020, డిసెంబర్ తర్వాత అత్యల్ప స్థాయి. బీఎస్ఈ డేటా ప్రకారం, ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ. 19.71 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో అత్యంత విలువైన సంస్థగా ఉంది. దీని తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(రూ. 14.19 లక్షల కోట్లు), భారతీ ఎయిర్‌టెల్(రూ. 11.51 లక్షల కోట్లు)తో తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

## జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఆదాయం రూ.4,083 కోట్లు



జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.4,082.77 కోట్ల ఆదాయంపై రూ.173.96 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో సంస్థ ఆదాయం రూ.2,748.22 కోట్లు, నికర లాభం రూ.202.10 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 9 నెలల కాలానికి ఆదాయం రూ.11,157.85 కోట్లు, నికర లాభం రూ.71.90 కోట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం మూడు త్రైమాసికాల్లో కలిపి రూ.7,859.20 కోట్ల ఆదాయం, నికర నష్టం రూ.564.24 కోట్లుగా ఉన్నాయి. నిర్వహణ పరంగా కంపెనీ పనితీరు మెరుగుపడిందని యాజమాన్యం పేర్కొంది. దిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాలకు సంబంధించి రాబోయే టారిఫ్ ఆర్డర్ల అమలుతో, భవిష్యత్తులో ఆదాయం, మార్జిన్లు మెరుగుపడతాయని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది.

## ఎప్‌స్టీన్‌తో సంబంధాల వ్యవహారం



అమెరికాలో ప్రముఖ పెట్టుబడి బ్యాంక్ అయిన గోల్డ్‌మ్యాన్ సాచ్స్‌లో ముఖ్య న్యాయ సలహాదారుగా ఉన్న కాథీ రుయెమ్లర్ తన పదవికి రాజీనామా చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఆమెకు సంబంధాలున్నాయంటూ వార్తలు వెలుగులోకి రావడంతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన తాజా దర్యాప్తు పత్రాల్లో రుయెమ్లర్.. ఎప్‌స్టీన్ నుంచి బహుమతులు స్వీకరించినట్లు, ఆయనకు తన ప్రతిష్టను ఎలా కాపాడుకోవాలో సలహాలు ఇచ్చినట్లు సమాచారం బయటపడింది. ఈ వార్తలు మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీశాయి. ఆమె రాజీనామాను కంపెనీ సీఈఓ డేవిడ్ సాల్మన్ ఆమోదించారు. ఆమె కంపెనీకి మంచి సేవలు అందించిందని చెప్పారు. రుయెమ్లర్ గతంలో అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా పాలనలో వైట్‌హౌస్ న్యాయ సలహాదారుగా కూడా పని చేశారు. మీడియా దృష్టి తనపై ఎక్కువ ఉండటం కారణంగా సంస్థ పనులకు ఆటంకం కలుగుతోందని భావించి రాజీనామా చేస్తున్నట్లు ఆమె చెప్పారు. అమెరికాతో పాటు భారత్ వంటి దేశాల్లోనూ ఎప్‌స్టీన్ ఫైల్స్ కలకలం రేపుతున్నాయి. ఎప్‌స్టీన్ కేసుతో సంబంధం ఉన్న పలువురు ప్రముఖులు తమ పదవులకు రాజీనామా చేయడం, దర్యాప్తును ఎదుర్కోవడం జరుగుతోంది. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ప్రభుత్వం కూడా ఈ కేసుతో సంబంధం ఉన్న వివాదాల కారణంగా ఒత్తిడి ఎదుర్కొంటోంది.

# ఫుడ్ డెలివరీ మార్కెట్‌లోకి అడుగు పెట్టిన ఫ్లిప్‌కార్ట్!




ఈ కామర్స్ విభాగంలో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చి ముందంజలో ఉన్న ఫ్లిప్‌కార్ట్.. ఇప్పుడు ఫుడ్ డెలివరీ రంగంలో కూడా అడుగుపెట్టనుంది. అయితే, కంపెనీ నిజానికి ఎప్పుడు ఈ సేవను ప్రారంభించనుందో, జొమాటో & స్విగ్గీ వంటి ఫుడ్ డెలివరీ లీడర్లకు గట్టి పోటీ ఇవ్వగలదా అనే విషయాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.వార్తల ప్రకారం, ఫ్లిప్‌కార్ట్ 2026 మే-జూన్ నాటికి బెంగళూరులో ప్రయోగాత్మకంగా ఫుడ్ డెలివరీ ప్రారంభించే అవకాశం ఉంది. ఆ తరువాత, 2026 చివరి లేదా 2027 ప్రారంభంలో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా ఈ సర్వీస్ అందుబాటులోకి రానుందని అంచనా.వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీలోకి అడుగుపెట్టిన తర్వాత, జొమాటో & స్విగ్గీ వంటి లీడర్లకు గట్టి పోటీగా మారే అవకాశం ఉంది. కంపెనీ మార్కెట్ విలువ 2025 ఆర్థిక సంవత్సరానికి 9 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2030 నాటికి 25 బిలియన్ డాలర్ల వరకు చేరుతుందని అంచనా.ఫుడ్ డెలివరీ కోసం ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే ప్రత్యేక టీమ్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గమనించదగ్గ విషయం ఏమిటంటే, రెండేళ్ల క్రితం ఫ్లిప్‌కార్ట్ ఓలా, పేటీఎం వంటి సంస్థలతో కలిసి ONDC ద్వారా ఫుడ్ డెలివరీ రంగంలోకి రావాలని యోచించినప్పటికీ, ఆ చర్చలు ముందుకు వెళ్లలేదు. ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ మళ్లీ తెరమీదకు వచ్చింది, కానీ ఫ్లిప్‌కార్ట్ నుండి ఇంకా అధికారిక ప్రకటనలేదు.ప్రస్తుతం ఫుడ్ డెలివరీ కోసం మార్కెట్లో పలు ప్లేయర్లు ఉన్నా, జొమాటో & స్విగ్గీ మాదిరిగానే సక్సెస్ సాధించలేకపోయారు. ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్ ప్రవేశించడం వల్ల ఫుడ్ డెలివరీ విభాగంలో ఎంత వరకు విజయం సాధించగలదో త్వరలోనే తెలుస్తుంది. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీ వార్తలు బయటి వినిపించగానే, జొమాటో, స్విగ్గీ షేర్లలో కొద్దిగా తగ్గుదల కనిపించింది.

# రిలయన్స్ చేతికి వెనెజువెలా చమురు!




వెనెజువెలా నుంచి ముడిచమురును నేరుగా కొనుగోలు చేయడానికి, అమెరికా నుంచి సాధారణ లైసెన్స్‌ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) పొందింది. ప్రపంచంలోనే, ఒకేచోట అతిపెద్ద రిఫైనింగ్ సముదాయాన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కంపెనీ నిర్వహిస్తున్న ఆర్ఐఎల్, ఇందుకోసం భారీఎత్తున చమురు దిగుమతి చేసుకుంటూ ఉంటుంది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో, రష్యా నుంచి చమురు దిగుమతులను సంస్థ నిలిపేసిన సంగతి విదితమే. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు ప్రారంభమైతే, రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్లు బలోపేతం కానున్నాయి. గత నెలలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధంలోకి తీసుకున్న అమెరికా, ఆ దేశ ముడిచమురు పరిశ్రమపై ఆంక్షలను సడలించింది. ఇప్పటివరకు ట్రేడర్ల ద్వారా వెనెజువెలా చమురును విక్రయించడానికి అమెరికా అనుమతి ఇచ్చింది. ఇప్పుడు ఆర్ఐఎల్‌కు లభించిన సాధారణ లైసెన్స్ వల్ల, ఏదైనా సంస్థ వెలికితీసిన లేదా ఆధీనంలో ఉన్న చమురును నేరుగా కొనుగోలు చేసే అధికారం లభిస్తుంది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పాలనపై 2019-20లో అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటివరకు వెనెజువెలా ముడిచమురును ఆర్ఐఎల్ కొనుగోలు చేసినా, అంతటితో ఆపేసింది. 2024లో తాత్కాలిక ఉపశమనం ఇవ్వడంతో, మళ్లీ చమురును కొనుగోలు చేసింది. ఈ ఏడాదిలో ట్రేడర్ల ద్వారా వెనెజువెలా విక్రయాలు ప్రారంభమయ్యాక.. అంతర్జాతీయ ట్రేడింగ్ సంస్థ విటోల్ నుంచి 2 మిలియన్ బ్యారెళ్ల కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ రంగ సంస్థలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కూడా 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేశాయి. ఇందులో 5 లక్షల బ్యారెళ్ల చమురును విశాఖపట్నంలోని యూనిట్‌కు హెచ్‌పీసీఎల్ కేటాయించిందని సమాచారం.

# ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 85 శాతం బోనస్ ఫిబ్రవరి నెల జీతంతో పాటుగా..




భారత ఐటీ రంగం దిగ్గజం ఇన్ఫోసిస్ ఉద్యోగులకు గుడ్ న్యూస్ అందించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలోని మూడో త్రైమాసికానికి (క్యూ3) సంబంధించి ఉద్యోగులకు చెల్లించే పనితీరు ఆధారిత బోనస్‌ను సగటుగా 85 శాతంగా ప్రకటించింది.ఇది ఇటీవల త్రైమాసికాలతో పోలిస్తే అత్యధిక బోనస్‌గా నిలవడం గమనార్హంగా చెప్పుకోవచ్చు. ఈ బోనస్ మొత్తం ఉద్యోగులకు ఫిబ్రవరి నెల జీతంతో పాటు చెల్లించనున్నట్లు సంస్థ అంతర్గత సమాచారంలో పేర్కొంది.ఇటీవల కాలంలో ఐటీ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ.. ఇన్ఫోసిస్ మాత్రం వ్యాపార పరంగా స్థిరమైన ప్రదర్శన చూపింది. ముఖ్యంగా కొత్త ఒప్పందాలు దక్కించుకోవడం, ప్రాజెక్టుల అమలు మెరుగ్గా సాగడం వంటివి ఈ బోనస్ పెంపుకు ప్రధాన కారణాలుగా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. బోనస్ శాతం పెరగడం వల్ల ఉద్యోగుల మనోధైర్యం గణనీయంగా పెరిగిందని.. మార్కెట్‌లో టెక్నాలజీ షేర్లపై ఒత్తిడి ఉన్నా ఉద్యోగుల్లో మాత్రం సానుకూల భావన కనిపిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఈ త్రైమాసికంలో ఉద్యోగుల వ్యక్తిగత పనితీరు ఆధారంగా బోనస్ శాతాలు మారాయి. కొంతమంది ఉద్యోగులు 75 శాతం నుంచి 100 శాతం వరకు బోనస్ పొందినట్లు తెలిసింది. గత త్రైమాసికంతో పోలిస్తే సుమారు 10 నుంచి 15 శాతం వరకు ఎక్కువ బోనస్ దక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. అత్యుత్తమ పనితీరు కనబరిచిన కొందరికి పూర్తిస్థాయి. అంటే 100 శాతం బోనస్ లభించడం విశేషం. గత కొన్ని త్రైమాసికాల్లో ఇంత అధిక స్థాయిలో బోనస్ ఇవ్వడం అరుదైన విషయమని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లో సుమారు 3.2 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ బోనస్ నిర్ణయం ఇటీవల విడుదలైన ఉద్యోగుల పనితీరు రేటింగ్స్ తర్వాత రావడం గమనించదగ్గ అంశం. గత సంవత్సరం కూడా పనితీరు ఆధారంగా సంస్థ 5 శాతం నుంచి 8 శాతం వరకు జీత పెంపు ఇచ్చిన సంగతి ఉద్యోగుల్లో ఆశలు పెంచుతోంది. ఈసారి బోనస్ పెరగడానికి ప్రధాన కారణం కంపెనీ ఆర్థిక పనితీరు మెరుగ్గా ఉండటమే. ఆదాయ వృద్ధి అంచనాల్లో స్థిరత్వం, లాభాల్లో మెరుగుదల, అలాగే కీలక మార్కెట్ల నుంచి వచ్చిన ఆర్డర్లు సంస్థకు బలాన్నిచ్చాయి. జనవరిలో ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ మేనేజ్‌మెంట్ కూడా భవిష్యత్తుపై సానుకూల దృక్పథాన్ని వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు ఇచ్చిన అధిక బోనస్ సంస్థ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. బోనస్ పెరగడంతో పాటు, ఇప్పుడు ఉద్యోగులు తదుపరి దశగా జీతం పెంపు (పే రైజ్)పై ఆశలు పెట్టుకున్నారు. కంపెనీ మానవ వనరుల విభాగం గతంలో నిర్వహించిన టౌన్‌హాల్ సమావేశాల్లో కూడా వేరియబుల్ పే మెరుగ్గా ఉంటుందన్న సంకేతాలు ఇచ్చింది.

# అమెరికాలో అదృశ్యమైన కర్ణాటక విద్యార్థి

అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మరో భారతీయ విద్యార్థి అదృశ్యం కావడం ఆందోళన కలిగిస్తోంది. కాలిఫోర్నియాలోని ప్రతిష్ఠాత్మక బర్కిలీ విశ్వవిద్యాలయంలో (యూసీ బర్కిలీ) చదువుతున్న సాకేత్ శ్రీనివాసయ్య (22) అనే విద్యార్థి కనిపించకుండా పోయాడు. కర్ణాటకకు చెందిన సాకేత్, ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదని స్థానిక అధికారులు తెలిపారు. ఐఐటీ-మద్రాస్‌లో బీటెక్ పూర్తి చేసిన సాకేత్, ప్రస్తుతం యూసీ బర్కిలీలో కెమికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నాడు. బర్కిలీ పోలీసులు అతడిని 'జీవి-తీతివిల' మిస్సింగ్ పర్సన్‌గా ప్రకటించి, గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సాకేత్ అదృశ్యం పట్ల తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామని, అతడి కుటుంబ సభ్యులతోనూ, స్థానిక అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ఒక ప్రకటనలో తెలిపింది. సాకేత్ చివరిసారిగా బర్కిలీ హిల్స్‌లోని లేక్ అంజా సమీపంలో కనిపించినట్లు తెలుస్తోంది. అతని పాస్‌పోర్ట్, ల్యాప్‌టాప్‌తో కూడిన బ్యాగ్‌ను ఓ ఇంటి ముందు గుర్తించడం గమనార్హం.

# గర్భాశయ క్యాన్సర్‌కు మహిళలు బలి కావాల్సిందేనా?

భారతదేశంలో మహిళల ప్రాణాలను హరిస్తున్న వ్యాధుల్లో ఇది రెండో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు దీని బారిన పడుతున్నారు. అయితే ఈ వ్యాధిలో ఉన్న ఒకే ఒక్క ఊరట కలిగించే విషయం ఏంటంటే.. దీనిని మనం ముందే గుర్తించి 100 శాతం నివారించవచ్చు. దురదృష్టవశాత్తూ మన దేశంలో అవగాహన లేకపోవడం, పరీక్షలు చేయించుకోవడానికి మొహమాటపడటం వల్ల చాలా మంది మహిళలు చివరి దశలో ఆసుపత్రికి వస్తున్నారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. అసలు ఈ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఎందుకు వస్తుంది? మన శరీరంలో జరిగే ఎలాంటి మార్పులు ప్రమాదానికి సంకేతాలు? గర్భాశయ ముఖద్వారం లేదా సెర్విక్స్ అనేది గర్భాశయానికి, యోనికి మధ్య ఉండే ఒక కండరాల ద్వారం. ఇది మన శరీరంలో ఒక మల్టీ టాస్కర్ లాగా పనిచేస్తుంది. బయటి ఇన్ఫెక్షన్లు గర్భాశయంలోకి వెళ్లకుండా రక్షణ కవచంలా అడ్డుకుంటుంది. పీరియడ్స్ సమయంలో రక్తం బయటకు వెళ్లేలా చూస్తుంది. అంతేకాకుండా, శిశువు జనన సమయంలో ఇది వ్యాకోచించి ప్రసవం సులభంగా జరిగేలా చేస్తుంది. ఇంతటి కీలకమైన సెర్విక్స్ ఆరోగ్యంగా ఉంటేనే మహిళల పునరుత్పత్తి వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది.



పొంచి ఉన్న ముప్పు..గర్భాశయానికి వచ్చే సమస్యలు కేవలం క్యాన్సర్ మాత్రమే కాదు, సాధారణ వాపు నుంచి రకరకాల ఇబ్బందులు కలగవచ్చు. క్యాన్సర్ రావడానికి ముందు కణాలలో జరిగే మార్పు గర్భాశయ డిస్ప్లాసియా. ఇది కంటికి కనిపించదు, కేవలం పరీక్షల ద్వారానే బయటపడుతుంది. గర్భాశయ క్యాన్సర్‌కు ప్రధాన కారణం హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (ఊఖఙ). ఈ వైరస్ చాలా కాలం పాటు శరీరంలో ఉంటే అది క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉంది. గర్భాశయంలో పెరిగే చిన్న గడ్డలు. ఇవి అన్నీ క్యాన్సర్ కానప్పటికీ, వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షించుకోవడం ఉత్తమం.

పాటించాల్సిన జాగ్రత్తలు.. పరిశుభ్రత: పీరియడ్స్ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. నాణ్యమైన శానిటరీ ప్యాడ్‌లు వాడాలి. వాటిని నిర్ణీత సమయానికి మారుస్తూ ఉండటం వల్ల ఇన్ఫెక్షన్లను అరికట్టవచ్చు. స్క్రీనింగ్ పరీక్షలు: 25 ఏళ్లు దాటిన ప్రతి మహిళ క్రమం తప్పకుండా పాప్ స్మెర్, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. దీనివల్ల క్యాన్సర్ రాకముందే కణాల్లో మార్పులను గుర్తించవచ్చు.టీకా వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా ఈ క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చు. 11 ఏళ్ల నుంచి 26 ఏళ్ల లోపు ఈ టీకా తీసుకోవడం చాలా శ్రేయస్కరం. జీవనశైలి మార్పులు: ధూమపానం వంటి అలవాట్లు మానుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని పక్కన పెట్టి, పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. లక్షణాలను గుర్తించడం: పొత్తికడుపు నొప్పి లేదా అసాధారణ రక్తస్రావాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు. మీ శరీరంలో ఈ క్రింది మార్పులు కనిపిస్తే ఆలస్యం చేయకుండా గైనకాలజిస్ట్‌ను సంప్రదించాలి. యోని నుండి విపరీతమైన స్రావం కావడం, దాని రంగు లేదా వాసనలో మార్పు రావడం ప్రధాన లక్షణాలు. పీరియడ్స్ మధ్యలో లేదా శృంగారం తర్వాత రక్తస్రావం కావడం, శృంగార సమయంలో విపరీతమైన నొప్పి రావడం ప్రమాద సంకేతాలు. పొత్తికడుపు లేదా నడుము భాగంలో మొండి నొప్పి వేధిస్తున్నా అది గర్భాశయ సమస్యే కావచ్చు. గర్భాశయ క్యాన్సర్ అనేది అకస్మాత్తుగా వచ్చేది కాదు. ఇది శరీరంలో కణాల మార్పు ద్వారా నెమ్మదిగా మొదలవుతుంది. మనకు సరైన అవగాహన ఉండి, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటే దీని నుంచి 100 శాతం కోలుకోవచ్చు. మీ శరీరం ఇచ్చే చిన్న చిన్న సంకేతాలను కూడా విస్మరించకండి.

# భోజనం చేసే సమయంలో చెమట పడితే డయాబెటిస్ వస్తుందా?

కొంత మందికి భోజనం చేసేటప్పుడు చెమట పడుతుంది. ముఖ్యంగా నుదిటిపై చెమట ఎక్కువగా పడుతుంది. వేడి ఆహారం తినడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని అందరూ అనుకుంటారు. కానీ మీరు చల్లగా ఏదైనా తిన్నప్పుడు లేదా తాగిన ప్రతిసారీ ఇలా జరిగితే లేదా చలికాలంలో కూడా ఇలా చెమట పడుతుంటే అది సాధారణం కాదు. కొంతమంది తినేటప్పుడు చెమట పట్టడం మీరు గమనించి ఉంటారు. కొంతమందికి తక్కువ మొత్తంలో చెమట పడుతుంటే, మరికొందరికి ఏకదాటిగా చెమట పడుతుంది. ముఖ్యంగా నుదిటిపై చెమట ఎక్కువగా పడుతుంది. వేడి ఆహారం తినడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని అందరూ అనుకుంటారు. కానీ మీరు చల్లగా ఏదైనా తిన్నప్పుడు లేదా తాగిన ప్రతిసారీ ఇలా జరిగితే లేదా చలికాలంలో కూడా ఇలా చెమట పడుతుంటే అది సాధారణం కాదు. కాబట్టి దీనికి కారణం ఏమిటి? ఇది ఏదైనా వ్యాధికి సంకేతమా? ఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన డాక్టర్ హిమాన్ష భదాని మాట్లాడుతూ.. తినేటప్పుడు చెమట పట్టే సమస్యను వైద్యపరంగా గస్టేటరీ చెమట అని పిలుస్తారు. అధిక కారంగా ఉండే ఆహారం తిన్నప్పుడు శరీరం చెమట పట్టడం ప్రారంభిస్తుంది. ఇది సాధారణంగా వెచ్చని శరీరం ఉన్నవారిలో కనిపిస్తుంది. తినేటప్పుడు చెమట పట్టడం కొందరికి సాధారణం. కానీ మరికొందరికి ఇది వివిధ వ్యాధుల లక్షణం కావచ్చు. డాక్టర్ హిమాన్ష మాట్లాడుతూ భోజనం చేసేటప్పుడు చెమటలు పట్టడం మధుమేహం ప్రారంభ లక్షణం కావచ్చు. ఎవరికైనా డయాబెటిస్ ఉంటే అది నరాల



దెబ్బతినడానికి కారణమవుతుంది. కాబట్టి ఇది భోజనం చేసేటప్పుడు చెమట పట్టడానికి దారితీస్తుంది. కానీ ఇది అన్ని సందర్భాల్లోనూ జరగదు. కొందరికి ఇది థైరాయిడ్ లేదా హార్మోన్ల మార్పుల వల్ల కూడా జరగవచ్చు. పెద్దల మాదిరిగానే పిల్లలు కూడా తినేటప్పుడు చెమట పట్టవచ్చు. పిల్లలు కారంగా ఉండే ఆహారం తిన్నప్పుడు, దానిని జీర్ణం చేసుకోవడానికి వారి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇది చెమట పట్టడానికి దారితీస్తుంది. అయితే సాధారణ ఆహారం తిన్నప్పుడు కూడా పిల్లలకు చెమటలు పడుతుంటే లేదా వేగంగా బరువు తగ్గుతుంటే, తినేటప్పుడు వారి హృదయ స్పందన రేటు పెరగకపోతే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# రోజుకు ఎన్ని కప్పులు కాఫీ తాగుతున్నారు?



ఉదయం నిద్రలేచిన వెంటనే ఘుమఘుమలాడే కప్పు కాఫీ లేకుండా వీరికి రోజు ప్రారంభం కాదు. కాఫీలోని కెఫిన్ తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ ఒక రోజులో ఎన్ని కప్పుల కాఫీ తాగాలి? ఎప్పుడు తాగాలి? అనే విషయాలు కూడా చాలా ముఖ్యం. కాఫీని మితంగా తాగడం వల్ల శరీరానికి ఔషధంలా పనిచేస్తుంది. కాఫీలోని కెఫిన్ మెదడును ఉత్తేజపరుస్తుంది. మగతను దూరం చేస్తుంది. అలాగే కాఫీని మితంగా తాగడం వల్ల

ఉదయం నిద్రలేచిన వెంటనే ఘుమఘుమలాడే కప్పు కాఫీ లేకుండా చాలా మందికి రోజు ప్రారంభం కాదు. కాఫీలోని కెఫిన్ తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ ఒక రోజులో ఎన్ని కప్పుల కాఫీ తాగాలి? ఎప్పుడు తాగాలి? అనే విషయాలు కూడా చాలా ముఖ్యం. కాఫీని మితంగా తాగడం వల్ల శరీరానికి ఔషధంలా పనిచేస్తుంది. చాలా మందికి కాఫీ అంటే కేవలం పానీయం కాదు, అదొక సెంటిమెంట్. అందుకే

గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కాఫీ కాలేయం నుంచి విషాన్ని బయటకు పంపి, కొవ్వు కాలేయ సమస్యను తగ్గిస్తుంది. ఇది శరీరంలో జీవక్రియ వేగాన్ని పెంచుతుంది. ఇది కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. పరిశోధన ప్రకారం బ్లాక్ కాఫీ టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం రోజుకు 2 కప్పుల కాఫీ తాగడం సురక్షితం. అయితే ఆరోగ్యకరమైన వ్యక్తి రోజుకు 400 మిల్లీగ్రాముల కంటే ఎక్కువ కెఫిన్ తీసుకోకూడదు. ఒక కప్పు కాఫీలో దాదాపు 100 మిల్లీగ్రాముల కెఫిన్ ఉంటుంది. కాబట్టి ఆరోగ్యవంతమైన వ్యక్తులు ఒక రోజులో రెండు నుంచి మూడు కప్పుల కాఫీ తాగవచ్చు. మీరు రోజుకు 4-5 కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగితే, అది తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. అధికంగా కాఫీ సేవిస్తే చేతులు, కాళ్ళ నిరంతరం వణుకుట లేదా చిరాకు వంటి సమస్యలను కలిగిస్తుంది. అలాగే కెఫిన్

రక్తపోటులో అకస్మాత్తుగా పెరుగుదలకు కారణమవుతుంది. దానితో పాటు, కాఫీ వల్ల కలిగే అతిపెద్ద సమస్య రాత్రి సమయానికి నిద్రపోలేకపోవడం. అలాగే కాఫీ కడుపు రుగ్మతలకు కూడా కారణమవుతుంది. ఎక్కువ కాఫీ పిత్తాన్ని పెంచుతుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య కాఫీ తాగడం చాలా ప్రభావవంతంగా ఉంటుంది. కానీ సాయంత్రం 4 గంటల తర్వాత కాఫీ తాగకపోవడమే మంచిది. కాఫీలోని కెఫిన్ ప్రభావం శరీరంలో 12 గంటలకు పైగా ఉంటుంది. మీరు సాయంత్రం వేళల్లో కాఫీ తాగితే, అది రాత్రి నిద్రకు భంగం కలిగిస్తుంది. దీని వలన మరుసటి రోజు మొత్తం అలసిపోయినట్లు అనిపిస్తుంది.

## పండిన అరటి పండ్లతో దోసెలు.. వీటిని ఒక్కసారి తింటే అస్సలు వదిలిపెట్టరు?



ఇప్పటి వరకు ఎన్నో రకాల దోసెలను తినే ఉంటారు. మరి అరటి దోసెను తిన్నారా? వినడానికి కొత్తగా ఇది చేసుకుని తింటే రుచి అద్భుతంగా ఉంటుంది. పండిన అరటి పండ్లతో దోసె వేసుకుని తింటే ఆహా ఓహో అంటూ లాగిస్తూనే ఉంటారు. దీనికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం గురించి ఇక్కడ తెలుసుకుందాం. మన దేశంలోనే కాదు.. అన్ని చోట్లా దోసె చాలా ఫేమస్. దీనిని ఎంతో మంది ఇష్టంగా తింటారు. కొందరు ఉదయం, ఇంకొందరు సాయంత్రం ఇలా ఎప్పుడు పడితే అప్పుడు తింటూనే ఉంటారు. సమయం, సందర్భం అంటూ ఏమీ ఉండదు. కావలసిన పదార్థాలు: 3 అరటిపండ్లు, గోధుమ పిండి లేదా బియ్యం పిండి తీసుకున్నా కూడా సరిపోతుంది, బెల్లం తురుము, యాలకుల పొడి, నూనె, ఒక గ్లాస్ నీరు. ఒక బౌల్ ను తీసుకొని దానిలో పండిన అరటిపండ్లను పేస్ట్ లా చేసుకోవాలి. ఇప్పుడు దానిలో మీరు ఏ పిండి తీసుకుంటే దానిని వేసి, కట్ చేసి పెట్టుకున్న బెల్లం ముక్కలు, కొద్దిగా యాలకుల పొడి వేసి మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి. ఇక ఇప్పుడు, దానిలో కొంచం నీళ్ళు పోసి బాగా కలుపుకోవాలి. మరి, పేస్ట్ లా కాకుండా నార్మల్ దోసె పిండి లాగా ఉంటే చాలు. అప్పుడు దోసెను రెండు వైపులా పెనం మీద సులభంగా కాల్చవచ్చు. ఇక ఇప్పుడు పాన్ పెట్టి దానిలో కొంచం నూనె వేసి అది వేడయ్యాక, ఒక గరిటెడు పిండిని పోసి దోస లాగా వేయండి. మరి పలుచగా కాకుండా, కొంచం మృదువుగా ఉండేలా వేయండి. ఒక రెండు నిముషాలు అలాగే ఉంచి , రెండు వైపులా కాలిన తర్వాత ఆ దోసెను ప్లేట్ లోకి తీసుకోండి. అంతే వేడి వేడి అరటి దోసె రెడీ. అయితే, దీనినిమీరు నెయ్యితో తింటే రుచి అద్భుతంగా ఉంటుంది.

# ఆరోగ్యకరమైన రోజుకు బలమైన ఆరంభం ఇదే..!




సమతుల్య పోషకాలు ఉన్న బ్రేక్‌ఫాస్ట్ మాత్రమే నిజమైన ఆరోగ్యాన్ని ఇస్తుంది. మంచి బ్రేక్‌ఫాస్ట్‌లో ఉండాల్సిన ముఖ్యమైన పోషకాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఒక ఆదర్శ బ్రేక్‌ఫాస్ట్‌లో ఈ నాలుగు తప్పనిసరిగా ఉండాలి. కార్బోహైడ్రేట్లు శక్తికోసం, ప్రోటీన్లు కండరాల బలం, దీర్ఘకాల తృప్తికోసం ఫైబర్ జీర్ణక్రియ, షుగర్ నియంత్రణకోసం ఆరోగ్యకరమైన కొవ్వులు హార్మోన్ల సమతుల్యం కోసం తప్పనిసరి. ఉదయం తినే బ్రేక్‌ఫాస్ట్ మన శరీరానికి ఇంధనం లాంటిది. రాత్రంతా ఉపవాసంలో ఉన్న శరీరానికి కావాల్సిన శక్తిని అందించి, మెదడు పనితీరును చురుకుగా ఉంచడంలో బ్రేక్‌ఫాస్ట్ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే "ఏది తిన్నా సరిపోతుందా?" అంటే కాదు. సమతుల్య పోషకాలు ఉన్న బ్రేక్‌ఫాస్ట్ మాత్రమే నిజమైన ఆరోగ్యాన్ని ఇస్తుంది. మంచి బ్రేక్‌ఫాస్ట్‌లో ఉండాల్సిన ముఖ్యమైన పోషకాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఒక ఆదర్శ బ్రేక్‌ఫాస్ట్‌లో ఈ నాలుగు తప్పనిసరిగా ఉండాలి. కార్బోహైడ్రేట్లు శక్తి కోసం, ప్రోటీన్లు కండరాల బలం, దీర్ఘకాల తృప్తి కోసం ఫైబర్ జీర్ణక్రియ, షుగర్ నియంత్రణ కోసం ఆరోగ్యకరమైన కొవ్వులు హార్మోన్ల సమతుల్యం కోసం తప్పనిసరి. 1. ఇడ్లీ / దోసె + సాంబార్:ఫెర్మెంటెడ్ ఆహారం కావడంతో జీర్ణక్రియకు మంచిది సాంబార్‌లో కూరగాయలు, పప్పులు ఉండటం వల్ల ప్రోటీన్, ఫైబర్ లభిస్తాయి 2. ఓట్స్ ఉప్మా / ఓట్స్ పోరిడ్జ్: ఫైబర్ అధికంగా ఉండి కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడుతుంది. షుగర్ ఉన్నవారికి మంచి ఎంపిక. 3. రాగి జావ / రాగి దోసె: కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉంటాయి. ఎముకల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. 4. గుడ్లు (ఉడికించినవి): హై క్వాలిటీ ప్రోటీన్. బరువు తగ్గాలనుకునేవారికి సరైన ఆహారం. 5. పండ్లు + నట్స్: పండ్లలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. తేలికగా ఉండే బ్రేక్‌ఫాస్ట్ కావాలనుకునేవారికి మంచిది.

బ్రేక్‌ఫాస్ట్‌లో ఉండకూడదనవి.. అధిక చక్కెర ఉన్న ఆహారాలు బేకరీ ఐటెమ్స్ (పఫ్‌లు, క్రీమ్ బన్స్) డీప్ ఫ్రైడ్ స్నాక్స్ కేవలం టీ లేదా కాఫీతో బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేయడం ఇవి తాత్కాలికంగా శక్తినిచ్చినా, దీర్ఘకాలంలో అలసట, బరువు పెరుగుదలకు కారణమవుతాయి. ఉదయం లేచిన 1, 2 గంటల్లోపు బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం ఉత్తమం. ఇది మెటబాలిజాన్ని యాక్టివ్ చేసి రోజంతా శక్తిని నిలబెడుతుంది. పోషక నిపుణుల ప్రకారం.. బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేయడం వల్ల షుగర్ లెవల్స్ అసమతుల్యం అవుతాయి, అలాగే ఎక్కువగా తినే అలవాటు పెరుగుతుంది. రోజు ఎలా ప్రారంభమవుతుందో, రోజు అంతా అలాగే సాగుతుంది. కాబట్టి మీ జీవనశైలి, వయసు, ఆరోగ్య స్థితికి తగ్గట్టు బ్రేక్‌ఫాస్ట్‌ను ఎంచుకోవడం చాలా ముఖ్యం. మంచి బ్రేక్ ఫాస్ట్ మంచి ఆరోగ్యానికి సంకేతమంటున్నారు ఆరోగ్య నిపుణులు.

## రాత్రి నిద్రకు ముందు ఈ తప్పులు చేస్తున్నారా?

శరీరంలో 60 నుంచి 70 శాతం నీటితోనే తయారవుతుంది. అందుకే వైద్యులు ప్రతిరోజూ కనీసం 8 గ్లాసుల నీళ్లు తాగాలని సిఫార్సు చేస్తున్నారు. కానీ పడుకునే ముందు నీళ్లు తాగే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. శరీరానికి నీళ్లు చాలా ముఖ్యమని అందరికీ తెలిసిన విషయమే. శరీరంలో 60 నుంచి 70 శాతం నీటితోనే తయారవుతుంది. అందుకే వైద్యులు ప్రతిరోజూ కనీసం 8 గ్లాసుల నీళ్లు తాగాలని సిఫార్సు చేస్తున్నారు. కానీ పడుకునే ముందు నీళ్లు తాగే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ అలవాటు వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే నిద్రకు భంగం కలుగుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి పడుకునే ముందు నీళ్లు తాగడం వల్ల మీకు ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయో? ఈ సమయంలో ఎక్కువ నీళ్లు తాగితే ఎలాంటి సమస్యలు వస్తాయో? పడుకునే ముందు నీళ్లు తాగడం వల్ల శరీరం నుంచి విషాన్ని బయటకు పంపుతుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. నీళ్లు తాగడం వల్ల శరీరం చల్లబరుస్తుంది. రాత్రిపూట మంచి నిద్ర వస్తుంది. ఇంకా గోరువెచ్చని నీళ్లు తాగడం వల్ల కండరాల నొప్పి తగ్గడమే కాకుండా జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. నిమ్మరసం కలిపిన నీళ్లు తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చర్మం ప్రకాశవంతంగా ఉంటుంది. పడుకునే ముందు ఎక్కువ నీళ్లు తాగడం వల్ల నోక్టురియా అనే సమస్య వస్తుంది. ఎక్కువ నీళ్లు తాగడం వల్ల రాత్రిపూట తరచుగా మూత్ర విసర్జన జరుగుతుంది. ఇది మీ నిద్రకు అంతరాయం కలిగిస్తుంది. తగినంత నిద్ర రాకపోవడం వల్ల అలసట, తలనొప్పి, మరుసటి రోజు ఏకాగ్రత లోపించడం జరుగుతుంది. దీర్ఘకాలంలో, ఇది గుండె ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. నీళ్లు తాగిన వెంటనే నిద్రపోవడం మంచిది కాదు.నిద్రపోవడానికి కనీసం 2 గంటల ముందు నీళ్లు తాగడం మంచిది.రాత్రి భోజనం చేసిన గంట తర్వాత నీళ్లు తాగడం వల్ల జీర్ణక్రియ సజావుగా సాగుతుంది.పడుకునే ముందు దాహం వేస్తే, పెద్ద గ్లాసు నీళ్లు తాగడం కంటే కొన్ని సిప్స్ నీళ్లు తాగడం మంచిది. నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిదే. కానీ అది మీ నిద్రకు భంగం కలిగించకూడదు. కాబట్టి పడుకునే ముందు సమయానికి అనుగుణంగా నీళ్లు తాగాలి. తద్వారా మీ ఆరోగ్యాన్ని సరిగ్గా కాపాడుకోవచ్చు.

# టీ20 వరల్డ్ కప్‌లో అరుదైన రికార్డు... ఫిఫ్టీ బాదిన పెద్ద వయస్కుడిగా కలీమ్

**టీ20 ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించిన ఆమిర్ కలీమ్**

**44 ఏళ్ల వయసులో హాఫ్ సెంచరీ చేసిన అత్యంత పెద్ద వయస్కుడిగా రికార్డు**

**ఐర్లాండ్‌పై 28 బంతుల్లో 50 పరుగులు చేసిన ఒమన్ ఆల్ రౌండర్**

**ఆమిర్ రికార్డు ఇన్నింగ్స్ ఆడినా మ్యాచ్‌లో ఓడిపోయిన ఒమన్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒమన్ ఆల్ రౌండర్ ఆమిర్ కలీమ్ టీ20 ప్రపంచకప్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో హాఫ్ సెంచరీ చేసిన అత్యంత పెద్ద వయస్కుడిగా శనివారం రికార్డు సృష్టించాడు. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఆమిర్ కలీమ్ వయసు 44 ఏళ్ల 86 రోజులు. సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో, ఐర్లాండ్ నిర్దేశించిన 236 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఒమన్ తరఫున ఆమిర్ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. కేవలం 28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్ల సహాయంతో 50 పరుగులు పూర్తి చేశాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా, హమ్మద్ మిర్జాతో కలిసి 73 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే, బారీ మెక్‌కార్తీ వేసిన పదునైన బౌన్సర్‌కు ఔటయ్యాడు.

ఈ హాఫ్ సెంచరీతో, తన సహచర ఆటగాడు మహ్మద్ నదీమ్ నెలకొల్పిన రికార్డును ఆమిర్ అధిగమించాడు. ఇదే టోర్నమెంట్‌లో శ్రీలంకపై నదీమ్ 43 ఏళ్ల 161 రోజుల వయసులో హాఫ్ సెంచరీ చేసి ఈ రికార్డును నెలకొల్పాడు. ఈ జాబితాలో శ్రీలంక దిగ్గజం సనత్ జయసూర్య (39 ఏళ్ల 345 రోజులు) మూడో స్థానంలో ఉన్నాడు.

ఆమిర్ రికార్డు ఇన్నింగ్స్ ఆడినప్పటికీ, ఒమన్ జట్టును గెలిపించలేకపోయాడు. అతను ఔటైన తర్వాత ఒమన్ ఇన్నింగ్స్ కుప్పకూలింది. 18 ఓవర్లలో 139 పరుగులకే ఆలౌట్ కావడంతో ఐర్లాండ్ 96 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇటీవలే టీ20 ప్రపంచకప్‌లో పాల్గొన్న అత్యంత పెద్ద వయస్కుడిగా కూడా ఆమిర్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.

# దీదీబాదుడుకు బ్రేక్.. టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్‌శ్రీ రాయనున్న వైభవ్ సూర్యవంశీ !



**హైదరాబాద్ పెన్ పవర్:** అతను బ్యాట్ పడితే సిక్సరే. స్పిన్ బౌలింగ్ అయినా.. పేస్ బౌలింగ్ అయినా.. ఈ చిచ్చరపిడుగుకు తెలిసిందల్లా అటాకింగ్ బ్యాటింగ్ ఒక్కటే. బ్యాట్ పడితే బాదుడే. ఫాస్టెస్ట్ సెంచరీల స్పెషలిస్ట్. ప్రత్యర్థి జట్టు బౌలర్లకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్న యువ తేజం వైభవ్ సూర్యవంశీ పదో తరగతి పరీక్షలు రాయడానికి ప్రిపేర్ అవుతున్నాడు.

బ్యాట్‌ఎకు రెస్ట్ ఇచ్చి పుస్తకాలను ముందేసుకుని కుస్తీ పడుతున్నాడు. ఫిబ్రవరి 17వ తేదీ నుంచి బీహార్‌శ్రీలో టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ జరగబోతున్నాయి. బీహార్‌శ్రీలోని సమస్తిపూర్ పోడార్ ఇంటర్నేషనల్ స్కూశ్రీలో వైభవ్ సూర్యవంశీ టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ రాయబోతున్నాడు. క్రికెట్ ప్రపంచానికి కొన్నాళ్లు దూరంగా.. పెన్నూపుస్తకాలకు దగ్గరగా సూర్యవంశీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. అకడమిక్ పిచ్‌శ్రీలో సిక్సులు, ఫోర్లు కొట్టాల్సిన టైమొచ్చింది. క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ తమ పాఠశాలలో 10వ తరగతి బోర్డు పరీక్షలకు హాజరు కానున్నాడని పోడార్ ఇంటర్నేషనల్ స్కూ ప్రిన్సిపాల్ తెలిపారు. అతనికి ఇప్పటికే అడ్మిట్ కార్డు అందిందని, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ అతనిని చూసేందుకు ఉత్సాహంగా ఉన్నారని చెప్పారు. అయితే, అతను ఇప్పటికీ విద్యార్థేనని.. పరీక్షకు హాజరు కానున్నందున.. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తాము ఏర్పాట్లు చేశామని స్కూల్ ప్రిన్సిపాల్ చెప్పారు. ఇది క్రికెట్ పిచ్ కాదు, అకడమిక్ పిచ్ అని గుర్తుచేశారు. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో అందరినీ సమానంగా చూస్తామని.. అన్ని సౌకర్యాలు అందరికీ ఒకేలా ఉంటాయని ప్రిన్సిపాల్ నీల్ తెలిపారు.

# ఇలా చేస్తే పక్కా భారత్ ఓడిపోతుంది.. పాక్ జట్టుకి షాహిద్ అఫ్రిది కీలక సూచనలు





**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో కోలంబోలో రేపు ( ఫిబ్రవరి 15న) జరగనున్న భారత్ పాకిస్థాన్ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు పాక్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది కీలక సూచనలు చేశారు. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే పెద్ద షాట్లు లేదా షాకింగ్ ప్లేయర్ అవసరం లేదు, కేవలం బేసిక్స్‌ను సరిగ్గా పాటిస్తే సరిపోతుందని అన్నారు. పాకిస్థాన్ జట్టులో మంచి డెప్త్ ఉంది.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఈ మూడు విభాగాల్లో తక్కువ తప్పులు చేయడమే మన జట్టు విజయానికి ముఖ్యం అని స్పష్టం చేశారు. తప్పులు అందరూ చేస్తారు.. కానీ తక్కువ తప్పులు చేసే జట్టు మాత్రమే గెలుస్తుంది అని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది తెలిపారు. బ్యాటింగ్ విషయానికి వస్తే, మొదటి వికెట్లు పడినా భయపడాల్సిన అవసరం లేదు.. మిడిల్ ఆర్డర్ లో మంచి బ్యాటర్లు ఉండటంతో జట్టు తిరిగి నిలబడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఇన్నింగ్స్ ఆరంభంలో జాగ్రత్తగా ఆడి స్కోర్ బోర్డును ముందుకు తీసుకెళ్లాలి.. చివరి ఓవర్లలో పవర్ హిట్టింగ్ తో పరుగుల వేగం పెంచాలని అఫ్రిది సూచించారు. ప్రత్యేకంగా పాకిస్థాన్ జట్టు ఓపెనర్లకు షాహిద్ అఫ్రిది ఓ సలహా ఇచ్చారు. రన్ రేట్ పెంచే ప్రయత్నం చేయాలి కానీ తొందరపడి వికెట్లు కోల్పోవద్దని హెచ్చరించాడు. జట్టు సమతుల్యంగా ఆడితే మంచి ఆరంభం దక్కుతుందని పేర్కొన్నాడు. మొత్తానికి, షాహిద్ అఫ్రిది చెప్పిన ప్రకారం, భారీ షాట్ల కంటే కూడా బేసిక్ అంశాల్లో పటిష్టంగా ఉండటం వలన ఇలాంటి కీలక మ్యాచ్‌లో పాకిస్థాన్ విజయం సాధించడానికి ఈజీ అవుతుందని క్రికెట్ విశ్లేషకులు తెలియజేస్తున్నారు.



ఈ చిత్రాలలో దిశా పటాని చాలా స్టైలిష్‌గా ఉంది

# హీట్ పెంచిన సంయుక్త.. అందాలతో అదరహో అనిపిస్తూ!



ఇటీవల కాలంలో హీరోయిన్స్ ఒకరి తర్వాత ఒకరు సోషల్ మీడియాలో గ్లామర్ వలకబోస్తూ తమ పాపులారిటీ సంపాదించుకుంటున్నారు. అందులో భాగంగానే తన అందంతో, అమాయకత్వంతో ఒకప్పుడు కట్టు బొట్టుతో సాంప్రదాయంగా కనిపించిన హీరోయిన్స్.. ఇప్పుడు ఏకంగా గ్లామర్డోస్ పెంచేసి హీట్ పుట్టిస్తూ అందాలతో అదరహో అనిపిస్తుంది .ఆమె ఎవరో కాదు అందాల తార సంయుక్త మీనన్. పవన్ కళ్యాణ్, రానా కాంబినేషన్లో వచ్చిన భీమ్లా నాయక్ సినిమాతో రానా సరసన హీరోయిన్గా తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి సినిమాతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. ఆ తర్వాత బింబిసారా సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించి మెప్పించింది. ఇక ఈ మధ్యకాలంలో వరుస పెట్టి అవకాశాలు అందుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న సంయుక్త మీనన్.. తాజాగా గ్లామర్ డోస్ పెంచేసి సోషల్ మీడియా ద్వారా కొన్ని ఫోటోలను పంచుకుంది. స్లీవ్ లెస్.. ఫ్రంట్ డీప్ వీక్ కలిగిన బ్లాక్ అనార్కలి డ్రెస్ ధరించిన ఈమె అందులో సైడ్ కట్ అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎప్పుడు చీరకట్టులో కనిపించే సంయుక్త మీనన్ ఇలా హీట్ పెంచుతోంది ఏంటి అంటూ అభిమానులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి అయితే సంయుక్త మీనం షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇది చూసిన అభిమానులు.. నన్ను పెళ్లి చేసుకుంటావా అని ఒక అభిమాని అడిగితే.. ఇంకొకరు నీ అందానికి ఎంతటి వారైనా ఫిదా అవ్వాల్సిందే అంటూ కామెంట్ చేస్తున్నారు. మొత్తానికైతే ఇలా ఈమె అందాలపై అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ఉండడం గమనార్హం. సంయుక్త మీనన్ చివరిగా తెలుగులో శర్వానంద్ తో కలిసి నారి నారి నడుమ మురారి సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఇందులో సాక్షి వైద్య మరో హీరోయిన్గా నటించిన విషయం తెలిసిందే. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమా సరైన థియేటర్లు దొరకక కలెక్షన్లు సొంతం చేసుకోలేదు కానీ కంటెంట్ పరంగా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇటు అమెజాన్ ప్రైమ్ వేదికగా ఓటీటీ స్ట్రీమింగ్ కి కూడా వచ్చేసింది. ఇక్కడ ఆడియన్స్ను అలరిస్తున్నట్లు సమాచారం.సంయుక్త తదుపరి చిత్రాల విషయానికి వస్తే.. ఈ ఏడాది సంక్రాంతికి మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఈ ముద్దుగుమ్మ.. నిఖిల్ సిద్ధార్థ హీరోగా నటిస్తున్న స్వయంభూ సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. హిస్టారికల్ జానర్ లో వస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే నెలకొన్నాయి. మరొకవైపు విజయ్ సేతుపతి, పూరీ జగన్నాథ్ కాంబినేషన్లో వస్తున్న సినిమాలో కూడా ఈమె హీరోయిన్గా అవకాశాన్ని అందుకుంది. అంతేకాదు ది బ్లాక్ గోల్డ్ అనే ఉమెన్ సెంట్రిక్ యాక్షన్ మూవీలో కూడా సంయుక్త నటిస్తోంది. ఒకవైపు వరుస చిత్రాలతో బిజీగా ఉంటూనే మరొకవైపు ఆడియన్స్ ను అలరించడానికి ఇలా సోషల్ మీడియా వేదికగా అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటుంది సంయుక్త.



మడోన్నా సెబాస్టియన్ యొక్క పూల సెరినిటీ: ఎ డ్రీమీ ఎస్కేప్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965